అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 23-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 215 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

భారత్‌లో క్షీణిస్తున్న హక్కుల పరిస్థితి

- ఇది ప్రమాదకరమైనది :యూఎన్ ప్రత్యేక ప్రతినిధి ఫెర్నాండ్ డి వరెన్నెస్



న్యూఢిల్లీ: భారతదేశంలోని హక్కుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) ప్రత్యేక ప్రతినిధి ఫెడ్నాండ్ డి వరెన్నెస్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో "క్షీణిస్తున్న" హక్కుల పరిస్థితి "భారీ, క్రమబద్ధమైన, ప్రమాదకరమైనది" అని అన్నారు. వాషింగ్టన్ డీసీలో యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడం(యూఎస్‌సీఐఆర్ఎఫ్) నిర్వహించిన కార్యక్రమంలో భారతదేశంలో మతపరమైన స్వేచ్ఛపై ఆయన ఈ ...2లో

కారులో ఆ స్పీడేదీ..?

తొలి జాబితా వచ్చి నెల రోజులు పూర్తి

- అయినా అభ్యర్థుల్లో కానరాని జోష్
- అధికారిక కార్యక్రమాలు తప్ప కనిపించని పొలిటికల్ యాక్టివిటీ
- జాబితాలో చోటు దక్కినా బీ-ఫామ్ గ్యారెంటీ లేకపోవటమే కారణమంటున్న నేతలు
- ఎమ్మెల్యేల మెడకు దళిత, బీసీ, మైనారిటీ బంధు పథకాలు
- అభ్యర్థుల్లో గుబులు రేపుతున్న డబుల్

బి.వి.యన్.పద్మరాజు

కారు.. సారు.. సర్కారు... మొన్నటిదాకా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు ఉత్సాహాన్నీ, ఊపునూ ఇచ్చిన నినాదమిది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లలో పక్కాగా గెలవటం ద్వారా తమ పార్టీ మూడోసారి జెట్ స్పీడుతో దూసుకెళుతుందంటూ గులాబీ నేతలు చెప్పుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్ ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి మూణ్నెల్ల ముందుగానే 115 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. దాంతో జనం వద్దకు వెళ్లేందుకు, ఎన్నికల ప్రచారాన్ని షురూ చేసేందుకు కావాల్సినంత సమయముందని బీఆర్ఎస్ వర్గాలు భావించాయి. తద్వారా ప్రతిపక్షాలపై పైచేయి తమదేనని అంచనా వేశాయి. ఇది జరిగి సరిగ్గా నెల (ఆగస్టు 21న జాబితాను విడుదల చేశారు) దాటింది. కానీ ముందుగా అంచనా వేసినట్టు గులాబీ పార్టీలో మాత్రం ఆ జోష్ కానరావటం లేదు. ఒకవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశాలు, బహిరంగ సభలు, చేరికలతో హడావుడిని సృష్టిస్తోంది. కానీ పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మాత్రం సొంత అభ్యర్థుల్లో ఆశించిన స్పీడు లేక వెలవెలబోతోంది. తొలి జాబితా తర్వాత కారు సారు రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ రాజకీయ వాతావరణాన్ని హీటెక్కిస్తారని అందరూ అంచనా వేశారు. అందుకు భిన్నంగా ఒకట్రెండు సందర్భాల్లో తప్ప సీఎం జిల్లాలకు వెళ్లిన దాఖలాల్లేవు. అది కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవం లాంటి ముఖ్యమైన అధికారిక ...11లో

బుజ్జగింపుల మంత్రాంగం

మెత్తబడ్డ మాజీ మంత్రి తాటికొండ రాజయ్య

- ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరికి మద్దతిస్తానంటూ వెల్లడి

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో చర్చలు

వివరాలు 2లో..

అధికారమే టార్గెట్

తాయిలాలతో ముందుకొస్తున్న ఐదు రాష్ట్ర ప్రభుత్వాలు





- వీటి అమలు కోసం బడ్జెట్‌లో భారీ కేటాయింపులు
- నాలుగు రాష్ట్రాల్లో వీటి విలువ రూ.37 వేల కోట్లు
- తెలంగాణలో అధికం.. ఛత్తీస్‌గఢ్‌లో అత్యల్పం
- మిజోరంలో మాత్రం కానరాని వైనం
- సమీపిస్తున్న అసెంబ్లీ ఎన్నికలు
- వ్యూహాలకు పదునుపెడుతున్న అధికార పార్టీలు
- పథకాల ప్రకటనల్లో ఉన్న జోరు..ఆచరణలో లేకపోవడం గమనార్హం

షెడ్యూల్ ప్రకారం దేశంలో ఈ ఏడాది చివర్లో తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవటానికి అధికార పార్టీలు వ్యూహరచనతో ముందుకెళ్తున్నాయి. ఇందుకు అనేక మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నాలను చేస్తున్నాయి. ఉచిత బస్సు ప్రయాణాలు, మహిళలకు నగదు పంపిణీ, యువతులకు ఫోన్లు, స్కూటర్లు, తక్కువ ధరలకే గ్యాస్ సిలిండర్లు, ఇండ్ల నిర్మాణం కోసం ఆర్థిక సాయం.. ఇలా ఒకటేమిటి.. పెద్ద సంఖ్యలో హామీలు, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలతో అధికార పార్టీలు ఎన్నికల రణక్షేత్రానికి సిద్ధమవుతున్నాయి. ఇందుకు బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. ఈ విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉండటం గమనార్హం.

న్యూఢిల్లీ : తెలంగాణతో పాటు ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం. ఈశాన్య రాష్ట్రమైన ఒక్క మిజోరం మినహా మిగతా నాలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలు పెద్ద మొత్తంలో సంక్షేమ పథకాలు, హామీల వర్షం కురిపిస్తున్నాయి. వీటి కోసం ఈ నాలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు కలిసి మొత్తం రూ. 37,000 కోట్ల వ్యయమయ్యే సంక్షేమ పథకాలను ప్రకటించాయి. మిజోరంలో మాత్రం అలాంటివి ప్రకటించబడలేదు. కాగా, ఈ ఐదు రాష్ట్రాల్లో పథకాలు, కార్యక్రమాల మీద ఖర్చు చేసే విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా, ఛత్తీస్‌గఢ్ అట్టడుగున ఉన్నది.

మధ్యప్రదేశ్‌లో మహిళలపై దృష్టి

ఈ ఏడాది జనవరి నుంచి మధ్యప్రదేశ్‌లోని శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ సర్కారు రాష్ట్రంలోని మహిళలు, యువత ఓటర్లపై దృష్టి సారించి అనేక పథకాలను ప్రవేశపెట్టింది. లాడ్లీ బెహనా పథకం వీటిది ...2లో

'ఉచిత' హామీలు



ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ సంక్షేమ పథకాలు, ఉచితాల వాగ్దానాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఉచితాలను అనుచితం అనీ, అవి ఉరితాళ్లు అని బీజేపీ నాయకులు ఆరోపించినా.. ప్రధాని స్థాయిలో మోడీ 'రెవిడీ సంస్కృతి' అని విమర్శించినా.. ఎన్నికల రణరంగంలోకి వచ్చే నాటికి ఆ పార్టీ కూడా 'ఉచిత' బాట పడుతుండటం గమనార్హం. ఇందుకు కర్నాటక ఎన్నికలను రాజకీయ విశ్లేషకులు ఒక ఉదాహరణగా చూపిస్తున్నారు. అక్కడ కాంగ్రెస్‌ను ఢీ కొట్టడానికి ఉచిత హామీలతో బీజేపీ ముందుకొచ్చినప్పటికీ.. పాలనలో అవినీతికి విసిగెత్తిన కన్నడ ఓటరు కాషాయ పార్టీని ఓడించి హస్తానికి అధికారాన్ని కట్టబెట్టిన విషయం విదితమే. ఉచితాలను ఎన్నికల ఎరగా ఉపయోగించడం అనైతికమని కొందరు విశ్లేషకులు అంటున్నారు. అయితే మరికొందరు మాత్రం ప్రజలకు ప్రయోజనం చేకూర్చేంత వరకు అవి మంచివని సమర్థిస్తున్నారు. ముఖ్యంగా, జయలలిత, కరుణానిధిల కాలంలో తమిళనాడులో ఉచిత హామీలు అక్కడి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేశాయనీ, కలర్ టీవీలు, మిక్సర్-గ్రైండర్ల హామీలు అప్పట్లో దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీశాయని విశ్లేషకులు అంటున్నారు.

బీఆర్ఎస్‌కు మైనంపల్లి గుడ్‌బై

మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజీనామా



హైదరాబాద్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీవర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని వెల్లడించారు. మల్కాజిగిరి అసెంబ్లీ అభ్యర్థిగా హన్మంతరావును ఇప్పటికే బీఆర్ఎస్ ప్రకటించింది. మల్కాజిగిరి సీటు తనకు కేటాయించడంతోపాటు మెదక్ నుంచి తన కుమారుడికి టికెట్ ఇవ్వాలని, లేకుంటే స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తామని హన్మంతరావు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతోపాటు ...2లో

అక్టోబర్ మొదటివారంలో తొలి జాబితా

ముగిసిన స్క్రీనింగ్ కమిటీ భేటీ

- వాడివేడిగా చర్చ...వాగ్వాదం
- కేంద్ర స్క్రీనింగ్ కమిటీకి నివేదిక
- అభ్యర్థుల ఎంపికలో సునీల్ కనుగోలు నిర్ణయమే కీలకం!
- ఆశావహులకు నచ్చజెప్పిన తర్వాతే జాబితా విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ భేటీ ముగిసింది. రెండు రోజులుగా అభ్యర్థులపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థులపై తీవ్రమైన కసరత్తు చేసింది. కొన్నింటిపై ఏకాభిప్రాయం కుదిరినా...చాలా నియోజకవర్గాలకు ఎంపిక చేసే విషయంలో భిన్నాభిప్రాయాలొచ్చాయి. తమ అనుయాయుల పేర్లు చెప్పేందుకు నేతలు ఎక్కువ ఉత్సాహం చూపినట్టు తెలిసింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క మధ్య వాడివేడిగా చర్చ జరిగినట్టు తెలిసింది. అసెంబ్లీ అభ్యర్థుల విషయంలో తేలకుండానే ఎంపీ అభ్యర్థుల విషయంలో లీకులు ఎందుకిస్తున్నారంటూ ఉత్తమ్ అనడం తీవ్ర చర్చకు దారితీసినట్టు తెలుస్తోంది. మధుయాష్కీగౌడ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇద్దరూ బీసీలకు ఎక్కువగా సీట్లు కేటాయించాలని పట్టుపట్టినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. సర్వేల ప్రాతిపదికన అభ్యర్థులను ఖరారు చేయడంతోపాటు సామాజికవర్గం, అత్యంత కీలకమైన ఆర్థికాంశాలపై కూడా చర్చోపచర్చలు జరిగాయి. అంచనా లేకుండా బలహీనమైన అభ్యర్థులను రంగంలోకి దించడం ద్వారా ...11లో

బిల్లు గొప్పదే...

అమలుచేసే ఉద్దేశం కేంద్రానికే లేదు


- ఆ రెండు క్లాజులు తొలగించాలి..
- తక్షణమే అమలు చేయాలి..
- భారత మహిళల్ని అవమానించొద్దు : రాహుల్ గాంధీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా రిజర్వేషన్ బిల్లు గొప్పదేనని, అయితే ఇప్పుడు రిజర్వేషన్లను అమలు చేసే ఉద్దేశం కేంద్రానికి లేదని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. అసలు ...2లో

మరో రెండు రోజులు రిమాండ్



- వర్చువల్‌గా చంద్రబాబు విచారణ

రాజమహేంద్రవరం : స్కిల్ స్కామ్ కేసులో నిందితునిగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు రిమాండ్‌ను సెప్టెంబర్ 24 వరకూ పొడిగిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును ఈ నెల 9న పోలీసులు అరెస్టు చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులోని స్నేహ బ్యారక్‌లో ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. రిమాండ్ గడువు శుక్రవారంతో ముగియడంతో ఆయనను పోలీసులు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ...11లో



మోసం చేస్తే ఖబడ్దార్

గీతకార్మికుల హామీల అమలులో నిర్లక్ష్యం తగదు

- వాగ్దానాలు అమలు చేయకపోతే..ఎన్నికల్లో సత్తాచాటుతాం : కల్లుగీత కార్మిక సంఘం మహాధర్నాలో వక్తల హెచ్చరిక
- వేలాదిగా తరలి వచ్చిన కార్మికులు
- సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గీత కార్మికులంటే అంత చులకనా? వారి బతుకు బాధలు పట్టవా? ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయటం లేదు? ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి వందల మంది చనిపోతుంటే..ఈ సర్కారుకు పట్టదా? సమస్యలు పరిష్కరిస్తామటూ నమ్మించి మోసం చేస్తే ఖబడ్దార్..అంటూ వక్తలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ...2లో

గ్రీస్‌లో కార్మికుల నిరసన గళం

వేలాదిమంది నిరసన ప్రదర్శనలు !!

- కార్మిక వ్యతిరేక బిల్లుకు ఖండన

వివరాలు 11లో..



ప్రజల ఐక్యతను దెబ్బతీసేలా కేంద్రం కుట్ర

మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో విద్వేషం



- ఐక్యపోరాటాలతోనే హక్కుల్ని కాపాడుకోగలం
- దళారులు, వ్యాపారులకు లాభాలు...ప్రజలపై భారాలు : సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత
- మగ్గమున్న ప్రతి కార్మికునికీ రూ.10 లక్షల చేనేత బంధు ఇవ్వాలి
- వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి
- జాతీయ చేనేత సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదనీ, దానికి భావోద్వేగపరమైన మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో ప్రజల్లో విద్వేషం నింపుతున్నదని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత విమర్శించారు. దీన్ని తిప్పికొట్టేందుకు ఉత్పాదక రంగంలో అత్యంత కీలకమైన కార్మికులు, రైతులు ఒక్కతాటిపైకి వచ్చి పోరాటాలు చేయడం మంచి పరిణామం అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత హ్యాండ్‌లూమ్(చేనేత) కార్మికుల కన్వెన్షన్ నిర్వహించారు. ఈ ...11లో



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	59,840	▼	210
22 క్యారెట్లు	54,850	▼	200
కిలో వెండి	79,000	▲	1000



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 122
రిటైల్ (లైవ్)	రూ. 144
స్కిన్‌తో	రూ. 209
స్కిన్‌లెస్	రూ. 238

అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు

కొనసాగుతున్న సమ్మె

- వర్షంలోనే భారీ ర్యాలీలు
- ఆహార పంపిణీని అడ్డుకున్న వర్కర్లు



నవతెలంగాణ- విలేకరులు

సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం అంగన్‌వాడీల ఉద్యోగులు, ఆయాలు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా శుక్రవారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. వర్షంలోనూ భారీ ర్యాలీలు తీవారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని శివరాంపల్లి సెంటర్ వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఆహారం పంపిణీ చేయడానికి అధికారులు పోలీసుల సహాయంతో అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల అంగన్‌వాడీలు అక్కడికి చేరుకుని ఫుడ్ పంపిణీని అడ్డుకుని, సెంటర్ ఎదుట ధర్నా నిర్వహించారు. కొద్దిసేపు పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య వాగ్వాదం జరిగింది. చివరికి ఫుడ్ పంపిణీని అధికారులు నిలిపివేయడంతో అంగన్‌వాడీలు ధర్నా విరమించారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రఘునాథ్ యాదవ్ మద్దతు తెలిపారు. బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్మికులు ధర్నా చేశారు.

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండల కేంద్రంలో అంగన్‌వాడీలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహిపాల్ మద్దతు తెలిపారు. కొడంగల్‌లో అంగన్‌వాడీల సమ్మెకు టీఎస్‌యూటీఎఫ్ బొంరాస్‌పేట మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ మద్దతు తెలిపారు.

అంగన్వాడీల సమ్మె డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించకపోతే సమాధి చేయడం ఖాయమని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్, ఏఐటియూసీ జిల్లా అధ్యక్షులు నరాటి ప్రసాద్ హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బస్ స్టాండ్ సమీపంలోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద రెండ్రోజుల రిలే దీక్షలను ప్రారంభించారు. టేకులపల్లి, ఆళ్లపల్లి మండలాల్లో సమ్మె శిబిరాన్ని ఏజే.రమేష్ సందర్శించి మాట్లాడారు. ఇల్లందులో ప్రజాపంథా నాయకులు సంఘీభావం తెలిపారు. చర్లలో సీఐటీయూ నాయకులు సమ్మె శిబిరంలో కూర్చున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బి గెస్ట్‌హౌస్ నుంచి భారీ ర్యాలీ తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ కార్యాలయం ముందు రిలే దీక్షలను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు ప్రారంభించారు. బల్మూరు మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మెకు గర్భిణులు, బాలింతలు సంఘీభావం తెలిపారు. నారాయణ పేట జిల్లాలో వర్షంలోనే అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు.

నల్లగొండ జిల్లా హాలియా మండలంలో సమ్మెలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈసీఐఎల్ కేంద్రంలో సీఐటీయూ ఆఫీసు నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం దగ్గర ధర్నా చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి రిలే దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ జేఏసీ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిశీలించాలని అన్నారు. ములుగు జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ దీక్షను ప్రారంభించారు.

పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- సర్టిఫికెట్లు ఇవ్వని కళాశాలల యాజమాన్యాలు
- స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి రూ.5,177 కోట్లు : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. నాగరాజు
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ 'ఫీజు దీక్ష'



నవతెలంగాణ-కాప్రా/ విలేకరులు

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'ఫీజు దీక్ష' చేపట్టారు. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తాలో ఫీజు దీక్షను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాథోడ్ సంతోష్ ప్రారంభించారు. అనంతరం దీక్ష ముగింపులో టి.నాగరాజు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ. 5,177 కోట్లను ప్రభుత్వం ఇప్పటివరకు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నాలుగు డిమాండ్లపై రాష్ట్ర వ్యాప్తంగా ఫీజుల దీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. బడుగు బలహీన తరగతుల విద్యార్థుల కోసం అడిగింది ఇస్తామని చెప్పి కేసీఆర్ సర్కార్ మోసం చేసిందన్నారు. చదువు పూర్తయినా విద్యార్థుల సర్టిఫికెట్లను కార్పొరేట్, ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు ఇవ్వడం లేదని, ఫీజు డబ్బులు మొత్తం కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల్లో సర్టిఫికెట్లను వెంటనే విద్యార్థులకు ఇచ్చేటట్టు జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులను దీక్ష విరమింపజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పరాల నరేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్ర అశోక్, జె.చంద్రశేఖర్ ఫీజు దీక్షకు సంఘీభావం తెలియజేశారు. ఫీజుల దీక్షకు దాదాపు పది కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, అరుణ్, నాయకులు భగత్, కార్తిక్, శివ, శ్యామ్, అనిల్, శివ, భాస్కర్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5,177 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. వీరి దీక్షకు డీవైఎఫ్ఐ, ఎమ్మార్పీఎస్ సంఘాలు మద్దతు తెలిపాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ దగ్గర ఎస్ఎఫ్ఐ నాయకులు ఫీజు దీక్ష నిర్వహించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ దీక్షకు పీడీఎస్‌యూ నాయకులు మారుతీ, సీతారాం, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు సురేష్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ మద్దతు తెలిపారు.

ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ ఎదుట టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్నం రాజేందర్ మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, నాయకులు సునీల్ సంఘీభావం తెలిపారు. హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కాలేజీ వద్ద, జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఫీజు దీక్ష చేపట్టారు.

బిల్లు గొప్పదే...అమలుచేసే ఉద్దేశం కేంద్రానికే లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పటి నుంచి అమలు చేస్తారో కూడా ఎవరికీ తెలియదని చెప్పారు. కులగణన వంటి డిమాండ్ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు వ్యూహాత్మక ఎత్తుగడలో భాగంగానే కేంద్రం ఈ బిల్లు తీసుకువచ్చిందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఉభయసభల ఆమోదం పొందిన నేపథ్యంలో శుక్రవారం నాడిక్కడ ఏఐసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ గతంలో చేసిన జనాభా గణాంకాల వివరాలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని, ఓబీసీలు, ఇతర బలహీన వర్గాల జనాభాను నిర్ధారించేందుకు తాజా కుల గణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉందని, అయితే ఏ తేదీ నాటికి అమలు చేస్తారనే విషయంలో మాత్రం ఎలాంటి స్పష్టత లేదని చెప్పారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన వంటివి జరగాలంటూ రెండు క్లాజ్‌లు ఉన్నాయని చెప్పారు. ఈ రెండింటికీ ఏండ్లు పడుతుందన్నారు. ఈ రెండు క్లాజ్‌లను (జనగణన, డీలిమిటేషన్) తొలగించి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయాలని, భారతదేశ మహిళల తెలివితేటలను అవమానించవద్దని సూచించారు. "ఈరోజు నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి. ఇదేమంత కష్టమైన పని కాదు. కానీ ప్రభుత్వానికి ఆ ఉద్దేశం లేదు. ఇది కేవలం సమస్యలను పక్కదారి పట్టించే ఎత్తుగడ" అని రాహుల్ ఆరోపించారు. ఓబీసీ జనగణన గురించి, భారత ప్రభుత్వంలో ఓబీసీలకు తగినంత ప్రాధాన్యం లేకపోవడాన్ని పార్లమెంటులో తాను లేవనెత్తానని అన్నారు. 90 మంది సెక్రటరీల్లో ముగ్గురే ఓబీసీలు ఉన్నారని అన్నారు. ప్రధాని ప్రతిరోజూ ఓబీసీల గురించి మాట్లాడతారని, కానీ వారికి ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు.

బీఆర్ఎస్‌కు మైనంపల్లి గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలో, ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రి హరీశ్‌రావుపైనా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. సీఎం కేసీఆర్ అభ్యర్థుల జాబితా ప్రకటించడానికి కొద్ది సమయానికి ముందు ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తీరా అభ్యర్థుల జాబితాలో మల్కాజిగిరి అభ్యర్థిగా ఆయన పేరు ఉండటంతో ఇదే విషయాన్ని విలేకరులు సీఎం వద్ద ప్రస్తావించారు. 'టికెట్ కేటాయించాం. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలా? లేదా అనేది ఆయన ఇష్టం' అని సీఎం వ్యాఖ్యానించారు. అనంతరం మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తదితరులు మైనంపల్లి వ్యాఖ్యలను ఖండించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌ను వీడుతున్నట్టు మైనంపల్లి ప్రకటించారు.

బుజ్జగింపుల మంత్రాంగం

- మెత్తబడ్డ మాజీ మంత్రి తాటికొండ రాజయ్య
- ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరికి మద్దతిస్తానంటూ వెల్లడి
- ప్రగతి భవన్‌కు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో చర్చలు
- త్వరలో కారెక్కనున్న ఏపూరి సోమన్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ అధికార బీఆర్ఎస్‌లో మంత్రాంగాలు, బుజ్జగింపుల పర్వాలు జోరందుకుంటున్నాయి. తద్వారా అలకలు, అసంతృప్తులు, అసమ్మతులను చల్లార్చేందుకు సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఇవే సీన్లు కొనసాగాయి. మాజీ మంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య... బీఆర్ఎస్ తొలి జాబితాలో చోటు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో సీనియర్ నేత, మాజీ మంత్రి కడియం శ్రీహరికి టిక్కెట్ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారు. ఆ మేరకు ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని నెల రోజుల నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్న రాజయ్య రకరకాల రూపాల్లో తన నిరసనను వ్యక్తం చేస్తూ వచ్చారు. 'ఘన్‌పూర్‌కు ఎంతోమంది లీడర్లు వస్తుంటారు, పోతుంటారు.. కానీ నేను మాత్రం లోకల్...' అంటూ సవాల్ విసిరారు.

అలాంటి రాజయ్య అకస్మాత్తుగా ఆయన చల్లబడ్డారు. శుక్రవారం ప్రగతి భవన్‌లో కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయనతో సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. వారు రాజయ్యను బుజ్జగించి శాంతింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి గెలుపుకోసం కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు సంపూర్ణ మద్దతునిస్తున్నట్టు ప్రకటించారు. రాజయ్యకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ సీటును కేటాయిస్తామంటూ సీఎం హామీనిచ్చినట్టు సమాచారం. ఈ ఒప్పందంలో భాగంగానే ఆయన ఘన్‌పూర్ సీటును శ్రీహరి కోసం త్యాగం చేసినట్టు తెలిసింది. మరోవైపు తొలి జాబితాలో చోటు దక్కని జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కూడా బీఆర్ఎస్ బాస్ అనేక విధాలుగా 'నచ్చజెప్పినట్టు' వినికిడి. ముత్తిరెడ్డిని ప్రగతి భవన్‌కు పిలిపించుకున్న కేసీఆర్... ఆయన్ను 'ఒప్పించి, మెప్పించినట్టు' బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పటిదాకా తనకు కాకుండా వేరే వారికి సీటు ఇస్తే సత్తా చూపుతానంటూ హెచ్చరించిన ముత్తిరెడ్డి... సైలెంటయ్యే అవకాశాలే ఎక్కువగా కనబడుతున్నాయి. ఆయన స్థానంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి గానీ, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి (కేటీఆర్ అనుచరుడు, సన్నిహితుడు)కి జనగామ టిక్కెట్ ఇచ్చే అవకాశాలున్నాయంటూ మొదటి నుంచీ ప్రచారం జరుగుతున్న సంగతి విదితమే. అయితే ఆ ఇద్దరిలో పల్లాకే ఎక్కువ ఛాన్స్ ఉందనీ, ఈ నిర్ణయం దాదాపు ఖాయమైందని ఒక సీనియర్ ఎమ్మెల్యే తెలిపారు.

మరోవైపు ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న త్వరలోనే కారెక్కనున్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం కలిసి చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సీనియర్ నాయకులు దాసోజు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేస్తే ఖబడ్దార్

(మొదటిపేజీ తరువాయి)

ఇందిరాపార్కువద్ద కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలలనుంచి వేలాదిగా కల్లుగీత కార్మికులు తరలి వచ్చారు. కల్లుముంతలు, తాటికమ్మలు, మోకు ముస్తాదుతో..తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ..దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ సభా ప్రాంగణానికి గుంపులు, గుంపులుగా వారు చేరుకున్నారు ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ మాట్లాడుతూ గీత కార్మికులకు ఇచ్చిన హామీల విషయంలో బీఆర్ఎస్ సర్కార్ తీరు 'నోటితో దీవించి నొసటితో వెక్కిరించిన' చందంగా ఉందని విమర్శించారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ అధ్వర్యంలో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ గీతన్నలపై వరాల జల్లు కురిపించారని గుర్తు చేశారు. వృత్తిలో ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటామనీ, ద్విచక్ర వాహనాలు ఇస్తామనీ, లిక్కర్ షాపుల్లో గౌడలకు ఇచ్చే 15 శాతం రిజర్వేషన్లు సొసైటీలకు ఇస్తామనీ, గీతన్న బీమా పథకం అమలు చేస్తామంటూ హామీ ఇవ్వలేదా? అని ప్రశ్నించారు. వాటిని ఎందుకు అమలు చేయటం లేదో కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమానికి రూ. 100 కోట్లు కేటాయించామని గొప్పలకు పోయి.. బడ్జెట్ పత్రంలో మాత్రం రూ. 30 కోట్లు మాత్రమే చూపించారన్నారు. ఇది గీత కార్మికులను మోసం చేయటం కాదా? అని ప్రశ్నించారు. బడ్జెట్ పెట్టి ఆరు నెల్లవుతున్నా ఇప్పటికి ఒక్క రూపాయికి కూడా ఖర్చు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌కు తగిన బడ్జెట్ కేటాయించకుండా, వృత్తిలో ఆధునిక పద్ధతులు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోకుండా మాటలతో కాలం గడపాలని చూస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు.

రాష్ట్రంలో కల్లు గీస్తున్న గీత కార్మికుల బతుకులకు భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి క్రమంలో వందలాది మంది చనిపోతున్నారని చెప్పారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు 18 డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో గీతకార్మిక సొసైటీలకు అప్పటి ప్రభుత్వాలు ఇచ్చిన భూములకు రక్షణ లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్టర్ల కన్ను పడటంతో అవి అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆయా సొసైటీల పరిధిలో ఉన్న భూములకు ప్రభుత్వమే రక్షణ కోసం. కంచెలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లారి గోవిందు, వి.వెంకటనర్సయ్య, గౌని వెంకన్న, బాల్నె వెంకటమల్లయ్య, బాలగాని జయరాములు కార్యదర్శులు యస్. రమేష్ గౌడ్, చౌగాని సీతరాములు, బూడిద గోపి, బండకింది అరుణ్, గాలి అంజయ్య తదితరులు మాట్లాడారు.

భారత్‌లో క్షీణిస్తున్న హక్కుల పరిస్థితి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. "భారత్ ప్రపంచంలో దురాగతాల ప్రధాన ఉత్పాదక దేశాలలో ఒకటిగా మారే ప్రమాదం ఉన్నది. ప్రధానంగా మతపరంగా ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఉల్లంఘనలు, దుర్వినియోగాలు భారీ స్థాయిలో ఉంటున్నాయి. ఇవి అస్థిరత, దౌర్జన్యాలు, హింస ప్రధాన జనరేటర్లు. ఇది కేవలం వ్యక్తి లేదా స్థానికమైనది కాదు. ఇది క్రమబద్ధమైనది, మతపరమైన జాతీయవాదానికి ప్రతిబింబం" అని తెలిపారు. యూఎన్ ప్రత్యేక ప్రతినిధి మణిపూర్ ఘటనను చాలాసార్లు గుర్తు చేశారు. మే 4న జరిగిన ఒక సంఘటనపై వైరల్ అయిన వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు గురి చేసిన విషయం విదితమే. "ఈ వీడియో అంతర్జాతీయ దృష్టికి వచ్చే వరకు అధికారుల నుంచి చర్యలు నిష్క్రియాత్మకంగా ఉన్నాయి" అని అతను చెప్పాడు. 2014 నుంచి 2018 మధ్య మైనారిటీలపై ద్వేషపూరిత నేరాలు 786 శాతం పెరిగాయని అతను ఒక అధ్యయనాన్ని ఉదహరించాడు. అసోంలో ఎన్నార్సీ, జమ్ముకాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావించారు.

మహిళలకు రిజర్వయితే ఖమ్మం సీటు త్యాగం

- ప్రభావితం చేయగల మహిళలకు చాన్స్ : మంత్రి పువ్వాడ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో మహిళలకు ఖమ్మం సీటు రిజర్వ్ అయితే తాను వారికి ఇచ్చేందుకు సిద్ధమని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. అలా అని తన భార్యనో, కోడలినో పోటీలో నిలపనని స్పష్టంచేశారు. ప్రభావితం చేయగల మహిళలకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలనేది తన భావనగా చెప్పుకొచ్చారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం గృహలక్ష్మి, జీవో 58 ఇండ్ల పట్టాల పంపిణీ సందర్భంగా పువ్వాడ మాట్లాడారు. చట్టసభల్లో 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా అక్కచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఆకాశంలో సగం.. సమాజంలో సగమన్నారు. ఇంతకాలం కోట్లాడిన తర్వాతైనా మహిళలకు రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమని తెలిపారు. ఖమ్మం సీటు వచ్చేసారి మహిళలకు రిజర్వేషన్ అయితే సంతోషించే వాళ్లలో తాను ముందుంటానన్నారు. అలా అని తన ఇంట్లో నుంచి తన భార్య, కోడలునో పోటీ పెట్టనని హామీ ఇస్తున్నట్టు ప్రకటించారు. సమాజంలో ప్రభావితం చేయగలిగిన మహిళలకు పోటీ చేసే అవకాశం ఇస్తే బాగుంటుందన్నారు. తానూ కేటీఆర్ బాటలోనే సీటు త్యాగం చేసేందుకు సిద్ధమన్నారు.

అక్టోబర్ 2 నుంచి మళ్లీ సమ్మెలోకి జీపీ కార్మికులు

- అప్పటిలోగా మంత్రి ఎర్రబెల్లి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- సమ్మె డిమాండ్లు, మంత్రి హామీలపై దశలవారీగా పోరాటం: పాలడుగు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులకు చర్చల సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వచ్చే నెల రెండో తేదీ నుంచి మళ్లీ జీపీ కార్మికులు సమ్మెలోకి వెళ్లబోతున్నట్టు తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ ప్రకటించారు. ఇప్పటికే సమ్మె నోటీసును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అందజేశామని తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 34 రోజుల సమ్మె సందర్భంగా కారోబార్, బిల్‌కలెక్టర్లు, గుమాస్తాలను సహాయకార్యదర్శులుగా నియమిస్తామనీ, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, 8 గంటల సెలవు, వారాంతపు, పండుగ సెలవులు తదితర కోర్కెలను సమ్మె విరమిస్తే వెంటనే నెరవేరుస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు, ఆర్థికంతో ముడిపడిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని కూడా హామీనిచ్చారని తెలిపారు. మంత్రి హామీతో సమ్మె విరమించి 45 రోజుల దాటినా ఉలుకూపలుకూ లేదని విమర్శించారు. ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుండా చావుఖర్చులు, ఇన్సూరెన్స్ సర్క్యులర్‌లు జారీ చేసి చేతులు దులుపుకోవడంపై కార్మికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు.

అధికారమే టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమైనది. ప్రస్తుత సంవత్సరంలో ఈ కార్యక్రమానికి మొత్తం బడ్జెట్ కేటాయింపులలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 3,628.85 కోట్ల నుంచి అధికంగా రూ. 8,000 కోట్లకు పెంచింది. ఈ రాష్ట్రంలో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో కనీసం 18 స్థానాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. దీంతో రాష్ట్రంలో మహిళలకు ఉద్దేశించిన అనేక పథకాల్లో ఈ పథకం ఒకటిగా ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5.4 కోట్ల మంది ఓటర్లలో 2.6 కోట్ల మంది మహిళలు ఉన్నారు. అలాగే, 12వ తరగతి టాపర్‌లకు ఉచిత స్కూటర్లు, స్టైఫండ్‌తో యువకులకు వత్తి శిక్షణా కార్యక్రమాన్ని కూడా ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ కార్యక్రమాల కోసం ప్రభుత్వం వరుసగా రూ.135 కోట్లు, రూ.1,000 కోట్లు కేటాయించింది. వీటితో పాటు ఇతర ఉచిత, సంక్షేమ పథకాలకు అధికార పార్టీ హామీలిచ్చింది.

రాజస్థాన్‌లో ఫోన్‌లు, ఎల్పీజీ సిలిండర్లు, విద్యుత్

రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ హామీల ప్రకటనతో ముందుకెళ్తున్నది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఉచిత మొబైల్ ఫోన్‌ల నుంచి ఎల్పీజీ, విద్యుత్‌పై సబ్సిడీల వరకు సంక్షేమ పథకాల శ్రేణిపై ఎక్కువ దృష్టిని సారించారు. గత కొన్ని నెలలుగా ప్రకటించబడిన ఈ కార్యక్రమాలతో రాష్ట్ర ఖజానాపై రూ. 12,700 కోట్ల భారం పడనున్నదని అంచనా. అదనంగా, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యావంతులైన పారిశ్రామికవేత్తలకు వారి వ్యాపారాలను స్థాపించడంలో ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో యువ ఉద్దం యోజన కోసం రూ.100 కోట్లు కేటాయించారు.

అత్యధిక వ్యయంతో అగ్రస్థానంలో తెలంగాణ

దేశంలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్ సర్కారు అనేక రకాల ఉచితాలు, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. రైతు బంధు ద్వారా రైతులకు, కేసీఆర్ కిట్ ద్వారా తల్లులు, నవజాత శిశువులకు ఆర్థిక సహాయం వంటివి రాష్ట్ర సర్కారు అమలు చేసింది.

అలాగే, నిరుపేదలకు డబుల్‌బెడ్రూమ్ ఇండ్లను ప్రకటించింది. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాల వధువులకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించే దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చింది.ఇక, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ఆసరా పెన్షన్ కార్యక్రమం కింద ఆర్థిక సాయాన్ని అందిస్తున్నది.

2023-24 బడ్జెట్‌లో, రైతు బంధుకు రూ. 15,075 కోట్లు, దళిత బంధు కోసం రూ. 17,700 కోట్లు, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పథకం కోసం రూ. 7,890 కోట్ల కేటాయింపులను రాష్ట్ర ప్రభుత్వం చేసింది. ఇక కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు రూ.3,210 కోట్లు కేటాయించారు. అదనంగా, పెన్షన్ పంపిణీకి రూ.12,000 కోట్లు, రైతుల రుణమాఫీ కోసం రూ.6,385.20 కోట్లు కేటాయించింది రాష్ట్ర ప్రభుత్వం.

అంతేకాదు, మహిళా ఓటర్లు, మైనార్టీ వర్గాలను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎన్నికల సంవత్సరంలో మూడు కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉన్న మతపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన కుటుంబాలకు రూ.1 లక్ష ఆర్థిక సాయం అందించేందుకు రూ.400 కోట్లు కేటాయించింది. సంప్రదాయ చేతివృత్తులకు చెందిన వెనుకబడిన తరగతుల లబ్దిదారులకు మరో రూ.400 కోట్లు కేటాయింపులు చేసింది. గృహలక్ష్మి పథకం కూడా ప్రకటించింది.

తెలంగాణలో దాదాపు 55 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రంలో దళితులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. 119 అసెంబ్లీ స్థానాల్లో 19 ఎస్సీలకు రిజర్వ్ చేయబడ్డాయి. ఇక మైనారిటీలు రాష్ట్ర ఓటర్లలో 12.5 శాతం ఉన్నారు. 30 అసెంబ్లీ నియోజకవర్గాలపై వారు ప్రభావం చూపనున్నారు. తెలంగాణ ఓటర్లలో దాదాపు సగం మంది మహిళలు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో తక్కువ ఖర్చు

నాలుగు రాష్ట్రాలలో, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొత్త పథకాలపై రూ.638 కోట్ల నిరాడంబరమైన వ్యయంతో వెనుకంజలో ఉంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఈ వ్యయంలో గణనీయమైన భాగాన్ని నిరుద్యోగ భృతి కార్యక్రమానికి కేటాయించింది. యువతకు నెలకు రూ. 2,500 అందించే ఈ కార్యక్రమానికి జరిపిన బడ్జెట్ కేటాయింపు రూ. 250 కోట్లుగా ఉన్నది.

అలాగే, కొత్త గృహనిర్మాణ పథకం, గ్రామీణ ఆవాస్ న్యాయ్ యోజన (గ్రామీణ గృహనిర్మాణ పథకం) కోసం రూ.100 కోట్లు కేటాయించింది. 2022-23 బడ్జెట్‌లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా ముఖ్యమంత్రి కన్యా వివాహ యోజన కింద గ్రాంట్‌ను రూ. 25,000 నుంచి రూ. 50,000కి పెంచింది. రాష్ట్ర ఖజానాపై దీని భారం రూ. 89 కోట్లు. ఇంకా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు నెలవారీ గౌరవ వేతనం రూ.6,500, రూ.3,250 నుంచి రూ.10,000, రూ.5,000లకు పెరిగింది. ఈ మార్పులకు అనుగుణంగా రూ.250 కోట్ల బడ్జెట్ కేటాయింపు జరిగింది.

మిజోరంలో కానరాని ఎన్నికల వాగ్దానాలు

మిగతా నాలుగు రాష్ట్రాలకు విరుద్ధంగా ఈశాన్య రాష్ట్రం మిజోరం నిలిచింది. అక్కడ ఇలాంటి ఎన్నికల వాగ్దానాలు, పథకాలు ఏవీ కానరాలేదు. ఇక్కడ ఎంఎన్ఎఫ్ అధికారంలో ఉన్నది. సీఎం జోరమ్‌తంగా నాలుగోసారి పదవిని చేపట్టాలని చూస్తున్నారు.

తెల్ల బంగారానికి 'తెగులు'

ఎర్ర తెగులు బారిన పైరు

- ఎండిపోతున్న మొక్కలు
- పంట మార్పిడి చేయకపోవడమే కారణమంటున్న అధికారులు

విత్తనం వేసింది మొదలుకొని పంట చేతికి వచ్చేదాకా రైతన్న పడని కష్టం లేదు. మొదట్లో వర్షం కోసం ఎదురుచూడటం, విత్తనం నాటిన తర్వాత మొలకెత్తేందుకు తగినంత నీటి కోసం.. ఆ తరువాత తెగుళ్ల బెంగ.. పంట చేతికి వచ్చిన తర్వాత మద్దతు ధర కోసం పోరాడాలి. ఇలా రైతు నిరంతరం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. గతేడాది పత్తికి ధర లేక రైతులు ఇప్పటికీ ఇండ్లల్లోనే నిల్వ చేసుకున్న రైతులు ఉన్నారు. ఈసారి వేసిన పైరును తెగుళ్లు వెంటాడుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



ఫంగల్ డిసీజ్ వల్లనే..

ఖరీఫ్‌లో పంటకు ఫంగల్ డిసీజ్ సోకింది. పత్తి పంటపై దీని ప్రభావం అధికంగా కనిపిస్తుంది. శిలీంద్రం ప్రభావం చేత ఆకులు ఎర్రబడతాయి. ఒక ప్రాంతంలో వేసిన పంట వేయకుండా పంట మార్పిడి చేయాలి. ఈ తెగులు సోకితే ట్రైకో ధర్మ పౌడరుని నీళ్లలో కలిపి చెట్టు మొదల్లో పోయాలి. దీంతో కాస్త పంటకు మేలు కలుగుతుంది.

- వెంకటేశ్వర్లు, జేడీఏ -మహబూబ్‌నగర్

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఈ ఏడాది మే చివరి వారంలో వర్షాలు కురిశాయి. దీంతో రైతన్నలు పొలం పనులు పూర్తిచేసుకుని జూన్ రెండో వారంకల్లా విత్తనాలు వేశారు. విత్తనం వేసిన తర్వాత వర్షాలు లేక నానా తంటాలు పడి పైరును కాపాడుకున్నారు. రెండు మూడు సార్లు విత్తనాలు వేసి ఎకరాకు 20వేలకు పైగా పెట్టుబడి అదనంగా పెట్టారు. స్ప్రింక్లర్ల ద్వారా నీటిని పెట్టి పత్తి చేనును కాపాడుకున్నారు. ఎన్ని చేసినా చివరకు రైతుకు పత్తి పంట నిరాశనే మిగిల్చింది. పూత కాత దశలో ఎర్ర తెగులు చుట్టుముట్టింది. పూత, కాయలు రాలిపోతున్నాయి. వ్యవసాయ అధికారులను అడిగితే.. వేసిన పంట వేయొద్దని.. పంట మార్పిడి చేయాలని చెబుతున్నారు. అయితే, రెండు మూడు సంవత్సరాలు పడావు ఉన్న భూమిలో వేసిన పంట సైతం ఎండు తెగులుకు గురైంది. రైతులు ఎకరాకు రూ.40వేలకు పైగా ఖర్చు చేశారు. పెట్టుబడి వచ్చే పరిస్థితులు కనబడటం లేదని ఆందోళన చెందుతున్నారు.



పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. పత్తికి ఎర్ర తెగులు వచ్చి పూర్తిగా ఎండిపోయింది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

ఏ రాములు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8.50 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. నాగర్‌కర్నూల్ 3.50 ఎకరాల లక్షల ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో లక్ష ఎకరాలు, నారాయణపేటలో 1.75 లక్షలు, వనపర్తిలో 75వేల ఎకరాలు, గద్వాలలో లక్షన్నర ఎకరాలు సాగు చేశారు. గద్వాలలో 50వేల ఎకరాలకు పైగా విత్తన పత్తి సాగు చేస్తారు. ఈ పైరును ఎర్ర తెగులు పీడిస్తోంది. ఇది అధిక వర్షాలతో వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువనే నమోదైంది. అత్యంత సారవంతమైన నల్ల రేగడి, ఎర్ర భూముల్లో సాగుచేసిన పత్తి పంటలకు సైతం ఎర్ర తెగులు రావడం ఆందోళన కలిగించే విషయం. తెలకపల్లి మండల పరిధిలో పెద్దూరు, బొప్పెల్లి, ఆలేరు, ఒట్టిపెల్లి, కమ్మరెడ్డిపల్లి, తెలకపల్లి, మరికల్, నడిగడ్డ, తాళ్లపల్లి, కారువంగా తదితర ప్రాంతాల్లో పత్తి పంటను అధికంగా సాగు చేస్తారు. అధికారిక లెక్కల ప్రకారం తెలకపల్లి మండలంలో 25 వేల ఎకరాలకుపైగా పత్తి సాగైంది. ఇదే మండలం నడిగడ్డ గ్రామంలో 2800 ఎకరాల సాగు భూమి ఉంది. 850 ఎకరాలపైగా పత్తి పంటను సాగవుతుంది. బర్ల సురేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి గోవర్దన్ రెడ్డి, సాగుచేసిన 15 ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. సుమారు ఐదు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వచ్చే ముందు ఎర్ర తెగులు రావడం వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలో 80శాతం పంటల పరిస్థితి ఇలాగే ఉంది. జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

పెట్టుబడి కూడా వచ్చేట్టు లేదు

ఆరుగాలం కష్టం చేసి వేసిన పత్తి పైరుకు ఎర్ర తెగులు సోకింది. ఎకరాకు రూ.40 వేల పైగా పెట్టుబడి అయింది. లాభం రాకపోయినా అప్పులు తీరితే బాగుండేది. వర్షాలు లేకపోయినా పంటలు కాపాడుకున్నాం. అయినా ఎర్ర తెగులు మమ్మల్ని ముంచింది.

- రైతు లక్ష్మారెడ్డి, నడిగడ్డ.



అధ్వాన్నంగా పారిశుధ్యం

- మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- కాలువల్లో దిగి నిరసన వ్యక్తం చేసిన జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయని, ప్రజలు అవస్థలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద మురుగు కాలువను ఆయన పరిశీలించారు. చెత్తాచెదారంతో నిండిన కాలువలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. పట్టణంలోని గాంధీనగర్, సీతారాంపురం, షాబునగర్, ముత్తిరెడ్డి కుంట హనుమాన్‌పేట మురికి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోందన్నారు. జనావాసాల్లోని కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. వర్షం వచ్చినప్పుడల్లా కాలువలో నీరు నిల్వ ఉంటుందన్నారు. ఎన్నికలపై దృష్టి తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. తక్షణమే మురికి కాలువల్లో చెత్తను తొలగించాలని, మురుగు నీరు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరుశురాములు, ఎండీ.అంజాద్ పాల్గొన్నారు.



పోస్టల్ శాఖ సేవలు విస్తృతం

ఓయూ వీసీ రవీందర్

- పోస్టల్ ఉద్యోగులకు రీజినల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానం

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో పోస్టల్ శాఖ విస్తృతమైన సేవలు అందిస్తోందని ఓయూ వీసీ రవీందర్ అన్నారు. తెలంగాణ పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రీజినల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్ ఓయూ క్యాంపస్‌లోని జామై ఉస్మానియా పోస్ట్ ఆఫీస్ ఆవరణలో నిర్వహించారు. బాధ్యతలో ప్రతిభ చూపి, విధులు సక్రమంగా నిర్వహించి, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సేవలు అందించడంలో ముందంజలో ఉన్న రాష్ట్ర వ్యాప్త పోస్టల్ ఉద్యోగులకు ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓయూ వీసీ మాట్లాడుతూ.. ప్రతి పోస్ట్ ఆఫీసు దాదాపుగా 250 సేవలు అందిస్తోందన్నారు. కస్టమర్లు పోస్ట్ ఆఫీసుకు రాకుండా పోస్ట్‌మ్యాన్ లేదా జీడీఎస్ ద్వారా ఇంటి వద్దనే 160 సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ సర్వీస్‌లను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ సేవలకు హైదరాబాద్ నగరం, జిల్లాలు, గ్రామాల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన 31 మందికి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ సాయి పల్లవి, జనరల్ పోస్ట్ మాస్టర్ హెచ్.ఆర్ విద్యాసాగర్, కె.ఏ.దేవరాజ్, డీటీఎస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థినీలపై పోలీసుల దాడి అమానుషం : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిరసన తెలిపిన విద్యార్థినీలపై పోలీసులు దాడి చేయటం అమానుషమనిఅఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అరుణజ్యోతి, మల్లు లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెద్దపల్లి జిల్లా బాలికల జూనియర్ కాలేజీ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు కోసం భూమి పూజ చేయొద్దంటూ నిరసన తెలియజేసిన విద్యార్థినీలు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని తెలిపారు. వారిని అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఈ ఘటన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించటమేనని తెలిపారు. మరొక ప్రాంతంలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని విద్యార్థినులందరూ చెప్పినా వినకుండా స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మంత్రి కొప్పుల ఈశ్వర్ సాక్షిగా ఈ దాడి జరగడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థినీలపై స్టేషన్‌లో విచక్షణారహితంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలు

సమ్మె విరమించాలి

- ప్రభుత్వం జీవో వచ్చాక సమ్మె చేయడమేంటి? : మంత్రి సత్యవతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అంగన్‌వాడీలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రెగ్యులర్ చేయాలనే డిమాండ్ కేంద్రం పరిధిలోనిదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వారి తరుపున లేఖ రాస్తామని చెప్పారు. అవసరమైతే కేంద్ర మంత్రులను స్వయంగా కలుస్తామన్నారు. తక్షణం అందరూ విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలకు సంబంధించిన పలు అంశాలపై ప్రభుత్వం జీవో విడుదల చేసిన తర్వాత వారు సమ్మెను కొనసాగించటమేంటని ప్రశ్నించారు.

ఆదివాసీ, దళిత

పోలీసులపై తగు చర్యలు తీసుకోవాలి

ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్‌లకు అంగన్వాడీ జేఏసీ, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఫిర్యాదు

అంగన్వాడీలపై దాడి దారుణం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ, దళిత మహిళ అంగన్వాడీ ఉద్యోగుల పైన పోలీసులు దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించి, కొట్టి గాయపర్చడం దారుణమనీ, ఘటనకు కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ జేఏసీ, తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ(సీఐటీయూ అనుబంధం)లు ఎస్సీ,ఎస్టీ, మహిళా కమిషన్‌లకు వేర్వేరుగా ఫిర్యాదు చేశాయి. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ జేఏసీ నేతలు పి. జయలక్ష్మి (సీఐటీయూ), ఎన్. కరుణ కుమారి (ఏఐటీయూసీ), సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కె ఈశ్వరరావులు ఉన్నారు. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్వీ.రమ, సభ్యులు ఎం.మీనా, ఎ.సునీత ఉన్నారు. ఆదివాసీ, దళిత మహిళలపై దాడి చేసిన ఎస్ఐ, సీఐ, డీఎస్పీ తదితరుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీసులే దాడి చేసి అంగన్‌వాడీలే తమను కొట్టారని తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని కమిషన్ల దృష్టికి తీసుకెళ్లారు. 'ఆదిలాబాద్‌లో ఈ నెల 20న కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అంగన్‌వాడీలు వెళ్లగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. మగపోలీసులు వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. తలమడుగు ఎస్ఐ ధనశ్రీ ఆదివాసీ, దళిత అంగన్‌వాడీలను పట్టుకుని గోండు, కొలాం లం.., బొడ్డు ముండలు, కల్లుతాగి ఇక్కడికి వచ్చారు. రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు అంటూ కులం పేరుతో దూషించారు. జుట్టు పట్టుకొని చీరలు ఊడిపోయేలా కొట్టారు. మిగిలిన పోలీసులు ఆమెను అనుసరించి చేతికి అందినవారిని అందినట్టు కొట్టారు. మగ పోలీసులు దుర్భాషలాడారు' అని వివరించారు. 'ఆ ఘటనలో మన్నూరు గ్రామానికి చెందిన కె.సులోచన గొంతుకు గాయాలయ్యాయి. సైదుపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కనక ప్రగతి(ఎస్టీ) పోలీసుల దెబ్బలకు స్పృహ తప్పి పడిపోయింది. మరో అంగన్‌వాడీ కార్యకర్త ప్రేమకుమారి(దళిత)ని ఎస్ఐ ధనశ్రీ జుట్టుపట్టుకుని కొట్టారు. నార్నూర్ గ్రామానికి చెందిన కె.పంచశీల, గుంజాలకు చెందిన జి.రేఖ ప్రధాన్, ఏ.జైశీల, మార్పగూడకు చెందిన కె.వత్సల, నడ్డగూడకు చెందిన టేకం సీతాబాయిలను పోలీసులు చెప్పలేని మాటలతో తిట్టారు. అంగన్‌వాడీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అయిన ధొనిపెల్లి వెంకటమ్మ, కామ సునీత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అయిన డి. సునీతలపై పోలీసులు దాడి చేశారు. వారి చీరలు లాగి అవమానపరిచారు. శాంతియుతంగా, చట్టబద్ధంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్ళిన అంగన్‌వాడీ కార్యకర్తలను కులం పేరుతో దూషిస్తూ, బట్టలు ఊడిపోయేలా కొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని కోరారు.





సికింద్రాబాద్ గణేష్ ఆలయ మండపంలో భాగంగా నాలుగో రోజు వినాయక వేడుకల్లో భాగంగా చిన్నారులతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ సత్యనారాయణ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు చిందం శ్రీశైలం యాదవ్ తదితరులు చిన్నారులను సత్కరించారు.



అసెంబ్లీ ఆవరణలో కూలిన భారీ వృక్షం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

హైదరాబాద్‌లోని తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో భారీ వృక్షం నేలకొరిగింది. అసెంబ్లీ ఆవరణలో శ్రీఅను క్యాంటీన్ ముందున్న పెద్ద చెట్టు శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో చెట్టు కింద ఉన్న ముగ్గురు వ్యక్తులు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. చెట్టు కింద పార్క్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంస మయ్యాయి. అనంతరం అధికారులు చెట్టును తొలగించారు.

మద్దతు ధర, మార్కెట్ గ్యారంటీకి చట్టాలు తేవాలే..!

'రైతు పండించే ప్రతి పంటకూ మద్దతు ధర, గ్యారంటీ మార్కెట్ కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలి. కేరళ తరహా రైతు రుణవిమోచన, మద్దతు ధర కల్పించే చట్టాలను చేయాలి. పరిశ్రమల్లో ఉత్పత్తులకు ధర నిర్ణయించినట్టుగానే రైతు పండించే పంటలకూ రేటు నిర్ణయించే చట్టాన్ని తేవాలే.. కేంద్రంలోని బీజేపీ సర్కారు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చే కుట్ర చేస్తోందని, దాన్ని తిప్పకొడుతూ ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతాంగ పోరాట స్ఫూర్తితో రాష్ట్ర రైతాంగం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి' అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు.

- రుణవిమోచన చట్టంతో రైతులను ఆదుకోవాలి
- దేశానికి తిండిపెట్టే రైతును పట్టించుకోని కేంద్రం
- రైతులను దోచి కార్పొరేట్లకు పెట్టే దిశగా చట్టాల రూపకల్పన
- రైతు ప్రయోజన చట్టాల కోసం నడుం బిగించాలి

రాష్ట్రంలో వరి తప్ప మిగతా పంటల సాగుకు ప్రణాళికల్లేవ్.. : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో మూడ్రోజులు జరగనున్న రాష్ట్రస్థాయి శిక్షణాతరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా సంఘం జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్దవెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో టి.సాగర్ ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రంలో నీళ్లు, సరిపడా విద్యుత్ సౌకర్యంతో పెద్దఎత్తున వరి పండుతున్నా.. రైతాంగం నష్టాల నుంచి బయటపడే పరిస్థితి లేదన్నారు. కేంద్రం వరికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2060 ప్రకటించిందే తప్ప చట్టం చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తున్నప్పటికీ అది ఆలస్యమవుతుండటంతో ప్రయివేటు వ్యాపారులు, మిల్లర్లు రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని క్వింటా ధాన్యానికి రూ.1600 నుంచి రూ.1700 కూడా చెల్లించకుండా కొంటున్నారని తెలిపారు. పైగా వరి తప్ప మిగతా పంటల సాగుకు ప్రభుత్వం దగ్గర ప్రణాళికలు లేవని, అందుకు కనీస ఆలోచనా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు వరిసాగుకే మొగ్గు చూపుతూ పెద్ద ఎత్తున వరి పండిస్తున్నా.. సరైన ధర గిట్టుబాటుకాక నష్టాల పాలవుతున్నారని వివరించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన పెట్టుబడి, పంటల కొనుగోలును పకడ్బందీగా నిర్వహించే వీలున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. పైగా వందశాతం రుణాలను గ్రామీణ ప్రాంత రైతులకే ఇచ్చే సహకార సంఘాలను నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బీజేపీ సర్కారు మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సిస్టమ్ తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రత్యామ్నాయ పంటల్లేవ్.. ప్రభుత్వ సహకారమూ లేదు

రాష్ట్రంలో 50శాతానికిపైగా కాయగూరలు, పండ్లు ఇతర పంటలన్నీ ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయని సాగర్ తెలిపారు. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు కలుపుకుని ఇక్కడి జనాలు అధిక ధరలకు వాటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం రాష్ట్ర ప్రజల అవసరాలకు అనుగుణంగా పప్పులు, నూనెగింజల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహించడం లేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో పత్తికి బదులు కందులు, పెసర్లు పండించాలని, ప్రభుత్వమే 10వేల క్వింటాళ్లు కొంటుందని నమ్మబలికి తీరా పెద్దఎత్తున పంట చేతికొచ్చాక కనీసం 6వేల క్వింటాళ్లు కూడా కొనలేదని గుర్తు చేశారు. కనీసం కేరళను చూసైనా ప్రభుత్వం కండ్లు తెరవాలని సూచించారు. కేరళలో రైతు రుణ విమోచన చట్టం తీసుకొచ్చి రైతులను రుణవిముక్తులను చేశారని, కొత్త రుణాలు ఇస్తూ సాగు ప్రోత్సాహాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. అక్కడి ప్రభుత్వం 16రకాల కాయగూరలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తూ క్వింటాల్ వరి ధాన్యంపై రూ.800బోనస్ కూడా ఇస్తోందని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వం మాత్రం రైతులు, వ్యసాయ కూలీలు, కౌలు రైతులు, చేతివృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ఓ కమిటీ వేసి చేతులు దులుపుకుందని విమర్శించారు.

అణచివేతను ఎదిరించే ప్రవృత్తి
మనిషిలో స్వభావ సిద్ధంగా ఉంటుంది - టాసిటస్


సంపాదకీయం

'బిల్లు' భిక్ష కాదు... హక్కు!

దశాబ్దాలుగా నానుతున్న చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లుకు రాజ్యసభ కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడమే తరువాయి రానున్న కాలంలో ఇది చట్టంగా మారనుంది! అయితే ఇది చట్టంగా మారేందుకు కీలకమైన రాష్ట్రపతే తగిన

వివక్ష అనేది ఎన్డీయేలోనే కాదు బీజేపీ డీఎన్ఏలోనూ ఉంది. వీరి పాలనలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, ఇప్పుడు రాజకీయంగా ఎదుగుతారని చెప్పడమంటే ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి ఉండదు. బీజేపీ ఈ పదేండ్ల పాలనలో మందబలంతో ఎన్నో చట్టాలను రూపొందించింది. ప్రతిపక్ష సభ్యులు నెత్తీనోరు మొత్తుకున్నా వారిని లెక్క చేయలేదు. దేశ సమగ్రతకు భంగం కలిగే చట్టాలు, అదానీ, అంబానీలకు ఉపయోగపడే చట్టాలు, దేశాన్ని అస్థిరపరిచే చట్టాలు ఎన్నెన్నో తీసుకొచ్చింది. మరి చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ డిమాండ్ ఎప్పటినుంచో పోరాడుతున్నదే.

గౌరవానికి నోచుకోకపోవడం విచారకరం. ఈ బిల్లు ఆమోదం పొందడం పట్ల బీజేపీ నేతలు పార్లమెంట్‌లో తమ చేతులతో బల్లలు చరిచారు. బయట కొచ్చి జబ్బులు చరుస్తున్నారు. ఇదంతా మోడీ ఛరిష్మా అని విజయగర్వంతో ఊగిపోతున్నారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ ఈ బిల్లును ప్రవేశ పెట్టిన సమయంలో అధ్యక్ష స్థానంలో పీటీ ఉష ఉన్నారు. ఈమె పరుగుల రాణిగా దేశమంతటా సుపరిచితం. కానీ బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చేతిలో లైంగికదాడులకు గురైన తోటి రెజ్లర్లు అతన్ని శిక్షించాలని పోరాటం చేస్తుంటే, వారి దీక్షలను భగ్నం చేసేలా విరమణ కోసం ప్రయత్నించిన బీజేపీ నాయకురాలు ఆమె. ఇలాంటి వాళ్ల మహిళల రక్షణ గురించి నేడు మాట్లాడుతున్నారు. చర్చల్లో పాల్గొంటున్నారు. మోడీని కీర్తిస్తున్నారు. మహిళలపై బీజేపీకి నిజంగా ప్రేముందా? వారిని రాజకీయంగా అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఉందా? ఇన్నేండ్ల వారి పాలనలో స్త్రీ సంక్షేమం అణువంతైనా కనిపించిందా? వారిదంతా అసమానతల రాజకీయమే కదా!



రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలనేది బీజేపీ-ఆరెస్సెస్ వ్యూహం. మనుస్మృతిలో మహిళల స్థానమెక్కడ? అనాదిగా వస్తున్న అధర్మాలపై పాలన సాగిస్తున్న నేతలు నేడు మహిళల గురించి గొప్పగా మాట్లాడటం విడ్డూరం! వారిని అలుసుగా చూస్తూ వంటింటికే పరిమితం చేసే సనాతనను నమ్ముతూ, దాని ప్రకారమే ముందుకు నడిచే వీరు నేడు మహిళలు, వారి అభివృద్ధి గురించి చెప్పడం నమ్మశక్యమేనా? కుల వివక్ష, అంటరానితనం దేశంలో రాజ్యమేలు తుంటే అందులో విభజన రాజకీయాలు చొప్పించి పబ్బం గడుపుకునే బీజేపీ మహిళల గురించి కల్లబొల్లి కబుర్లు చెబితే నమ్ముతుందా ఈ లోకం? మణిపూర్ మతం మంటల్లో కాలిన మహిళల నగ్న మృతదేహాలు ఏం ఘోషిస్తున్నాయి? ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో తీసుకొస్తున్న అసమానతలు ఏం సూచిస్తున్నాయి? కుల వివక్షలో ఛిద్రమైన బతుకులు ఏం చెబుతున్నాయి? ఈ బిల్లు తెచ్చింది మహిళల కోసం కానేకాదు! వారి పాలనలో అశాంతికి గురైన వారిని శాంతపరచడానికి, అన్యాయానికి గురైన వారిని తమకు అనుకూలంగా మలచుకోవడానికి! నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఆ పార్టీకి వివక్ష అనేది లేదనుకుంటే గిరిజన బిడ్డ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ఎందుకు పిలవలేదు? పోనీలే అనుకుందాం. ఇటీవల పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టినప్పుడైనా ఆమె గుర్తుకురాలేదా? సరే... ఇది కూడా సర్దుకుందాం. మరి ప్రముఖ బాలీవుడ్ నటీ కంగనా రనౌత్, ఫ్యాషన్ డిజైనర్ రీనా ఢాకాను ఆహ్వానించినప్పుడైనా ఆమె గుర్తుకు రాలేదా?

వివక్ష అనేది ఎన్డీయేలోనే కాదు బీజేపీ డీఎస్ఏలోనూ ఉంది. వీరి పాలనలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, ఇప్పుడు రాజకీయంగా ఎదుగుతారని చెప్పడమంటే ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి ఉండదు. బీజేపీ ఈ పదేండ్ల పాలనలో మందబలంతో ఎన్నో చట్టాలను రూపొందించింది. ప్రతిపక్ష సభ్యులు నెత్తీనోరు మొత్తుకున్నా వారిని లెక్క చేయలేదు. దేశ సమగ్రతకు భంగం కలిగే చట్టాలు, అదానీ, అంబానీలకు ఉపయోగపడే చట్టాలు, దేశాన్ని అస్థిరపరిచే చట్టాలు ఎన్నెన్నో తీసుకొచ్చింది. మరి చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ డిమాండ్ ఎప్పటినుంచో పోరాడుతున్నదే. ఇప్పుడే దాన్ని చర్చకు పెట్టి ఆమోదించడం వెనుక ఉన్న మతలబేంటో తెలియనిది కాదు. ఇందులో దాగుంది సమీపిస్తున్న ఎన్నికల రాజకీయ కోణమే కదా! ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధి పొందాలని ఇటీవల గ్యాస్ సిలిండర్ ధర తగ్గించారు. ఇప్పుడు మహిళా బిల్లును తామే తెచ్చామని కొత్తనాటకానికి తెరదీస్తున్నారు. ఈ బిల్లు విజయం పురుషాధిక్య సమాజంలో అణచబడిన మహిళాలోకానిదే. ఎన్నో ఏండ్లుగా అలుపెరగకుండా చేస్తున్న సుదీర్ఘ పోరాట పటిమదే. ఇందులో బీజేపీ, మోడీ కృషి ప్రత్యేకంగా ఏమీ లేదు. మహిళల పట్ల సానుభూతిని ప్రకటించడం, వారిని ఏదో అభివృద్ధి చేస్తామని చెప్పడం హాస్యాస్పదమే. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ రాజ్యాంగం కల్పించిన హక్కు. ఇది బీజేపీ భిక్ష కాదు...

ఫాసిస్ట్ హిందూత్వ కథనాల్ని తిప్పికొట్టండి

రాజ్యాంగబద్ధమైన రిపబ్లిక్ (2025) 75వ వార్షికోత్సవం సమీపిస్తున్న తరుణంలో, రిపబ్లిక్ యొక్క లౌకిక ప్రజాస్వామిక లక్షణంలో 'మార్పు' తెచ్చేందుకు హిందూత్వ కథనానికి దూకుడుతనంతో రచన సాగుతోంది. 2024 ఎన్నికల్లో మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏ విధంగానైనా విజయం సాధించడానికి ఇలాంటి సన్నద్ధత అవసరం. ఈ మార్పు సాధించాలంటే ఆర్ఎస్ఎస్, బీజేపీలకు ప్రభుత్వం, రాజ్యాధికారాలపై నియంత్రణ అత్యంత కీలకమైన అంశం. "ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లి" అనే ప్రచారం, వివిధ రకాల ఉపకథనాల ద్వారా సమకాలీన నాగరికతను, బహుళ సాంస్కృతిక వాదాన్ని చెరిపేయడానికి భారతీయ చరిత్రను తిరగరాయడం, మతపరంగా మైనార్టీలకు, ముఖ్యంగా ముస్లింలకు వ్యతిరేకంగా ద్వేషపూరిత, హింసాయుత విష ప్రచారాలను వ్యాప్తి చేయడం ద్వారా వారు కోరుకుంటున్న మార్పు నిజమవుతుంది. ఈ ఫాసిస్టు హిందూత్వ ప్రణాళికలో ఇలాంటి ఉప-కథనాలు అంతర్భాగంగా ఉంటాయి. ఏకరూప పౌరస్మృతి, మన దేశం పేరును ఇండియా స్థానంలో భారత్‌గా మార్చడం, 'ఒకే దేశం-ఒకే సంస్కృతి-ఒకే భాష'కు అనుగుణంగా 'ఒకే దేశం-ఒకే ఎన్నిక', లాంటి అంశాల చుట్టూ ఇటీవలి ఉప-కథనాలు కేంద్రీకృతమయ్యాయి. ఇలాంటి కథనాలు నిజమవుతాయా, లేదా అనే దాంతో నిమిత్తం లేకుండానే హిందూత్వ కథనాన్ని బలోపేతం చేసే ఆలోచనల్ని సృష్టించడంపై కేంద్రీకరణ జరుగుతుంది.



సీతారాం ఏచూరి

హిందూత్వ ఉప-కథనాలు

అంతకుముందు అయోధ్యలో ఆలయ నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం ఒక ఉదాహరణ. సుప్రీంకోర్టు తీర్పులో, ఆలయ నిర్మాణ బాధ్యతల్ని ఒక ట్రస్ట్‌కు అప్పగించినప్పటికీ, ప్రధానమంత్రే హిందూ మతాచారాల ప్రకారం రాజ్యాంగాధికారుల సమక్షంలోనే, ప్రధాన పూజారిగా ఆ కార్యక్రమాన్ని చేపట్టాడు. ఆ కార్యక్రమాన్ని భారతదేశంలో, ప్రపంచ వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మీడియాలో లైవ్‌లో ప్రసారం చేశారు. భారతదేశం అప్పటికే ఒక హిందూత్వ రాజ్యమనే విషయాన్ని తెలియజేసేవిధంగా ఆ లైవ్

2021 సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో జనరల్ అసెంబ్లీనుద్దేశించి మాట్లాడుతూ... మోడీ, భారతదేశాన్ని "ప్రజాస్వామ్యానికి తల్లి"గా ఉదహరించాడు. "విశాల ప్రాతిపదికన సంప్రదింపుల సంస్థల చేత ఉపయోగించబడుతున్న రాజకీయాధికారం గురించి" వేదాలు మాట్లాడతాయని మోడీ ఎలాంటి చారిత్రక ప్రమాణం లేని రుజువు గురించి నొక్కి చెప్పాడు. మనుస్మృతి యొక్క సామాజిక క్రమంలోని దౌర్జన్యకరమైన అసమానతలు, దోపిడీని, నిమ్న కులాలు, ముఖ్యంగా చాతుర్వర్ణాల వర్గీకరణకు అవతల ఉన్నవారి (అంటే దళితులు, మహిళలు) అణచివేత, దోపిడీలు తోడుగా ఉండే చాతుర్వర్ణ వ్యవస్థలను స్థిరపరిచే అంశాలపై ఆధారపడి భారతదేశ చరిత్రను తిరగ రాసేందుకు మొత్తం ఫాసిస్ట్ హిందూత్వ పర్యావరణ వ్యవస్థ పనిచేసే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం నిర్మాణం మాత్రమే కాక, అది సమానత్వ స్ఫూర్తిని కూడా ఖాయపరుస్తుందని మోడీ నిర్వచిస్తాడు. ఎంత విశ్వాస ఘాతుకం!

కార్యక్రమం ప్రసారమైంది. అదేవిధంగా, నూతన పార్లమెంట్ భవనంపై జాతీయ చిహ్నం ప్రతిష్టాపనకు, హిందూత్వ మనస్తత్వాన్ని బలపరిచే హిందూ మతాచారాలు కూడా తోడయ్యాయి. ఇటీవల ముగిసిన జి-20 శిఖరాగ్ర సమావేశం కూడా అంతర్జాతీయ పదప్రయోగం మాటున ప్రదర్శించబడిన హిందూత్వ చిహ్నాలచే గుర్తించబడింది. ప్రపంచ సార్వత్రిక భావనను ప్రకటించేందుకు, వసుధైవ కుటుంబ భావన, అంటే సార్వత్రిక ఏకత్వ భావనను పెంపొందించడానికి, భారతదేశ జి-20 అధ్యక్షుని పదవీ కాలంలో కృషి జరుగుతుందని ప్రకటించారు. వసుధైవ కుటుంబం అంటే ఏకరూపతను విధించడం కాదు, సామాజిక బహుళత్వాలు కేవలం గుర్తింపబడకుండా ఉండటమే కాక, సమానత్వం, గౌరవం ఆధారంగా అన్ని వైరుధ్యాలను సమానంగా పరిగణలోకి తీసుకోవడం ద్వారా ప్రపంచ కుటుంబాన్ని గుర్తించడం కూడా. ఈ నియమాన్ని అన్ని దేశాలు అనుసరించినప్పుడు మాత్రమే అలాంటి ప్రపంచ కుటుంబం ఉద్భవించగలదని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ నియమమే వైరుధ్యాలన్నిటినీ పరిగణలోకి తీసుకునేలా, అందరికీ సమానత్వం అనే భావనపై ఆధారపడే రాజకీయ నిర్మాణాన్ని బలోపేతం చేస్తుంది. మన భారత రాజ్యాంగం, కులం, జాతి, లింగ బేధాలతో నిమిత్తం లేకుండా సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయాలు దేశంలోని పౌరులందరికీ అందాలని ప్రకటించింది. కానీ దేశంలో మోడీ ప్రభుత్వ పాలనలో పౌరులకు అందాల్సిన న్యాయాలన్నీ ధ్వంసం చేయబడుతున్నాయి. ఇలాంటి అన్ని ఉప-కథనాలు, బలమైన ఫాసిస్ట్ హిందూత్వ శక్తిలో అంతర్భాగంగా ఉంటున్నాయి. అన్నీకాక పోయినా, వీటిలో చాలా కథనాల్ని, సుదీర్ఘ కాలంపాటు ఆరెస్సెస్ అధినేతగా పనిచేసిన ఎం.ఎస్.గోల్వాల్కర్ 1939లో రచించిన "వియ్ ఆర్ అవర్ నేషన్ హుడ్ డిఫైన్డ్"లో గుర్తించవచ్చు.

హిందువులు మాత్రమే ఈ భూమికి అసలు సిసలైన నివాసులు అని స్థిరపరచినప్పుడు మాత్రమే వారి కథనాలు, వారు కోరుకునే మార్పు విజయవంతమవుతుంది. గోల్వాల్కర్ ఈ విషయాన్ని ఇలా నొక్కి చెప్పాడు... "ఏ విదేశీ జాతి అయినా మనపై దురాక్రమణ చేయడానికి ముందు, హిందువులైన మనం, ఎనిమిది లేదా పది వేల సంవత్సరాలపాటు వివాదరహితమైన, కలతచెందని ఈ భూమి స్వాధీనంలో ఉన్నాం. అందువల్ల ఈ భూమి హిందుస్థాన్ (హిందువుల భూమి)గా పిలువబడింది." సింధూ నదికి అవతల ఉన్న భూములను వివరించేందుకు అరబ్బులు మాత్రమే కాక గ్రీకులు, రోమన్లు కూడా అంటే భారతదేశానికి బయటినుంచి వచ్చిన ప్రజలే హిందుస్థాన్ అనే పేరు పెట్టారనేది వాస్తవం. గోల్వాల్కర్ హిందూ, ఆర్యన్ అనే పదాలను పర్యాయపదాలుగా ఉపయోగిస్తాడు. ఆ విధంగా ఆర్యులు ఇక్కడే భారతదేశంలోనే పుట్టారని అచారిత్రకంగా, అశాస్త్రీయంగా నొక్కి చెప్పాడు. ఆ ఆలోచనల తోనే ఆయన ఈ విధంగా నొక్కి చెప్పాడు... "ఆర్యులు కాస్పియన్ సముద్రానికి దగ్గరలోని ప్రాంతం నుండి లేదా ఆర్కిటిక్ ప్రాంతం లేదా అలాంటి ఏదో ఒక ప్రాంతం నుండి హిందుస్థాన్‌కు వచ్చి దోపిడీ దొంగల గుంపుతో కలిసి ఈ భూమిని ఆక్రమించి, తర్వాత వారు మొదట పంజాబ్‌లో స్థిరపడి, క్రమేపీ గంగానది వెంట తూర్పువైపుకు వ్యాపించి వివిధ ప్రాంతాల్లో, అయోధ్య లాంటి చోట సామ్రాజ్యాలేర్పరచుకున్నారు. రామాయణంలోని అయోధ్య సామ్రాజ్యం, హస్తినాపురంలోని పశ్చిమ పాండవ సామ్రాజ్యం కంటే కూడా పురాతనమైనదిగా చరిత్రకారుడు భావిస్తాడు. అతడు అజ్ఞానంతో మహాభారతగాథ చాలా పాతదని మనకు బోధిస్తాడు. దురదృష్టవశాత్తు దేశంలోని వివిధ యూనివర్సిటీలు నిర్దేశించిన పాఠ్యపుస్తకాల ద్వారా ఇలాంటి తప్పుడు అభిప్రాయాలను యువకుల మెదళ్లలో కుక్కుతున్నారు. మనం అధ్యయనం చేసి అర్థం చేసుకొని, మన చరిత్రను మనమే రాసుకొని అలా వక్రీకరించబడిన చరిత్రను తీసే యాల్సిన సమయం ఆసన్నమైంది." అందువల్ల హిందువులు "శాంతియుత, అధికారయుత, సమృద్ధ పాలన" కింద పది వేల సంవత్సరాలకు పైగా ఈ నేలపైనే జీవించారనే విషయాన్ని స్థిరపరచడానికి, కొత్త కథనాలను సృష్టించి, పాఠ్యపుస్తకాలను సవరించి, చరిత్రను తిరగరాయడం అవసరం.

ప్రజాస్వామ్యానికి తల్లి

వేల సంవత్సరాలుగా భారతీయులు శాంతియుతంగా, సమృద్ధిగా జీవించారనే విషయాన్ని స్థిర పరచడానికి, భారతీయ సమాజం సమానత్వ స్ఫూర్తిపైన ఆధారపడిందని నొక్కి చెప్పాల్సిన అవసరం ఉందని ఆరెస్సెస్, బీజేపీలు గుర్తించాయి. 2021 సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలో జనరల్ అసెంబ్లీనుద్దేశించి మాట్లాడుతూ... మోడీ, భారతదేశాన్ని "ప్రజాస్వామ్యానికి తల్లి"గా ఉదహరించాడు. "విశాల ప్రాతిపదికన సంప్రదింపుల సంస్థల చేత ఉపయోగించబడుతున్న రాజకీయాధికారం గురించి" వేదాలు మాట్లాడతాయని మోడీ ఎలాంటి చారిత్రక ప్రమాణం లేని రుజువు గురించి నొక్కి చెప్పాడు. మనుస్మృతి యొక్క సామాజిక క్రమంలోని దౌర్జన్యకరమైన అసమానతలు, దోపిడీని, నిమ్న కులాలు, ముఖ్యంగా చాతుర్వర్ణాల వర్గీకరణకు అవతల ఉన్నవారి (అంటే దళితులు, మహిళలు) అణచివేత, దోపిడీలు తోడుగా ఉండే చాతుర్వర్ణ వ్యవస్థలను స్థిరపరిచే అంశాలపై ఆధారపడి భారతదేశ చరిత్రను తిరగ రాసేందుకు మొత్తం ఫాసిస్ట్ హిందూత్వ పర్యావరణ వ్యవస్థ పనిచేసే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం నిర్మాణం మాత్రమే కాక, అది సమానత్వ స్ఫూర్తిని కూడా ఖాయపరుస్తుందని మోడీ నిర్వచిస్తాడు. ఎంత విశ్వాస ఘాతుకం! రాజ్యాంగదినోత్సవం, నవంబర్ 19, 2022నాడు భారతదేశం "ప్రజాస్వామ్య తల్లి"గా ఉత్సవాన్ని జరుపుకునేందుకు ప్రాచీన భారతదేశంలో, ఖాప్ పంచాయతీలలో "ఆదర్శ రాజులను" వారి "ప్రజాస్వామిక సాంప్రదాయాన్ని" తెలియజేయడానికి ప్రణాళికలు రూపొందించాలని కోరుతూ అన్ని రాష్ట్రాల గవర్నర్లకు యూజీసీ ఛైర్మన్ రాసిన లేఖలకు అనుగుణంగా యూజీసీ యంత్రాంగం దానిని అనుసరించింది.

మోసం ద్వారా చరిత్ర తయారీ

వాస్తవ చరిత్రను వక్రీకరించడానికి, హిందూత్వ పర్యావరణ వ్యవస్థ సాంకేతిక సాధనాలను (కంప్యూటర్ ఉపయోగించి ఫొటోలు మార్చడం లాంటివి) ఉపయోగిస్తూ చరిత్రను తయారు చేస్తుంది. ఇది బహుళవ్యాప్తిలో



ఉంది. కెనడాకు చెందిన అల్లన్ మోరీస్స్ ఒక రిటైర్డ్ మానవ విజ్ఞాన శాస్త్రవేత్త (ఆంత్రోపాలజిస్ట్), స్కాలర్. ఆయన "పిల్‌గ్రిమేజెస్ ఆఫ్ ద హిందూ ట్రెడీషన్ - ఏ కేస్ స్టడీ ఇన్ వెస్ట్ బెంగాల్" అనే అంశంపైన పరిశోధన చేసి ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో థీసిస్ సమర్పించి డాక్టరేట్ సాధించాడు. ఆయన అసలు థీసిస్‌ను మార్చిన విధానం హిందూత్వ చరిత్ర వక్రీకరణకొక స్పష్టమైన ఉదాహరణ. 700 సంవత్సరాల క్రితం ముస్లిం పాలకులు పశ్చిమ బెంగాల్‌లోని హుబ్లీ జిల్లాలో త్రివేణిలో కుంభమేళాను నిలిపేసినట్లు, అల్లన్ మోరీస్స్ పత్రాలలోని విషయాలను తారుమారు చేసి చూపారు. అలాంటి వక్రీకరణపై ఆధారపడి కుంభమేళాలు ప్రారంభమయ్యాయి. "700 సంవత్సరాల తరువాత ఈ ఆచార పునరుద్ధరణ జరిగింది, ఇది ఎంతో ప్రత్యేకం" అని ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో మోడీ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. కానీ "కుంభమేళా" అనేది త్రివేణీలో లేనేలేదనేది చారిత్రక సత్యం. కాబట్టి కుంభమేళా "పునరుద్ధరణ" అనేది తప్పుడు పరిశోధనపై జరిగింది" అని అల్లన్ మోరీస్స్ అంటున్నారు.

నూతన పార్లమెంట్ భవనం - రాజదండం

అదేవిధంగా, మధ్యయుగాల్లో రాజులు, చక్రవర్తులు ఉపయోగించిన "పాలించే దైవిక హక్కు"ను మోడీకి కల్పించడానికి మొత్తం చరిత్ర వక్రీకరించబడి, ఉపయోగించబడిన నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా రాజదండం సాంప్రదాయాన్ని పాటించారు.

హిందువులు మాత్రమే ఈ భూమికి అసలు సిసలైన నివాసులు అని స్థిరపరచినప్పుడు మాత్రమే వారి కథనాలు, వారు కోరుకునే మార్పు విజయవంతమవుతుంది. గోల్వాల్కర్ ఈ విషయాన్ని ఇలా నొక్కి చెప్పాడు... "ఏ విదేశీ జాతి అయినా మనపై దురాక్రమణ చేయడానికి ముందు, హిందువులైన మనం, ఎనిమిది లేదా పది వేల సంవత్సరాలపాటు వివాదరహితమైన, కలతచెందని ఈ భూమి స్వాధీనంలో ఉన్నాం. అందువల్ల ఈ భూమి హిందుస్థాన్ (హిందువుల భూమి)గా పిలువబడింది." సింధూ నదికి అవతల ఉన్న భూములను వివరించేందుకు అరబ్బులు మాత్రమే కాక గ్రీకులు, రోమన్లు కూడా అంటే భారతదేశానికి బయటినుంచి వచ్చిన ప్రజలే హిందుస్థాన్ అనే పేరు పెట్టారనేది వాస్తవం. గోల్వాల్కర్ హిందూ, ఆర్యన్ అనే పదాలను పర్యాయపదాలుగా ఉపయోగిస్తాడు. ఆ విధంగా ఆర్యులు ఇక్కడే భారతదేశంలోనే పుట్టారని అచారిత్రకంగా, అశాస్త్రీయంగా నొక్కి చెప్పాడు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో హిందూ ఆచారాలు, రాజ్యా భిషేకం (రాజు పట్టాభిషేకం)పై దృష్టిని కేంద్రీకరించడం ఆసక్తికరమైన విషయం. ఈ మొత్తం కార్యక్రమం, బ్రిటిష్ వారి నుండి అధికారాన్ని బదిలీచేసే ఒక కొత్త కథనాన్ని తయారుచేసే ప్రయత్నంగా గుర్తించబడింది. వాస్తవాల్ని కట్టుకథలతో తయారు చేసిన ఈ కొత్త కథనాన్ని ఫ్యూడల్ రాజులకిచ్చిన రాజదండం చుట్టూతిప్పారు. రాజదండం, చోళసామ్రాజ్యంలో అనుసరించిన ఆచారం. సీ.రాజగోపాలాచారి, తమిళనాడులోని మఠాధిపతులతో సంప్రదింపులు జరిపి సాధించిన అధికార బదిలీకి చిహ్నంగా లార్డ్ మౌంట్ బాటన్ రాజదండాన్ని నెహ్రూ చేతికిచ్చాడనేది తయారు చేయబడిన కథనం. దీనిని రుజువు చేసే ఎలాంటి ఆధారాలూ లేవు. ఆ సమయంలో నెహ్రూ స్వీకరించిన అనేక బహుమతుల వలెనే రాజదండాన్ని కూడా మ్యూజియంలో ఉంచారు. నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని హైందవీకరణ చేయడానికే బీజేపీ రాజదండం సాంప్రదాయాన్ని ఉపయోగించుకుంది. నూతన పార్లమెంట్‌భవనం హిందూత్వ రాజ్యస్థాపనకు చిహ్నం అనే విషయాన్ని తెలియజేసేందుకు తమిళనాడు నుండి రాజదండం పట్టుకొనివచ్చిన పూజారులు, మఠాధిపతుల ప్రదర్శనకు మోడీ నాయకత్వం వహించాడు. ప్రజలను పాలించడానికి పట్టాభిషక్తుడైన రాజు స్వీకరించిన, 'పాలించే దైవిక హక్కు'ను, పవిత్రం చేయాలని రాజదండాన్ని అందించిన ప్రధాన పూజారి అనుకుంటాడు. లింగ, జాతి, కులంతో నిమిత్తం లేకుండా పౌరులంతా సమానంగా ఉండే రాజ్యానికి, పౌరులకు మధ్య ఉండే సంబంధమే ప్రజాస్వామిక గణరాజ్యానికి (డెమొక్రటిక్ రిపబ్లిక్) ముఖ్యం. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం రాజ్యాన్ని పాలిస్తుంది. ప్రజాస్వామిక రాజ్య-పౌరుల సంబంధాన్ని ధ్వంసంచేసి దాని స్థానంలో ఫ్యూడల్ రాజ్య-ప్రజల నిరంకుశత్వ పద్ధతిలోనే మొత్తం భవన ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.

లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్‌కు మద్ధతిచ్చి, భారతదేశ భావనను బలోపేతం చేయండి

ప్రజల మనస్తత్వాన్ని అదుపుచేసే ఇలాంటి కథనాల్ని ఎదుర్కొని, ఓడించినప్పుడే భారత గణతంత్ర రాజ్య లక్షణాన్ని రక్షించగలం. దానితోపాటు, పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, పేదరికం, ఆకలి లాంటి కష్టాలతో బాధ పడుతున్న అశేష ప్రజల మెరుగైన జీవితాల కోసం, భారత్ అనే భారతదేశం కోసం ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలి.భారతదేశ లక్షణాన్ని, తీవ్ర అసహన, ఫాసిస్ట్ హిందూత్వ రాజ్యంగా మార్చే ప్రయత్నాల్ని ఓడించాలి. ప్రభు త్వాన్ని, రాజ్యాధికారాన్ని ఆరెస్సెస్, బీజేపీలు అదుపుచేయకుండా అడ్డుకోవడమే దీనికి ముందస్తు షరతు.

('పీపుల్స్ డెమోక్రసీ' సౌజన్యంతో)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451



దేశమంటే దేహాలే

కులం పేర అణిచివేత
మతం పేర అణిచివేత
కులంలో మతంలో మొత్తం జనంలో
మహిళపై మహ మహా అణిచివేత
తరతరాల అణిచివేతల
అహంకారపు ఆధిపత్యం
ఎవడిదంట? ఎందుకంట?
కష్టంచేసే కులాల
దిగువ దొంతర్లలో దించిందెవడు?
సంపద కులాల
'సొంతఆస్తి' కొండలపై
నిలిపిందెవడు?
ఈ కిరాతకాల పాలన మోసిందెవడు?
సంపద ఎత్తే ఆధిపత్య నిచ్చెన మెట్లెక్కిన
అహంకారమే అణిచేత
దురహంకారం కాదా?
మదమెక్కిన పొగరుబోతుల
కండకావరం
వివక్షలతో అణగదొక్కిన
దౌర్జన్యం కాదా?

దేహమంటే కులం కాదు
దేహమంటే మతం కాదు
గింజకోసం గంజికోసం
చెమటచిందే ప్రాణయంత్రం

పెంచినోడికి దక్కకుండా
హక్కు చెక్కు పొందినోడు
సర్వ సంపద లెత్తడంపై
ఎగిసి లెగిసిన ప్రశ్నలన్నీ
విరగబడీ తిరగబడితే
కొత్త దారి నడక మొదలే కదా

తొక్కివేతకు లెక్కలేసిన
అహంకారం కలిసి రాసిన
కుల మత విభజనల గూడు
గడుల సోపాన పటం అది
ఏ గడిపై తిరగబడి ఏ నిచ్చెన ఎక్కినా
కడకు దోచే గడిలో కాచిన
పాము నోటబడటం ఖాయం

అందుకే ఇప్పుడు ....
ఎవడిపై అణిచివేత వాడిదే కాకూడదు
అణిచివేత పెత్తనం కర్ర ఎవడిపై పడినా
అందరూ ఏకమై నడుము విరవాలి
ఎక్కడది లేచే ఊపు ఊగినా
అక్కడే తొక్కేయాలి
ఎదురైన దుస్థితిపై ఘర్జిస్తూ
దేశంలో దేహాలొకటై కదలాలి
అణిచివేతల ఆధిపత్యంపై
ఎదురేగి కదం తొక్కాలి

ఇరవైమంది అణిచివేతలకు
ఎనభైమంది సమాధానమైతే
దాని కోరల్లో అసలు విషం
సంపదలో ఈదే నిజం
బట్టబయలై బద్దలౌను
అక్కడే దాని నడుము విరిస్తే
కష్టజీవి అంటే భయపడుతుంది
మనిషంటే మనిషేననీ
దేహమంటే దేహమేననీ
దేహమున్నదే జీవమనీ
దేహాల సమూహమే దేశమనీ
తలవంచి నమస్కరించే
సంస్కారం మెరుస్తుంది

-ఉన్నం వెంకటేశ్వర్లు
సెల్:8790068814

మరి అక్రమంగా జైల్లో మగ్గుతున్న వారి మాటేమిటి?

ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో (ఈ వ్యాసం రాసేనాటికి) అన్ని సౌకర్యాలతో 'మగ్గుతున్నారు'. ఇదే సీను గత కొద్ది నెలల క్రితం తమిళనాడులో ఒక మంత్రి సెంథిల్ బాలాజీ విషయంలోను, అంతకుముందు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్‌సిసోడియా విషయంలోనూ చూసాం. తెలంగాణలో రాష్ట్ర ముఖ్యమంత్రి కుమార్తె కవిత విషయంలోనూ అరెస్టు హైడ్రామా నడుస్తోంది. నిజానికి ఇటువంటి రాజకీయ కక్షలు, కేసులు పెట్టుకోవడం, కోర్టుల చుట్టూ తిప్పడం, మన దేశానికి, రాష్ట్రానికి గాని కొత్తేమీ కాదు. అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్షాలలో ఉన్న ప్రముఖ నాయకుల మీద కేసులు పెట్టడం, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వారు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నవారిపై లేక ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న పార్టీల నాయకులపై తమ చేతుల్లో ఉన్న నిఘా సంస్థల ద్వారా కేసులు పెట్టడం కూడా గతం నుండి వస్తున్న రివాజే. అయితే ఫాసిస్టు తరహా పరిపాలన సాగిస్తున్న కేంద్ర బీజేపీ సర్కారు పాలనలో ఇది మరింత వేగం పుంజుకుంది. చట్టం తన పని తాను చేసుకు పోతుందని పాలకపక్షం అంటుంది. కాదు ఇదంతా రాజకీయ కక్ష అని ప్రతి పక్షాలంటున్నాయి. ఇందుకు ఈ పార్టీలన్నీ లాయర్లకు ఇచ్చే ఫీజులు చూస్తే తల తిరిగిపోతుంది. రోజుకు కోటి రూపాయల ఫీజు తీసుకునే లాయర్లు అటు ఇటు కూడా రంగంలోకి దిగుతున్నారు. ఏది ఏమైనా ఏ కేసులు (ఒక లాలూ ప్రసాద్ యాదవ్ తప్ప) దాదాపు నిలబడవు. అసలు కేసులే ఏండ్ల తరబడి నడుస్తుంటాయి. తీర్పులు వచ్చే నాటికి పరిస్థితి మారిపోతుంది. వాటిపై ప్రజల ఆసక్తి తగ్గిపోతుంది. కానీ ఈ తతంగం మాత్రం జరుగుతూనే ఉంటుంది. ప్రజలు ప్రేక్షకులుగా మిగిలిపోతూనే ఉంటారు.




ఆర్. రఘు
9490098422

రాజ్యం నిజ స్వరూపం

ఈ గందరగోళం మధ్య రాజ్యం నిజస్వరూపం తెలుసుకోవడం కష్టం. పాలక పార్టీల కోరిక, ప్రయత్నం కూడా అదే. ఈ క్రమంలో చట్టాల గురించి, న్యాయస్థానాల గురించి మధ్యతరగతి, ఉన్నత వర్గాలలో పెద్ద చర్చే జరుగుతుంటుంది. తప్పు చేసిన వాడు ఎన్నటికీ తప్పించుకోలేడని, చట్టం ముందు అందరూ సమానులేనని, కింది కోర్టులో కాకపోతే హైకోర్టులో తప్పక న్యాయం జరుగుతుందని, న్యాయస్థానాలు స్వతంత్రంగా వ్యవహరిస్తుంటాయని, రాజకీయ ప్రలోభాలకు లోనుకావని... ఇలా అనేక వాదనలు ముందుకు తేబడుతూ ఉంటాయి. రాజ్యం యొక్క అసలు వర్గ స్వభావం గురించి చర్చ కనపడనివ్వరు. ఈరోజు భారతదేశంలో కనీసం ఒక వంద మంది ప్రముఖులు ఇందులో న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, పత్రిక విలేకరులు, సాంఘిక మాధ్యమంలో ప్రముఖులు, కార్మిక నాయకులు, విద్యార్థి నాయకులు మాత్రమే కాకుండా కవులు, రచయితలు, కళాకారులు వంటి వారు ఏండ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. 90శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా, ప్రముఖ న్యాయవాది సుధా భరద్వాజ్, కవి రచయిత వరవరరావు, విద్యావేత్త ఆనంద్ తేల్తుంబ్డే, రోనా విల్సన్, గౌతమ్ నవలఖ, సాగర్ గోర్కే, మీరన్ హైదర్ వంటి వారి మీద పెట్టిన కేసులు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడే రాజ్యం పక్షపాత వైఖరి అర్థమవుతుంది. వారంతా ప్రభుత్వాలను కూలదోసేవారుగా, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలని తుపాకీతో స్వాధీనం చేసుకుంటారని వారిపై ప్రధాన అభియోగం. చంద్రబాబులు, సిసోడి యాలు, కవితలు బాలాజీల మీద పెట్టిన అభియోగాలు వేలకోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని. కానీ అణగారిన, దళిత, గిరిజన, మైనారిటీ, మహిళల గురించి మాట్లాడే వాళ్ళ, రాసేవాళ్ళు, పాడేవాళ్ళు, ఉద్యమించే వాళ్ళు మాత్రం ప్రభుత్వాన్ని కూలదోయటానికి కుట్రలు చేసేవారుగా రాజ్యం ముద్ర వేస్తుంటుంది.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తదనంతరం ఏడేండ్లలో 'ఉపా' చట్టం కింద అరెస్టు చేయబడ్డవారు



పాలక పార్టీల నాయకులు, వారు తిన్నది, లేక తిన్నారని అభియోగాలు ఉన్నది వేల, లక్షల కోట్ల రూపాయల్లో ఉంటుంది. దీనిపై రేపుతున్న దుమారం ముందు జైల్లో మగ్గుతున్న మేధావుల గురించి, అమాయక ప్రజల గురించి వస్తున్న వార్తలు ఏ మాత్రం ప్రజల దృష్టికి రానీయడం లేదు. అందువలన పాలక పార్టీల అవినీతిపై పోరాడుతూనే, చట్టాల మీద, న్యాయస్థానాల మీద భ్రమలు ఏర్పరుచుకోవడం పొరపాటు. అలాగే మతోన్మాద కూడలిలో చిక్కుకున్న రాజ్యం అత్యంత క్రూరంగా మేధావుల మీద, సాంఘిక కార్యకర్తల మీద చేస్తున్న ఏకపక్ష దాడిపై పోరాటం జరపకపోతే సమాజానికే తీవ్ర నష్టం జరుగుతుంది.

10,552 మంది. ఇందులో దోషులుగా కోర్టులు నిర్ధారించింది కేవలం 98 మంది మాత్రమే. కానీ వేలాదిమంది బెయిల్ రాక నెలలు, సంవత్సరాలు జైళ్ళలో మగ్గారు, ఇంకా మగ్గుతున్నారు. మహమ్మద్ ఇలియాస్, మహమ్మద్ ఇర్ఫాన్ ఇద్దరు 30ఏండ్ల యువకులు. వీరికి లష్కర్ ఏ తోయిబా అనే ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయని మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ గతంలో అరెస్టు చేసింది. తొమ్మిదేండ్ల తర్వాత విచారణలో వారికి అటువంటి సంబంధాలు ఏమీలేవని తేల్చి విడుదల చేసింది. అలాగే మహమ్మద్ అమీర్ ఖాన్ అనే ఢిల్లీ యువకుడిని పాకిస్థాన్ ఏజెంట్ అని ముద్రవేసి 23సంవత్సరాలు జైల్లో పెట్టి చివరికి నిర్దోషి అని విడుదల చేసింది. ఇలా అనేకమంది యువకులను బీజేపీ పాలిత రాష్ట్రాలలో కానీ, మరీ ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్లో కానీ తల తోక లేని కేసులు పెట్టడం, ఏండ్ల తరబడి బెయిల్ ఇవ్వకుండా, అసలు విచారణే లేకుండా జైల్లో దుర్భరమైన పరిస్థితులకు వారి జీవితాలకు బలి చేయడం ఒక ధోరణిగా సాగుతున్నది. విలువైన వారి యవ్వన జీవితమంతా నాశనం చేయబడుతున్నది. కానీ వారి గురించి చర్చ ఎక్కడ కనపడదు. అలాగే పత్రికావిలేకరులు కూడా అత్యంత అన్యాయంగా బలవుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఆ ప్రభుత్వం, పోలీస్‌శాఖ ఒక దళిత మహిళను అంతం చేసిన తీరును కవర్ చేసినందుకు సిద్ధికి కప్పన్ ఎంత భయానకమైన పరిస్థితిని ఎదుర్కొనేలా చేసిందో ఈ రాజ్యం మనం చూస్తున్నాం. ఇదంతా చూస్తుంటే ఆర్థిక నేరగాళ్లకు, అందులో వారు పాలకవర్గాల మనుషులైతే వారిని రాజ్యం చూసే తీరుకు, ప్రభుత్వం మీద అణగారిన ప్రజల కోసం, సాంఘిక న్యాయం కోసం, లౌకిక తత్వాన్ని కాపాడటం కోసం, పోరాడే ఉద్యమకారులను పరిగణించే తీరుకు ఉన్న తేడా రాజ్యం వర్గ ధోరణిని వ్యక్తం చేస్తున్నది.

చట్టం కొందరికి చుట్టమే...

ఈ చట్టం ఎవరికీ చుట్టం కాదు అనేది ఒక నానుడి మాత్రమే. పాలక పార్టీలు తిట్టుకోవడానికి ఉపయోగ పడే నినాదం మాత్రమే. చట్టం లేక రాజ్యం పాలకవర్గానికి కచ్చితంగా చుట్టమేనని దేశంలో జరుగుతున్న పై వివరాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. 'ఉపా' చట్టం పరిధిలో 2019లో 1948 మందిని అరెస్టు చేస్తే శిక్ష పడింది 34 మందికే. 2020లో 1321 మందికి అరెస్టు చేస్తే 80 మందికి మాత్రమే శిక్ష పడింది. 2021 లో 1621 మందిని అరెస్టు చేస్తే కేవలం 62 మందికి మాత్రమే శిక్ష పడింది. 2022-23 సంవత్సరాలలో కూడా బహుశా ఇదే ధోరణి కొనసాగుతూ ఉన్నది. 2019లో విచారణ పెండింగ్‌లో ఉన్న 2224 మందిలో 238మంది మూడు నుండి ఆరు నెలల మధ్య జైళ్లలో ఉన్నారు. మూడు నుండి ఐదు సంవత్సరాల మధ్య 416మంది, ఒకటి నుండి మూడు సంవత్స రాల మధ్య దాదాపు 1200 మంది జైళ్లల్లో ఉన్నారు. అదే 2021 నాటికి విచారణ ఎదుర్కొంటున్న 2,800 మందిలో మూడేండ్లకు పైగా జైల్లో ఉన్నవారు 1113మంది. చట్టం కచ్చితంగా పాలకుల చుట్టమేనని పదేపదే నిరూపితం అవుతున్నది.

పాలక పార్టీల నాయకులు, వారు తిన్నది, లేక తిన్నారని అభియోగాలు ఉన్నది వేల, లక్షల కోట్ల రూపాయల్లో ఉంటుంది. దీనిపై రేపుతున్న దుమారం ముందు జైల్లో మగ్గుతున్న మేధావుల గురించి, అమాయక ప్రజల గురించి వస్తున్న వార్తలు ఏ మాత్రం ప్రజల దృష్టికి రానీయడం లేదు. అందువలన పాలక పార్టీల అవినీతిపై పోరాడుతూనే, చట్టాల మీద, న్యాయస్థానాల మీద భ్రమలు ఏర్పరుచుకోవడం పొరపాటు. అలాగే మతోన్మాద కూడలిలో చిక్కుకున్న రాజ్యం అత్యంత క్రూరంగా మేధావుల మీద, సాంఘిక కార్యకర్తల మీద చేస్తున్న ఏకపక్ష దాడిపై పోరాటం జరపకపోతే సమాజానికే తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ వర్గ దృష్టితో ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత ఉద్యమ కార్యకర్తల పైన ప్రధానంగా ఉంటుంది. ఈ కర్తవ్య నిర్వహణ భుజానికి ఎత్తుకోకపోతే పాలకవర్గాల నాటకీయ చర్చలు ప్రజలను పదేపదే మోసం చేస్తూనే ఉంటాయి.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్

కరీంనగర్‌లో ఫీజు దీక్ష..



దీక్షలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఫీజు దీక్షలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5177 కోట్ల పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 5 సంవత్సరాల నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులకు మొండిచేయి చూపుతో విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు కళాశాల యజమాన్యాలు డబ్బులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని వేధిస్తున్నారని వాపోయారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో విద్యార్థుల నుంచి అనేక ఫీజులు వసూలు చేస్తున్నారని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తానని చెప్పి ఇంతవరకు దాని ఊసే తీయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తిప్పారపు రోహిత్, పొడిశెట్టి అభిలాష్, జిల్లా సహాయ కార్యదర్శి అసంపల్లి వినయ్, జిల్లా కమిటీ సభ్యులు శివ, సందేశ్, సందీప్ హిందూ, రాకేష్, రవికుమార్, అక్షయ్, నవదీప్, కేశవ్, ఆకాష్, తిరుపతి, నవీన్, సాగర్ పాల్గొన్నారు.

ఎన్క్వాస్ గుర్తింపు రావడం పట్ల డీఎంఅండ్‌హెచ్‌ఓ హర్షం

నవతెలంగాణ - జమ్మికుంట

వావిలాల పీహెచ్‌సీకి ఎన్క్వాస్ గుర్తింపు రావడం పట్ల కరీంనగర్ డీఎంఅండ్‌హెచ్‌ఓ లలితాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట ఆరోగ్య సంరక్షణ కేంద్రం, పల్లె దవాఖానలో జాతీయ వైద్య బృందం గత నెల 18వ తేదీన పర్యటించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలు, మందుల నిల్వ, రికార్డుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు టిబి, లెప్రసీ, ఎన్‌సిడి అమలు తీరును, గర్భిణుల నమోదు, వారికి అందిస్తున్న చికిత్స, ఓపీ సేవలు, ఐసీడీఎస్, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామంలో అవగాహన కార్య క్రమాల నిర్వహణ, అత్యవసర సేవలు వంటి అంశాలను పరిశీలించారు. రోగులతో కూడా స్వయంగా మాట్లాడి సిబ్బంది అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వారి అధ్యయనంలో జమ్మికుంట ఆరోగ్య సంరక్షణ పల్లె దవాఖాన కేంద్రానికి 100 మార్కులకు 90మార్కులు రావడంతో ఎన్క్వస్ గుర్తింపు అందించారు. జమ్మికుంట ఆరోగ్య సంరక్షణ కేంద్రం, పల్లె దవాఖాన ఎన్క్వాస్‌కు సెలెక్ట్ కావడం పట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి హర్షం వ్యక్తంచేసినట్లు డాక్టర్ సనా జవేరియా తెలిపారు. ఇందుకు ముఖ్య భూమిక పోషించిన స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి శ్రీలత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చందు, వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సన జవేరియా, జమ్మికుంట ఆరోగ్య సంరక్షణ కేంద్రం, పల్లె దవాఖాన డాక్టర్ మహోన్నత పటేల్, డీపీఓ తులసి రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ రామనాథం, క్వాలిటీ మేనేజర్ సాగర్, సూపర్వైజర్స్ రత్నకుమారి, అరుణ, స్వరూప, సదానందం, అనిల్ కుమార్, టిబి సూపర్వైజర్ దేవేందర్‌రెడ్డి, ఎన్‌సిడి స్టాఫ్‌నర్స్ స్వప్న, ఆరోగ్య శాఖ సిబ్బంది మంజుల, రజిత, నరేందర్, ఆశా కార్యకర్తలను అభినందించారు.


వావిలాల పీహెచ్‌సీ వద్ద అధికారులు, వైద్యులతో కేంద్ర బృందం(ఫైల్)

ఎమ్మెల్యే రసమయిని కలిసిన గొల్లపల్లి మహిళలు

నవతెలంగాణ - తిమ్మాపూర్

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం కలిసారు. బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ మూడవసారి ప్రకటించిడం పట్ల రసమయికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో మహిళా సంఘం భవనం ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వారంరోజుల్లోగా మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ మల్లెత్తుల అంజయ్య, ఉపసర్పంచ్ కానుగంటి సత్యనారాయణరెడ్డి, వచ్చునూర్ ఎంపీటీసీ కనకం కొమురయ్య, రేణిగుంట సర్పంచ్ బోయిని కొంరయ్య పాల్గొన్నారు.



రైతు సంఘటితంతోనే సత్ఫలితాలు

- సంఘంగా ఏర్పడి పెట్టుబడి, ముడిసరుకు సమకూర్చుకోవాలి
- సొంతంగా మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి
- అందులోనూ ఉద్యానవనపంటలపై దృష్టిసారించి లాభాలు పొందాలి
- శాస్త్రం ఒక్కటే పరిష్కారంకాదు.. దానికి అనుభవాన్ని జోడించాలి
- కృషివిజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'ఒంటరిగా ఏదీ సాధ్యం కాదు.. సమూహంగా ఉంటూ సంఘం ఏర్పడి నిర్ణయాలు చేసుకుంటేనే సత్ఫలితాలు సాధించవచ్చు. అందుకు రైతులంతా సంఘంగా ఏర్పడి తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుని మార్కెట్ అవసరాలకు డిమాండ్ ఉన్న పంటలను సాగుచేసి సొంతంగా మార్కెటింగ్ చేసుకోవాలి. అప్పుడే చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం సహా లాభాలు పొందవచ్చు. అందుకు శాస్త్రవేత్తలు చేస్తే శాస్త్రంతోపాటు సాగు అనుభవమూ పరిగణనలోకి తీసుకుని ముఖ్యంగా నేలను ఆరోగ్యంగా ఉంచుకుని పంటలు పండించుకోవాలి' అని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్ర వేత్త వెంకటేశ్వర్‌రావు సూచించారు. తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో శుక్రవారం ప్రారంభం అయ్యాయి. అనంతరం రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణవెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా వచ్చిన వెంకటేశ్వర్‌రావు ప్రసంగించారు. ఒకప్పటి వ్యవసాయానికి, ఇప్పటివరకు వ్యవసాయానికి ఎంతో తేడా వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా రైతులంతా ఒకే దారిలో వరి లేదా పత్తి సాగుచేసుకుంటూ ప్రభుత్వాలు ఇచ్చే మద్దతు ధర కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. చుట్టూ నీళ్లు, సరిపడా విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉండి పెద్దఎత్తున పంటలు పండుతున్నా.. రైతులు నష్టాల్లో ఉంటున్నారని, అందుకు రైతుల సంఘటితంతోనే పరిష్కారమార్గాలు దొరుకుతాయన్నారు. వరి, పత్తి వేసే రైతులు పంట వేసినప్పటి నుంచి మార్కెట్‌లో అమ్ముకునే వరకూ జేబులో చిల్లిగవ్వ కూడా ఉండదని, అదే ఉద్యానవన పంటలు, పాడి పరిశ్రమ ఆధారంగా బతికే వారి చేతిలో నిత్యం డబ్బులు ఉంటున్నాయని తెలిపారు. కాయగూరలు, పండ్లు, ఇతర పంటలన్నీ ఇప్పుడన్నీ ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయని, స్థానికంగా రైతులు పండించుకోవడం లేదని తెలిపారు. అందుకు రైతులంతా ఒక్కటయితే తప్ప మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగుచేసుకునే వీలుండదని, అందరూ కలిసికట్టుగా పండించి సొంతంగా మార్కెట్ చేసుకోగలిగితే గిట్టుబాటు అవుతుందని వివరించారు. ప్రస్తుతం మొక్కజొన్న పండించే రైతులు పచ్చికంకిని రూపాయి ఒకటి చొప్పున అమ్మితే ప్రయివేటు వ్యాపారి దాన్ని మార్కెట్‌లో రూ.5కు అమ్ముతున్నాడని, అక్కడి నుంచి రిటైల్ వ్యాపారులు రూ.7 నుంచి రూ.10కొని వినియోగదారులకు రూ.15కు విక్రయిస్తున్నారని తెలిపారు. అదే రైతు నేరుగా వినియోగదారులకు అమ్మే విధంగా రూ.5 నుంచి రూ.10చొప్పున మార్కెట్ చేసుకోగలితే లాభాలు వారికే దక్కుతాయని తెలిపారు. దీని వల్ల వినియోగాదారులకు తక్కువ ధరలోనే సరుకుదొరకడంతోపాటు మార్కెట్‌లో కల్తీకి అడ్డుకట్ట వేసినవాళ్లమూ అవుతామని చెప్పారు. ఈ శిక్షణా తరగతుల ప్రారంభ సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.సాగర్, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణవెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్, రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శీలం అశోక్, జే.జనార్ధన్‌రెడ్డి, లంబు లక్ష్మారెడ్డి, వరాల రవికుమార్, వివిధ జిల్లాలప్రతినిధులు హాజరయ్యారు.

అర్హులకే గృహలక్ష్మి వర్తింపజేయాలి

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న బాధితులు, నాయకులు

నవతెలంగాణ - గన్నేరువరం

అనర్హులను గృహలక్ష్మి పథకంలో ఎంపిక చేశారని.. నిజమైన అర్హులకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గన్నేరువరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహలక్ష్మి ఎంపిక జాబితాలో సగం మందికిపైగా సొంత ఇండ్లు కలిగిన వారు, ఇండ్ల నిర్మాణం పూర్తయి గృహప్రవేశం చేసిన వారికి చోటు కల్పించడం దారుణమని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుంటే వారికి స్థానం కల్పించకుండా పార్టీ కార్యకర్తలను ఎంపిక చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో విడుదల చేసిన గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితాను వెంటనే రద్దుచేసి అర్హులైన వారిని ఎంపికచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ స్వాతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, మండల ఎస్సీసెల్ ప్రెసిడెంట్ మాతంగి అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవి, డిస్ట్రిక్ట్ సెక్రటరీ సునీల్, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు నల్ల చంద్రారెడ్డి, సర్పంచులు దొడ్డు రేణుకమల్లేశం, ముసుకు కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

వాగేశ్వరిలో జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని రామకృష్ణకాలనీలో వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మూడవ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు పురస్కరించుకొని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల అధ్యాపకుడు డాక్టర్ చొప్పదండి అనిల్ కుమార్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఔషధ దుష్ప్రభావాలను ఎలా గుర్తించడం, అంచనా వేయడం, ఎవరికి రిపోర్ట్ చేయడం వంటి అంశాలపై వివరించారు. విద్యార్థులు ఫార్మకో విజిలెన్స్‌పై పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, విభాగాధిపతి డాక్టర్ శ్రవణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నవతెలంగాణ - జమ్మికుంట

క్రీడలు విద్యార్థుల మానసికోల్లాసానికే కాకా శారీరక ఆరోగ్యానికి ఉపయోగ పడుతాయని జమ్మికుంట ఎంఈఓ వి.శ్రీనివాస్ అన్నారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మూడవరోజు ముగింపు బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమములో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల సదానందం, పీఈటిలు కె.రేణుక, ప్రేమలత, శేఖర్, సత్యనారాయణ, శ్రీను, సుమన్, ఉమ, తిరుమల, రాజేందర్ పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో ఎమ్మెల్సీ పూజలు

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను శుక్రవారం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి సందర్శించారు. ఒక్కో మండపానికి 5000 రూపాయలను నిర్వాహకులకు అందజేశారు. మండలంలోని నగరం, నాగారం, పాపక్కపల్లి, వెంకటేశ్వర్లపల్లి, బిజిగిరి షరీఫ్, కోరపల్లి, విలాసాగర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పార్టీ నాకు అవకాశమిస్తుందని ఆశిస్తున్నా..

నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కరీంనగర్


మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే భాగ్యం కాంగ్రెస్ కల్పిస్తుందని ఆశిస్తున్నానని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. తన జీవితం తెరచిన పుస్తకం అని, ప్రజల పక్షాన నికార్సుగా నిటారుగా కొట్లాడడం మాత్రమే తెలుసన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే ధ్యేయం అని, కష్ట కాలంలో పార్టీకి పని చేసిన ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని అన్నారు. బీఆర్ఎస్ అవినీతి కుటుంబ పాలనను గద్దె దించాలని ప్రజలు నిర్ణయించుకున్నారని, కరీంనగర్‌లో గంగుల కమలాకర్ అధికార బలంతో కొంత మంది బకాసురులను తయారుచేశాడని మంత్రి అండదండలతో పది సంవత్సరాలుగా వారు అందినంత దోచుకున్నారని ఆరోపించారు. గంగుల అవినీతి పాలనకు వంద రోజులలో చరమగీతం పాడుతామని అన్నారు. విజయ భేరి సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల కార్డును ఇంటింటికి చేరే విధంగా కార్యాచరణ తీసుకున్నామని, మూడు నెలలుగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం ద్వారా దాదాపు ముప్పైవేల ఇండ్లు సందర్శించి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నామని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో శ్రీధర్‌బాబు అధ్యక్షతన రూపుదిద్దుకుంటుందని, ప్రజల ఆకాంక్షలు నెరవేరే విధంగా మ్యానిఫెస్టో ఉంటుందని అన్నారు. సమావేశంలో నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దన్న సింగ్, పొరండ్ల రమేష్, కుర్ర పోచయ్య, మెతుకు కాంతయ్య, పెద్దిగారి తిరుపతి, జీడి రమేష్, చంద్రయ్య గౌడ్, షేక్ శేహెన్ష మహమ్మద్ భారీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ - గంగాధర



గంగాధర మండలం కురిక్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాల స్వచ్ఛ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సురేష్, ప్రతిమ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పాఠశాలలో విద్యార్థులందరికి దంత, రక్తహీనత, కంటి, ఎత్తు, బరువు వంటి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. లోపం ఉన్న విద్యార్థులను వచ్చే నెల 3న కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించి మందులు ఇస్తామని వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్, ప్రతిమ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయడం మంచిదని సూచించారు. సర్పంచ్ మేచినేని నవీన్‌రావు, హెచ్ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురిక్యాల నుండి రోడ్డు మరమ్మతులు

నవతెలంగాణ - గంగాధర



గంగాధర మండలం కురిక్యాల గ్రామ బీరప్ప ఆలయం నుండి మల్లాపూర్ రోడ్డు వరకు మొరం పోసి మట్టి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టినట్టు సర్పంచ్ మేచినేని నవీన్‌రావు తెలిపారు. వర్షాలకు రోడ్డు గుంతలు పడి అధ్వాన్నంగా మారిందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు కేటాయించి పనులు చేయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక బిడ్డనైనా నన్ను గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేస్తా

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - రామడుగు : 'స్థానిక బిడ్డనైన నన్ను గెలిపించుకుంటే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని' చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులకు 24గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, రైతు రుణమాఫీ కార్యక్రమాలతో రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. అదేవిధంగా ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులను మర్చిపోవాల్సిన అవసరం ఉందన్నారు. కొండగట్టు దేవస్థానాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగాపని చేస్తున్నానని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డలకు 1,00,116 ఇచ్చి ఇప్పటి వరకు 10వేల కోట్ల రూపాయలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. దేశరాజుపల్లి గ్రామానికి కోట్ల రూపాయిల వెచ్చించి అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. గతంలో మెజారిటీ ఇచ్చిన విధంగా ఈసారి కూడా మద్దతిచ్చి ఆశీర్వాదించాలని కోరారు. ఎంపీటీసీ వంచ మహెందర్‌రెడ్డి, నాయకులు ఎల్కపెల్లి లచ్చయ్య, దొబ్బల మధు, గంట్ల జితెందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, కలిగేటి లక్ష్మణ్, పెగడ శ్రీనివాస్, గాండ్ల తిరుపతి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయం

నవతెలంగాణ - రామడుగు : రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గోపాలరావుపేట మార్కెట్‌లో కోటీ 57లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. రైతుబంధు పథకం రాకముందు రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా రైతులకు 24గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు సహాయం, కాళేశ్వరం నీళ్ల ద్వారా సశ్యశామలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపీ కలిగేటి కవితాలక్ష్మణ్, ఏఎంసీ చైర్మెన్ మామిడి తిరుపతి, వైస్ చైర్మెన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరెందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంట్ల జితెందర్‌రెడ్డి, గంట్ల వెంకటరెడ్డి, దాసరి రెజెందర్‌రెడ్డి, పూడూరి మల్లేశం, పైండ్ల శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలి

చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్



నవతెలంగాణ - చొప్పదండి : అంగన్వాడీ సెంటర్లలలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్ సూచించారు. మండలంలోని పెద్ద కురుమపల్లె గ్రామంలో శుక్రవారం ఐసిడిఎస్ గంగాధర ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడారు. పోషకాహార లోపం, తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తొట్ల గంగమల్లయ్య ఎంపీటీసీ కూకట్ల తిరుపతి, ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి, సూపర్వైజర్ రమాదేవి, ఏఈఓ రాజశేఖర్, మల్లికార్జున్‌రెడ్డి, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

డీ గ్రేడ్‌లో ఉన్న సొసైటీని ఏ గ్రేడ్‌లోకి తీసుకొచ్చాం

రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్నాం

వీణవంక పీఏసీఎస్ చైర్మన్ మావురపు విజయ్‌భాస్కర్‌రెడ్డి


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ - వీణవంక

డీ గ్రేడ్‌లో ఉన్న వీణవంక సొసైటీని తమ పాలకవర్గంలో ఏ గ్రేడ్‌లోకి తీసుకొచ్చామని, రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, పాలకవర్గం సహాయ సహకారాలతో సొసైటీని లాభాల్లో నడిపిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ సొంత భవనానికి వీణవంక మండల కేంద్రంలో రూ.4లక్షలా 80వేలతో ఆరు గుంటల స్థలాన్ని కొనుగోలు చేశామని, త్వరలో సొంత భవనం కట్టుకుంటామని చెప్పారు. అలాగే కోర్కల్ గ్రామంలో పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం 30గుంటల భూమిని కొనుగోలుచేశామని, ఏమైనా కంపెనీలు వచ్చినట్లయితే వెంటనే పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే మరో 20 ఎకరాల స్థలం సేకరించి మరో రూ.100 కోట్ల ప్రభుత్వ నిధులతో రైస్ మిల్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నామని, ఈ విషయంపై మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌తో చర్చించినట్లు తెలిపారు. సుమారు 680 మందికి రుణాలు సొసైటీ ద్వారా అందించగా 389 మందికి రుణమాఫీ అయినట్లు చెప్పారు. త్వరలో మరో 299 మందికి రుణాలు మాఫీ అవుతాయని ప్రకటించారు. రుణాలు మాఫీ అయిన రైతులందరికీ రుణాలు మళ్లీ అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

పీఏసీఎస్ సీఈవోపై సభ్యుల ఆగ్రహం

పీఏసీఎస్ సీఈవో చందుపట్ల ప్రకాశ్‌రెడ్డిపై సొసైటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, నర్సింహరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశంలో జరిగిన తీర్మానాలపై చర్చకు పట్టుబట్టారు. సొసైటీలో గన్నీ సంచుల అవకతవకలపై ప్రశ్నించారు. అలాగే సివిల్ సప్లై వారు రికవరీ చేసిన గన్నీ సంచుల డబ్బులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తాను చేసిన ఫిర్యాదు ద్వారా తనకు అందిన సమాచారం మేరకు సుమారుగా రూ.37లక్షల మేరకు అవినీతి జరిగినట్లు రఘునాథ్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు చెకబండి శ్రీనివాస్‌రెడ్డి, గూటం సమ్మిరెడ్డి, రాములు, గెల్లు మల్లయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

అనిమీయాపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

గౌతమి ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ గౌతమిరెడ్డి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గౌతమిరెడ్డి

నవతెలంగాణ - రామడుగు

మహిళలు అనీమియా (రక్తహీనత)పై అవగాహన పెంచుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గౌతమి ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ గౌతమిరెడ్డి అన్నారు. రైజింగ్ సన్ యూత్ క్లబ్ సమన్వయంతో కొక్కెరకుంట గ్రామంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ఉచిత రక్త నిర్ధారణ పరీక్ష (అనీమియా) శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమి ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జి.గౌతమిరెడ్డి మాట్లాడుతూ ఆరంభ్ కార్యక్రమం ద్వారా మొబైల్ అనీమియా వ్యాన్ ఏర్పాటు చేసి ఉచితంగా రక్తహీనత (అనీమియా) పరీక్షను నిర్వహించి అవసరమైన మందులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని కనీసం 10వేలమంది మహిళలకు మొబైల్ వ్యాను ద్వారా అనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, నివారణకు గౌతమి ఫౌండేషన్ పని చేస్తుందన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని కోరారు. కొక్కెరకుంట గ్రామాన్ని దత్తత తీసుకొని (ఆర్గానిక్) సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని 84 మంది మహిళల రక్త నమూనాలు సేకరించినట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమ్మెంతల అభిషేక్‌రెడ్డి, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఏ.కిరణ్ కుమార్, రైజింగ్ సన్ యూత్ క్లబ్ అధ్యక్షుడు, ఉత్తమ యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్, అంగన్వాడీ సిబ్బంది బత్తిని కనకలక్ష్మి, గజ్జెల అంజలి, క్లబ్ బాధ్యులు జేరిపోతుల మహేష్, గజ్జెల నవీన్ కుమార్, వెంకటేష్, అజయ్, సతీష్, ఫౌండేషన్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ యల్.గంగాధర్, స్క్రీనింగ్ టెస్ట్ ఇన్‌చార్జి నాగం రమేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ - తిమ్మాపూర్



మండలంలోని పోరండ్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన అధికారి కందుకూరి స్వాతి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట నాటిన 3 సంవత్సరాల తర్వాత దిగుబడి ప్రారంభమై 30 సంవత్సరాల వరకు వస్తుందని చెప్పారు. ఈ పంటకు కోతుల బెడద ఉండదని, కచ్చితమైన మార్కెటింగ్ వ్యవస్థ ఉంటుందన్నారు. ఒక ఎకరానికి 57 మొక్కలు నాటుకోవాలి, ఒక్క మొక్కకు రూ.193 కాగా రైతు సబ్సిడీపై 20మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. 90శాతం సబ్సిడీపై ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్ పరికరాలు అందజేస్తుందని చెప్పారు. ఒక ఎకరానికి ఒక సంవత్సరానికి రూ.4200 చొప్పున 4 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారన్నారు. లోహియా కంపెనీ తిమ్మాపూర్ మండల ప్రతినిధి రాజ్ కుమార్ మాట్లాడుతూ రైతు పండించిన గెలలను కంపెనీ కొనుగోలు చేసి 15 రోజులలోపు డబ్బులను రైతు ఖాతాలో చేస్తామన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి భావన మాట్లాడుతూ.. అకాల వర్షాలకు, వడగళ్లకు ఈ పంట తట్టుకుంటుందని, ఆసక్తి గల రైతులు పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి త్రివేణి మాట్లాడుతూ.. రైతులు కనీసం 2 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయాలని కోరారు.

కళాశాల స్థలంలో గ్రంథాలయ నిర్మాణాన్ని నిలిపి వేయాలి

నవతెలంగాణ - పెద్దపల్లిటౌన్



బాలికల జూనియర్ కళాశాల స్థలంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం నిర్మాణం ఆపివేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి అశోక్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆరేండ్లుగా బాలికల జూనియర్ కళాశాల పాత భవనం స్థానంలో నూతన భవనం నిర్మాణం చేయాలని అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు. కళాశాల స్థలంలో గ్రంథాలయం నిర్మాణం వల్ల పేద విద్యార్థులకు ఒరిగేదేమీ లేదన్నారు. కళాశాల స్థలంలో గ్రంథాలయ నిర్మాణాన్ని నిలిపి వేయాలని లేకుంటే విద్యార్థి, యువజన సంఘాల కలుపుకుని పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మోదుంపల్లి శ్రావణ్, కల్వల స్టాలిన్, ఆర్దకొండ ఆజాద్, కల్లెపల్లి సదయ్య, బొబ్బిలి రాకేష్ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో డీజేలు వాడితే చర్యలు

- సుల్తానాబాద్ సీఐ జగదీశ్

నవతెలంగాణ- సుల్తానాబాద్


పాల్గొన్న నిర్వాహకులు

వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలను వాడితే చర్యలు ఉంటాయని సుల్తానాబాద్ సీఐ జగదీశ్ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో డీజే నిర్వాహకులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... పోలీస్ శాఖ నిబంధనల మేరకు వినాయక చవితి ఉత్సవాలలో డీజేలను నిషేధించామని, డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ ఎస్ఐ, విజేందర్, పొత్కపల్లి , జూలపల్లి , కాల్వ శ్రీరాంపూర్ ఎస్ ఐ .పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో డీజేలు నిషేధం

నవతెలంగాణ-ఓదెల



వినాయక నిమజ్జనంలో డీజేలు వినియోగిస్తే చర్యలు ఉంటాయని ఎస్ఐ శ్రీధర్ అన్నారు. పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల డీజే ఆపరేటర్లను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనంలో ఎవరైనా డీజేలు వినియోగిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఉచిత పథకాలతో ప్రజలను బిచ్చగాళ్లను చేస్తున్నారు..

నవతెలంగాణ-ఓదెల


మాట్లాడుతున్న దాసరి ఉష

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఉచిత పథకాలు పెట్టి ప్రజలను బిచ్చగాళ్లను చేస్తున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. ఓదెల మండలంలోని నాంసానిపల్లి గ్రామంలో మన ఊరు మన ఉషలో భాగంగా బీఎస్పీ జెండాను ఆవిష్కరించారు. మహిళలు బీఎస్పీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా కన్వీనర్ పూరేళ్ల స్వప్న గౌడ్, బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ కోశాధికారి ఎండి రియాజ్, ఓదెల మండల మహిళ కో-కన్వీనర్ మేకల శోభ, ఓదెల మండల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ గామ శాఖ ఎస్సీ సెల్ అధ్యక్షుడు

నవతెలంగాణ-సుల్తానాబాద్‌రూరల్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత గ్రామ శాఖ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కల్లేపల్లి శంకర్ శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, మాజీ ఎంపీపీ పాల రామా రావు, బిఆర్ఎస్ యువత మండల అధ్యక్షుడు గుడుగుల సతీష్,బి ఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రవెల్లి వేణు గోపాలరావు, ఉప సర్పంచ్ ఎర్రవెల్లి రామారావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల రాజయ్య పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సన్మానించిన లైన్స్‌క్లబ్ ప్రతినిధులు

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్

మండలంలోని గర్రెపల్లి గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షన్ 2023 రాష్ట్ర స్థాయి అవార్డు రావడానికి కృషి చేసిన గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షురాలు విరగోని సుజాత రమేష్‌గౌడ్ దంపతులను, గ్రామ కార్యదర్శి ప్రశాంత్‌ను ఘనంగా శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వలస నీలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పోచంపెల్లి పోచమల్లు, చక్రాధర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-మంథని

మండలం ధర్మారం, బిట్టుపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కొయ్యల పెద్ద రాజయ్య, రాచకొండ రాజయ్య కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్,సింగల్ విండో డైరెక్టర్ రవి కంటి సతీష్, బీసీ సెల్ మంథని మండల అధ్యక్షులు ఆయిలి శ్రీనివాస్.ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, యూత్ కాంగ్రెస్ మంథని మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,(గామ శాఖ అధ్యక్షుడు పుల్ల రవి,మాజీ సర్పంచులు దోరగొర్ల.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదానం కోసం విరాళం అందజేత

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో అనిల్ దీప్‌గౌడ్ చెర్లపల్లి ఫౌండేషన్, చైర్మన్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో డబ్బా లోకల్ పబ్జి ప్లేయర్స్ యూత్‌కు గణపతి నవరాత్రుల భాగంగా అన్నదానం కోసం సర్వాయి పాపన్న గీత కార్మికుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు నేరెల్ల సుభాష్ గౌడ్ రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు ఎలుక అశోక్‌గౌడ్, సంఘ సభ్యులు అబ్బూరి చిన్న మల్లయ్య, అబ్బూరి ఎల్లా గౌడ్, నేరెళ్ల రాజేశ్వర్ గౌడ్, ప్రకాష్, సుధావేణి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత చిత్ర పటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కోరుట్ల


పాలాభిషేకం చేస్తున్న మహిళలు

కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్సీ కవిత చిత్ర పటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ కవిత కృషి, పోరాటం వల్లే పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్‌కు పెట్టి, ఆమోదించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా కార్య కర్తలు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న డాక్టర్ సంజయ్

నవతెలంగాణ-మల్లాపూర్


పాల్గొన్న డాక్టర్ సంజయ్

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా శుక్రవారం కొనసాగుతున్నాయి. గొర్రె పెల్లి అంబేద్కర్ యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సంజయ్ హాజరయ్యారు. జడ్పీటీసీ సంధి రెడ్డి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ కదుర్గ నరసయ్య, పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు డీలర్ మల్లయ్య తదితరులు ఉన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించడంలో బిఆర్ఎస్, బీజేపీ విఫలం

- కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

నవతెలంగాణ-మల్లాపూర్:


మాట్లాడుతున్న నర్సింగ్ రావు

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణలో బిఆర్ఎస్,బీజేపీ విఫలం అయ్యాయని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం షుగర్ ఫ్యాక్టరీ వెంటనే తెరిపించాలని డిమాండ్ చేస్తూ అయిలాపూర్ గ్రామం నుంచి, యూసుఫ్‌నగర్ మీదుగా మండలంలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వరకు, సుమారుగా ఏడు కిలోమీటర్లు ఎనిమిదో నిరసన పాదయాత్ర నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు భరోసా పథకం అమలు చేస్తామన్నారు. ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ, ప్రజాస్వామ్య, సామాజిక తెలంగాణ కాంగ్రెస్‌కి సాధ్యపడు తుందన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ఎన్నికల సమయంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని కచ్చితంగా తెరిపిస్తానని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని నేడు ఇచ్చిన హామీని నెరవేర్చని అసమర్థ ఎమ్మెల్యేగా చరిత్రలో కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మిగిలిపోయారని ఆరోపించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ శ్రేణులు నిరసనగా సీఎం కసీఆర్,నిజామాబాద్ ఎంపీ బీజేపీ ధర్మపురి అరవింద్,అసమర్థ ఎమ్మెల్యే దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, అయిలాపూర్ రైతు నాయకులు పులి రెడ్డి, కుర్మా తిరుపతి రెడ్డి,ముస్కు గంగిరెడ్డి, ముక్కెర రాజేందర్, రాజేష్, తోట్ల మహేష్, మారుపక సుమన్, చిలివేరి వంశీ,గణేష్,కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మెట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజిరెడ్డి, మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,చిట్టా పూర్ సర్పంచ్ సాయి పాల్గొన్నారు.

మున్సిపల్‌లో అవినీతి, అక్రమాలు ఆగేదెన్నడు.?

- మున్సిపల్ అత్యవసర సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్ల ధ్వజం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల ప్రజలు ఇంటి పన్ను ద్వారా చెల్లించిన ఆదాయం నుంచి రూ. 24 లక్షలు దశాబ్ది ఉత్సవాలకు చేసిన ఖర్చును బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు చైర్మన్, కమిషనర్‌ను నిలదీశారు. జగిత్యాల పట్టణంలో సానిటేషన్ సరిగా లేనందున డెంగ్యూతో ప్రతి ఇంటిలో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారని వారు అధికారుల తీరుపై మండిపడ్డారు. మున్సిపల్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి చైర్మెన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన జరుగగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ లు హాజరయ్యారు. కౌన్సిల్ ఎదుట పలు అంశాలను లేవనెత్తారు. జగిత్యాల మున్సిపాలిటి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమావేశానికి గౌరవ సభ్యులందరు కావాలని కోరుతూ నిన్న రాత్రి ఎజెండా అంశాలు కాపీని పంపించారని, కానీ ఎజెండాలో 17 అంశాలు పొందుపరిచారని అన్నారు. జగిత్యాల మున్సి పాలిటీలో వివిధ శాఖలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజాధనం దుర్వినియోగం, ప్రజలను ఇబ్బందులు పాలు చేసే పనితీరుపై సమావేశం దృష్టి తీసుకొచ్చారు. ఏర్పాటు చేసిన అత్యవసర సమా వేశం అంటే ఏమిటి.. సాధారణ సమావేశం అంటే ఏమిటి.. ఈ సమావేశాలు ఏ సందర్భంలో నిర్ణయిస్తారో చైర్ పర్సన్ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్వీపింగ్ మిషన్ రూ. 44 లక్షలకు కొనుగోలు చేసినప్పటి నుంచి నిరుపయోగంగా ఉన్నా దాని పేరు మీద చూపే ఖర్చులు సానిటేషన్ అధికారులకు, ఇంజనీర్ అధికారులకు కల్పతరువుగా మారిందన్నారు. డీజిల్ లో విచారణ జరిగినప్పటికి అవినీతి మాత్రం మళ్ళీ ప్రారంభమైనదన్నారు. డీజిల్‌లో జరిగే అవినీతిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, ప్రజాధనం రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బారాస, బీజేపీ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

- జగిత్యాల అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

నవతెలంగాణ-జగిత్యాలటౌన్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ బీ.ఎస్‌లత ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతుబంధు, రైతుబీమా, రుణ మాఫీ, దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రీలీఫ్‌ఫండ్ పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ లబ్దిదారుల వివరాలను, వారికి ఇప్పటి వరకు మంజూరైన నగదుకు సంబంధించిన వివరాల నివేదికను తమకు సమర్పించాలని సూచించారు. మత్స్యశాఖ ద్వారా ఇంత వరకు అర్హులైన లబ్దిదారులకు 2014 నుంచి 2023 వరకు ఏమేమి బెనిఫిట్స్ ఇచ్చారు, లబ్దిదారులకు అందించిన ఆర్థిక సహాయం వివరాలు రెండు రోజుల్లోగా తమకు రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, జీపీ భవనాలు, రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణంపై నివేదికలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణా ళిక అధికారి వి.పూర్ణచంద్రరావు, రెవిన్యూ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెపై అసత్యపు ప్రచారం మానుకోవాలి

నవతెలంగాణ-మంథని


పాల్గొన్న అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు

అంగన్‌వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం అసత్యపు ప్రచారం మానుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు బూడిద గణేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 12వ రోజుకు చేరుకుంది. శుక్రవారం వర్షాన్ని లెక్క చేయకుండా అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమ్మెపై మంత్రి సత్యవతి రాథోడ్ అసత్య ప్రచారం చేయడం అన్యాయమన్నారు. పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలలో అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలు తెలంగాణ కంటే ఎక్కువగా ఉన్నాయని, అదే విధంగా కేరళలో అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రత్యేకమైన వెల్ఫేర్ బోర్డును అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పండగ బోనస్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇస్తుందని అన్నారు. అస్సాం, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.4 లక్షలకు పైగా ఉందన్నారు. సమస్యను ఒక వేతనం చుట్టూ మాత్రమే తిప్పుతూ ప్రజలలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె పట్ల తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సులోచన, శోభ, కృష్ణకుమారి, హరిత, సుగుణ, రాజలక్ష్మి, భాగ్య, శారద అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు,పాల్గొన్నారు.

ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్

అంబేద్కర్ భవన నిర్మాణం, స్థలం కేటాయింపు విషయంలో పెద్దపల్లి ఆర్డీఓను కలవగా తనతో అవమానకరంగా ప్రవర్తించారని మహనీయుల ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొంకూరి కైలాసం శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ భవన నిర్మాణం, స్థలం కోసం జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే అనేకసార్లు ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆర్డీఓను కలిస్తే చులకనగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట కండె కరుణాకర్, శంకరయ్య, మంతని వెంకటేష్, అంబాల మహేష్, భానాల స్వామి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ స్పెషాలిటీ వైద్యం

నవతెలంగాణ సుల్తానాబాద్



ప్రతి ఒక్కరికీ స్పెషాలిటీ వైద్యం అందించాలని లక్ష్యంతో ఆయుష్మాన్ భవ కార్యక్రమం ఉద్దేశం అని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళాను మెడికల్ సూపరిం టెండెంట్ రమాదేవితో కలిసి ప్రారంభించారు.

ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడిగా కొంకటి నియామకం హర్షణీయం

నవతెలంగాణ - పెద్దపల్లిటౌన్



మాట్లాడుతున్న నాయకులు

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడిగా రామగుండం మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ నియామకం హర్షణీయమని జాతీయ అవార్డు గ్రహీత, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భూషిపాక సంతోష్ అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, నిమ్న వర్గాల ప్రజల పక్షాన వారి సమస్యలను పరిష్కరించడంలో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాకేష్, జిల్లా కార్యదర్శి చిప్పకుర్తి శంకర్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు కాంపెల్లి మొగిలి, నాయకులు కొండపలకల విజయ్‌కుమార్, భూషిపాక శ్రీకాంత్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎజెండా అంశాలపై విచారణ జరపాలి

- కలెక్టర్‌కు కౌన్సిలర్ ఫిర్యాదు

నవతెలంగాణ-జగిత్యాల

గత నెల ఎజెండాలో పొందు పరిచిన అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి సంబంధిత అధికారుల పైన చర్యలు తీసుకోవాలని 35వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో హరితహారం కోఆర్డినేటర్‌కు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చెల్లించిన జీతంకు సంబంధించి, క్రీడా ప్రాంగణాల పేరిట లక్షల సొమ్ము దుర్వి నియోగం, ఖిల్లాలో స్వచ్ఛతాహి సేవ 2023 కార్యక్రమం ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఆధ్వర్యంలో జరగగా సానిటరీ ఇన్స్పెక్టర్ 15 వేల రూపాయలు చెల్లించడం, స్లీపింగ్ మిషన్ రిపేర్‌కు 4 లక్షలు ఖర్చు చేయడం వంటి వాటిపైన పూర్తి స్థాయిలో విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

రైతు మండల సమన్వయ సమితి అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-కథలాపూర్


సన్మానిస్తున్న నిర్వహకులు

కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట గ్రామంలో రైతు మండల సమన్వయ సమితి అధ్యక్షుడు గడ్డం భూమరెడ్డిని మాల సంఘ యూత్ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సూచిం చారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గణేష్, గంగాధర్ కూన ప్రవీణ్, రాజారెడ్డి, రవి, దేవేందర్, ఆంజనేయులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో ఎక్స్ ప్రెస్ రైలు ఆపాలి

- దక్షిణ మధ్య రైల్వే మేనేజర్‌కు వినతి

నవతెలంగాణ-ఓదెల

మండలంలోని పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని స్థానిక నాయకులు దక్షిణ మధ్య రైల్వే మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నస్పూరి రామస్వామి, వేముల శ్రీను, కుమార్, అంబాలరాజు ఉన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామంలో స్వచ్ఛహి సేవలో భాగంగా రామాలయం గుడి దగ్గర శ్రమదానం, డ్రై డే, కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీ రావు పాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పొన్నాల అనిత అంజయ్య ,గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, ఎంపీడీవో శశికళ , ఎంపీఓ ఫయాజ్ , గ్రామ సెక్రటరీ,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-మంథని

మంథని పట్టణంలోని రాజగృహలో నియోజకవర్గానికి చెందిన ఆయా మండలాల్లోని కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ కండువా కప్పి పార్టీకి ఆహ్వానించారు.

781 మెట్రిక్ టన్నుల గోదాం ప్రారంభం

నవతెలంగాణ-కథలాపూర్


ప్రారంభిస్తున్న కొండూరి రవీందర్‌రావు

కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలో 781 మెట్రిక్ టన్నుల గోదాన్ని టెస్కాబ్ అధ్యక్షుడు కొండూరి రవీందర్ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిరికొండ గ్రామంలో రూ.50 లక్షలతో గోదాం నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా మండలంలో సహకార సంఘాన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. సంఘాల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం సిరికొండ సహకార సంఘంలో రెండు కోట్ల వరకు రుణాలు అందజేసినట్టు తెలిపారు. భారతదేశంలోని బ్యాంకులను దీటుగా సొసైటీ పని చేస్తుందని, చొప్పదండి సహకార సంఘం దీటుగా జాతీయ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో భూమరెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్షులు కోడిపల్లి గోపాల్ రెడ్డి ,చైర్మన్ చుక్క దేవరాజం, డైరెక్టర్లు గంగాధర్, వార్డ్ మెంబర్ సునీల్, వైస్ చైర్మన్ బత్తుల నరేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-మేడిపల్లి


రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

మేడిపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలను అదుపులో ఉంచాలని, హెల్త్ క్యాంపులు నిర్వహిం చాలని సూచించారు. కట్లకుంట గ్రామంలో ప్రోగ్రాం ఆఫీసర్ సమియోద్దీన్ జరపేడితులతో మాట్లాడారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌చంద్ర ఏఎన్ఎంలతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఉమ్మడి మండలంలోని 25 గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతను అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ దేవన్న, వైద్య సిబ్బంది ప్రేమలత, ఏఎన్ఎం పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మండలంలోని వర్షకొండ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. కాగా 108 మంది వైద్య పరీక్షలు చేసుకోగా 32 మందిని ఆపరేషన్ నిమిత్తం కరీంనగర్ లోని రేకుర్తికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొంతుల శ్యామల, ఎంపీటీసీ పోనకంటి వెంకట్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా తెలంగాణ ప్రభుత్వం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిరుపేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వెంకటేశ్వర కళ్యాణ్ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పెన్షన్ దార్ల గుర్తింపు కార్డుల పంపిణీ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అనంతరం వర్షకొండ గ్రామంలో ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీటీసీ కంతం భారతి రమేష్ , ఎంపీపీ జాజాల భీమేశ్వరి జగన్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏలాల దశరథ్‌రెడ్డి సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ పార్టీయే

- కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు
- బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పలువురు చేరిక

నవతెలంగాణ-మల్లాపూర్:


పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సింగ్‌రావు

తెలంగాణ రాష్ట్రంలో అధికారులకు రాబోయేది కాంగ్రెస్ పార్టీ అని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నర్సింగ్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్టాపూర్, వేంపల్లి గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చినక కేసీఆర్ కుటుంబమే అభివృద్ధి చెందిందని ఆరోపించారు. పార్టీలో చేరిన చిట్టా పూర్ బిఆరెస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు ఇట్టేడి గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చిట్టా పూర్ సర్పంచ్ సాయి,కంది బుచ్చి రెడ్డి, కొత్తపల్లి రాజారెడ్డి, కొత్తపల్లి రాజేందర్,ప్రణయ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతు శేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు నానం రాకేష్, సీనియర్ నాయకులు జలపతి రెడ్డి, గంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-మల్లాపూర్



మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్న పిల్లల క్యాన్సర్ పై అవగాహన ముద్రించిన కరపత్రాలను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్, మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాబోయే తరాలకు శాపంగా మారిన పిల్లల క్యాన్సర్ ప్రతి సంవత్సరం నాలుగు లక్షల మంది పిల్లలకు క్యాన్సర్ గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా రీజినల్ సెక్రటరీ రుద్రా రామ్ ప్రసాద్, 143 ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల రమేష్, క్లబ్ సభ్యులు మోర సతీష్, క్యాతం సురేష్ తిప్పర్తి రామ కిషన్, హెల్త్ సూపర్‌వైజర్ రామ్మోహన్, శ్రీనివాస్, ఏఎన్ఎం కోమల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెర్ప్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల మండల కేంద్రంలోని మండల సెర్ప్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని జిల్లా ఎస్పిఎం కో ఆర్డినేటర్ హరిణి అన్నారు. అన్నపూర్ణ, అక్షర మండల సమాఖ్యల సమావేశం నిర్వహించి, గ్రామాల్లో పారిశుధ్యం, తడి చెత్త, పొడి చెత్త సేకరణ, శ్రమదానం కార్యక్రమాల్లో మహిళ సంఘాల వారు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం పోదెల గంగాధర్, డీఎంజీ డి.దేవయ్య, సీసీలు విద్యాసాగర్, గంగారాం, రవీందర్, సంతోష్, రాజేందర్, రెండు మండల సమాఖ్యల అధ్యక్షురాళ్లు మారు సత్తవ్వ, డి.గంగభవాని, కార్యదర్శులు భారతి, జమున, కోశాధికారులు శ్రీలత, సుమలత అన్ని మండలాల గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని ప్రకటించాలి

- డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బుర్రి శ్యామ్

నవతెలంగాణ-ఓదెల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెండింగ్‌లో ఉన్న అనేక విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బుర్రి శ్యాం డిమాండ్ చేశారు. డీటీఎఫ్ ఓదెల మండల శాఖ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పీఆర్సీ కమిటీ వేసి వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జోన్ బాధ్యుడు రవీందర్‌రెడ్డి, మండల బాధ్యులు మోహన్, సురేష్, రాము, రాష్ట్ర కౌన్సిలర్ అమృత కిషోర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

● ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ-ఇల్లంతకుంట:

గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. జనా భా ప్రతిపాదికన మూడు నెలలకో సారి ప్రభుత్వం 'పల్లెప్రగతి' కింద నిధులు విడుదల చేయడంతో గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయని అన్నారు. సీమాంధ్ర పాలనలో గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. పారిశుద్యం, పచ్చదనం, చెత్త



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

సేకరణ, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, గ్రామపంచా యితీలకు ట్రాక్టర్‌లను సమకూర్చడం వంటి కార్యక్రమాలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ వేణు, ఎంపీపీ రమణా రెడ్డి, ప్రజా ప్రతినిధులు,పాల్గొ న్నారు.

ఖాతాదారుల సేవలో కేడీసీసీ బ్యాంక్

టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్ రావు

నవతెలంగాణ-చందుర్తి:



మాట్లాడుతున్న టెస్కాబ్ ఛైర్మన్ కొండూరి

ఖాతాదారుల సేవలో కేడీసీసీ బ్యాంక్ పని చేస్తుందని టెస్కా బ్ ఛైర్మన్ కొండూరి రవీందర్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన కేడీసీసీ బ్యాంక్ బ్రాంచిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటా డుతూ మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణాలు, విద్యార్థులు ఉన్నత చదువుల కోసం రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అరవై వేల కోట్ల రుణాలు ఇచ్చిన ఘనత కేడీసీసీ బ్యాంక్ దే అన్నారు. నాలుగువేల ఉద్యోగులకు ఈ బ్యాంక్ ద్వారా ఉపాది అభిస్తుండగా, మరో నాలుగు వేల మందికి ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో కేడీసీసీ బ్యాంక్ సేవలు చూసి ఒరిస్సా రాష్ట్ర బృందం కేడీసీసీ బ్యాంక్ సేవల కొనియాడారని అన్నారు. ఏలాంటి స్వలాభం లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా కేడీసీసీ బ్యాంకు ముందుకు సాగుతుందని అన్నారు. ఈ బ్యాంక్‌కు పట్టు కొమ్మలు సహాకార సంఘాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ లు, తిప్పని శ్రీనివాస్, కిషన్ రావు, బండ నర్సయ్య. పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్ కాలనీలో తాగునీటి కోసం ఆందోళన



ఖాళీ బిందెలతో కేసీఆర్ నగర్ ప్రధాన గేటు ముందు బైఠాయించిన మహిళలు

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇళ్లలో కాలనీవాసులకు కన్నీటికష్టాలు తప్పడం లేదు. వారం రోజులుగా కేసీఆర్ కాలనీలో మంచినీటి సరఫరా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని నిరసన వ్యక్తం చేస్తూ మహిళలు ఖాళీ బిందెలతో కేసీఆర్ నగర్ కాలనీ ప్రధాన గేటు ముందు బైటాయించారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లి కేసీఆర్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా సరిగా లేదని, మేం ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ప్రతీరోజు తాగునీటి కోసం తంటాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా సరిగా లేక కేసీఆర్ కాలనీలో నివాసముండలేక ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని వాపోయారు. బోరు బావు వేశారు. కానీ విద్యుత్ మోటర్లు బిగించకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. కాలనీ పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వాహణ అంతంత మాత్రంగానే ఉందన్నారు, రాత్రి వేళల్లో కాలనీకి రావాలంటే రహదారిపై వీధి దీపాలు లేక ప్రమాదాలు జరిగిన సంఘటనలు కోకోల్లలుగా ఉన్నాయన్నారు. కుక్కలు బెడద, పాముల బెడద చాలా మేరకు ఉందన్నారు. వెంటనే కేసీఆర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. ఆందోళన, ధర్నా చేస్తున్న మహిళల వద్దకు స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసులు మహిళలను ఆందోళను విరమించాలని కోరారు. కాలనీలో తాగునీటి సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీ మహిళలు ధర్నాను విరమింపజేశారు.

ఆస్తి మొత్తం లాక్కున్న కూతురు

ఆవేధనకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రులు

నవతెలంగాణ-తంగళ్ళపల్లి




చిల్ల మల్లయ్య, లచ్చవ్వ

మండలంలోని అంకిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన చిల్ల మల్లయ్య, లచ్చవ్వ దంపతులకు ఇద్దరు కూతుర్లు. మగసంతానం లేదు. ఇద్దరు కూతుర్లను పెంచి, ఏ లోటు లేకుండా చూసుకున్నారు. యుక్త వయస్సు రావడంతో పెళ్లిళ్లు చేశారు. అప్పులు కావడంతో చిన మల్లయ్య, లచ్చవ్వ దంపతులు తమకున్న వ్యవసాయ భూమిని అమ్మి అప్పులు కట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పెద్ద కూతురు అడ్డుకుంటున్నారని, తమ కూతురు నుండి ప్రాణహానీ ఉందని బాధిత వద్ధ దంపతులు విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మా కూతురుతో మాకు ప్రాణహాని ఉందని, కాపాడాలని వేడుకున్నారు. మాకు తగిన న్యాయం చేయాలని అధికారులను, పోలీసులను వేడుకుంటున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు

కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు.

నవతెలంగాణ-ముస్తాబాద్.



మహిళను రక్షించిన పోలీసులు

మండల కేంద్రానికి చెందిన పిల్లి చంద్రవ్వ(58) అనే వద్ధ మహిళ కుటుంబ సమస్యల కారణంగా మన స్థాపానికి గురై ముస్తాబద్ పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి మత్నిస్తుండగా చూసిన వ్యక్తి బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ బాలాశ్రీనివాస్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే బాలాశ్రీనివాస్ స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సదరు వద్ద మహిళలను కాపాడారు. ముస్తాబద్ మండల కేంద్రంలోని పీపుల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఎస్సై శేఖర్ రెడ్డి చంద్రవ్వ కుటుంబ సభ్యులను ఠాణాకు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. చంద్రవ్వను కుటుంబ సభ్యులకు అప్పగించి ఏ లోటు రాకుండా చూసుకోవాలని హితవు చేశారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన ముస్తాబద్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ బాలా శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

కేసీఆర్... ధర్నాల తెలంగాణ చేసిండు

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు మద్దతు

కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి



మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు మద్దతుతెలిపిన కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ధర్నాల తెలంగాణ చేశాడని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ, రాష్ట్ర నాయకులు కేకే మహేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆడ్డీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె మూడు రోజులకు చేరుకోగా, శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్‌తో కలిసి కేకే మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు గొంతెమ్మ కోరికలు కావని, చట్టబద్ధమైన న్యాయబద్ధమైన కోరికలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరడం తప్పేమీ కాదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

దసరా కానుకగా ప్రారశాలలో అల్పాహారం

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

● జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ అరుణ

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్:





మాట్లాడుతున్న జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అరుణ, పాల్గొన్న ప్రజాప్రతినిధులు అధికారులు

తెలంగాణ సర్కారు ప్రభుత్వ పాఠశాలల్లో దసరా పండుగ కానుకగా అల్పాహారం ఏర్పాటు చేస్తుందని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అరుణ అన్నారు. జిల్లా కలెక్టరేట్ హాల్ లో శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణభివృద్ధి, విద్య వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, పంచాయితీ రాజ్, మిషన్ భగీరథ, సెస్, రహదారులు, భవనాలు, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగాలు, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తమ ప్రగతి నివేదికను సభ్యుల ముందు ఉంచారు. సభ్యులు పలు అంశాలను లేవనెత్తగా అధికారులు వివరణ ఇచ్చారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ అరుణ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రాజన్న సిరిసిల్ల జిల్లా అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనపై దృష్టి సారించాలన్నారు. మినీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వాలు పెద్ద ఎత్తున రాయితీలు అందిస్తుందన్నారు. దళిత బంధు పథకం ద్వారా దళితుల జీవితాల్లో అభివద్ధి వెలుగులు నింపుతుందన్నారు. బీసీలకు, మైనారిటీలకు బీసీబంధు, మైనారిటీ లోన్స్ ద్వారా భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో టెక్స్ టైల్ కార్పోరేషన్ ఛైర్మన్ గుడూరి ప్రవీణ్, డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతు బంధు అధ్యక్షులు గడ్డం నర్సయ్య, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, అడిషనల్ కలెక్టర్స్ ఖీమ్యానాయక్, గౌతంరెడ్డి, జెడ్పీటీసీలు. ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలి

తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన కలెక్టర్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:



తహసీల్దార్లతోసమీక్ష నిర్వహించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

ఆఫ్‌లైన్‌లో వచ్చిన ఓటరు దరఖాస్తులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్‌తో కలిసి తహసీల్దార్లతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఓటరు దరఖాస్తుల ఆన్ లైన్, ధరణి, మీసేవా దరఖాస్తులు, రెండు పడక గదుల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫామ్ -6, ఫామ్ -7 దరఖాస్తుల పెండింగ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, సుమోటోగా స్వీకరించి ఏ వ్యక్తి ఓటును డిలీట్, షిఫ్టింగ్ చేయవద్దని, నోటీస్ అందించి, గడువు పూర్తయిన తర్వాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. పురుష, స్త్రీ ఓటరు నిష్పత్తి పెంచేలా చూడాలని, ఓటరు నిష్పత్తి తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సంబంధిత ఆర్డీవోలు క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించి యాక్షన్ తీసుకోవాలని సూచించారు. తహసీదార్లు పటిష్ట, ఆరోగ్యకరమైన ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలన్నారు. మీ సేవా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ముస్తాబాద్ మండలం గూడెం, తంగళ్ళపల్లి మండల కేంద్రం, జిల్లెల్ల గ్రామాల్లో రెండు పడకల ఇండ్లు లబ్దిదారులను ఎంపిక చేయాలని సంబంధిత ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు ఎన్.ఆనంద్ కుమార్, మధుసూధన్, బి.గంగయ్య పంచాయితీ రాజ్ ఈఈ సూర్య ప్రకాష్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బి.శ్రీనివాస చారి, సెస్ ఎండీ సూర్యచందర్ రావు, జిల్లా సహకార శాఖ అధికారి బుద్ధ నాయుడు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్, జిల్లా విద్యాధికారి ఎ.రమేష్ కుమార్, సహాయ లేబర్ అధికారి రఫీ, అదనపు డీఆర్డీఓ మదన్ మోహన్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంరెడ్డి, పర్యవేక్షకులు శ్రీకాంత్, రమేష్, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు షరీఫ్ మోహినుద్దీన్, మహేష్ కుమార్, ఎన్నికల విభాగం నాయబ్ తహశీల్దార్లు రెహమాన్, మనోజ్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని "ఫీజు దీక్ష"

దీక్షను ప్రారంభించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:



అంబేద్కర్ చౌరస్తాలో ఫీజు దీక్ష చేపట్టిన ఎస్ఎఫ్ఐ నేతలు

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 5,177 కోట్ల స్కాలర్షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ 'ఫీజు దీక్ష' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ ను భ్రష్టు పట్టించిందన్నారు. గత 5 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ 5,177 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్ పెంచాలని సంక్షేమ వసతి గహా విద్యార్థులకు మేస్ కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్‌తో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని అన్నారు. తక్షణమే విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని జిల్లాలో సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు కాలం గడుపుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఎందుకు అమలు చేయలేదన్నారు. జిల్లాలో బాలుర ఎస్టీ మేనేజ్మెంట్ హాస్టల్ ఏర్పాటు చేయాలని అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓ లను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ వేసి ఖాళీలను భర్తీ చేయాలని జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్ జిల్లా నాయకులు వేణు, ఆదిత్య, అభిషేక్, సాయిచరణ్, సంతోష్, అరవింద్, భాను, శ్రీకాంత్, నవీన్, లహరిక, శతి, సంజన తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల వేలం పాటకు ప్రణాళిక సిద్ధం చేయాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి




మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ శివారులో చేపట్టిన మోడల్ లే ఔట్ లోని ప్లాట్లను వేలం వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం సమీకత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో మోడల్ లే ఔట్ పనుల పురోగతిపై చర్చించారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలని ఆడ్డీవోను ఆదేశించారు. వారం రోజుల్లోగా మోడల్ లే ఔట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆడ్డీవో ఎన్.ఆనంద్ కుమార్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, మున్సిపల్ కమీషనర్ అయాజ్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, తహసీల్దార్ షరీఫ్, మోహినుద్దీన్ తదితరులు ఉన్నారు

చిరుత పిల్లల సంచారం

నవతెలంగాణ-కోనరావుపేట:



లభ్యమైన చిరుతపులి పిల్ల

కోనరావుపేట మండలం శివంగలపల్లి శివారులో చిరుత పులి రెండు పిల్లలకు జన్మనిచ్చింది. కాగా ఒక పిల్లను చిరుత తీసుకు వెలుతుండగా రైతు చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. దీంతో చిరుత పిల్లను వదిలేసి పారిపోయింది. అక్కడే ఉన్న చిరుత పిల్లను చూచేందుకు జనం తరలివచ్చి ఫోటోలు దిగుతున్నారు. అధికారులు చిరుత పిల్లను కరీంనగర్ రేంజ్ కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. చిరుత సంచారంతో ఆ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ రైతులు భయందోళనకు గురవుతున్నారు. వెంటనే చిరుతను పట్టుకోవాలని కోరారు.

కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజేందర్ రెడ్డి

నవతెలంగా ణ-ఇల్లంతకుంట:




నియామక పత్రం అందిజేస్తున్న అన్వేష్‌రెడ్డి

కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాశం రాజేందర్ రెడ్డి శుక్రవారం ఏక గ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు సుంకేట అన్వేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన రాజేందర్ రెడ్డి రైతులకు చేసిన సేవను గుర్తించి పదవిని కట్టబెట్టినట్లు పేర్కొన్నారు . సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధనాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ రైతుల కోసం నిరంతరం కషి చేస్తున్నారన్నారు . నియమకానకి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీదర్ బాబు, మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారయణ. ఆది శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే పర్యటనలో ముందస్తు అరెస్టులా!

నవతెలంగాణ-ఇల్లంతకుంట:



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

మండలంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటనలో భాగంగా ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేయడం, పోలీస్ స్టేషన్ లకు తరలించడం ఆనవాయితీగా మారిందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు వెంకట్ ఆరోపించారు. విలేకరులతో మాట్లాడుతూ శాసనసభ్యుడు బాలకిషన్ మండలాన్ని అభివద్ధి చేస్తే నాయకుల ముందస్తు అరెస్టులు ఎందుకని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మామడి నరేష్, జమాల్, అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు మచ్చ రాజేశం, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్, ప్రధాన కార్యదర్శి కాసుపాక రమేష్, దూస రాజు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద కుంకుమ పూజలు

నవతెలంగాణ-ముస్తాబాద్.

మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు కలిసి ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వేద పండితులు హరీష్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు.

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

నవతెలంగాణ-కోనరావుపేట



ఎస్పీ అఖిల్ మహాజన్

పోలీసులు అంటే ప్రజలకు నమ్మకం కలగాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజాన్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, కేసులు, పెండింగ్ కేసుల వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాత నేరస్తులు, సస్పెక్ట్‌లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ, గస్తీ నిర్వహించాలన్నారు. డయల్ 100 కాల్‌కు వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి జాగ్రత్తపడాలన్నారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గీత కార్మికుల బలోపేతానికి కృషి



తాటిచెట్ల మొక్కలను పంపిణి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

గీత కార్మికులు ఆర్థికంగా బలపడడానికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని హరితహారంలో భాగంగా తాటిచెట్ల మొక్కలను పంపిణి చేయడం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట గ్రామంలో శుక్రవారం గీత కార్మికులకు తాటి చెట్ల పెంపకం కోసం మొక్కలను పంపిణి చేశారు. ఈ సంధ్బంగా తోట ఆగయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుండి మరుగుజ్జు తాటి ఇత్తనాలను సేకరించడం జరిగిందని మంత్రి కేటిఆర్ ఆదేశాల మేరకు గౌడ గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పంపిణి చేసి నాటించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 50వేల విత్తనాలు నాటుటకు అధికారులకు ఆదేశాలు జారి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, మార్కెట్ కమిటి ఛైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్, మాజీ ఛైర్మన్ కొండ రమేష్ గౌడ్, సర్పంచ్ ముక్క శంకర్ నాయకులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యలను లేకుండా చేస్తాం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీవాసులు చాలాకాలంగా విద్యుత్ వోల్టేజీ సమస్యను ఎదుర్కొంటుండగా వారంరోజులలో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు సెస్ డైరక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. విద్యుత్తు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిచండం కోసం వినియోగదారులకు అందుబాటులో మండల కేంద్రంలో సెస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ లైన్‌మేన్ లక్ష్మీరాజం, ఏఎంసీ వైస్ ఛైర్మన్ బందారపు బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండారి బాల్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎలగందుల నరసింహులు, నంది కిషన్, పందిర్ల పర్శరాములు గౌడ్‌లు పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లాలి: కేకే

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట:

ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌లను, గ్యారంటీ కార్డును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం నెరవేర్చని హామీలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రైతులకు రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్, మహిళలకు ప్రియాంక గాంధీ డిక్లరేషన్, ఎస్సీలకు మల్లికార్జున్ ఖార్గే డిక్లరేషన్ ప్రజలకు వివరించాలన్నారు. అలాగే గ్యారెంటీ కార్డులోని ఆరు అంశాలను ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల లోపలనే అమలు పరుస్తామని ప్రజలకు తెలియజేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలు సుముఖంగా ఉన్నారని వారి వద్దకు కార్యకర్తలు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగం గౌడ్, నాయకులు సూడిద రాజేందర్, బీపేట రాజు, సంతోష్ గౌడ్, చెన్నిబాబు, కొత్తపల్లి దేవయ్య, రఫీక్, వంగ మల్లారెడ్డి, గంట బుచ్చా గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

నవతెలంగాణ-ముస్తాబాద్:

మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నమనేని శ్రీనివాస రావు జన్మదిన సందర్భంగా పోతుగల్ ప్రభుత్వ పాఠశాలకు ఆయన కూతురు అనుష్క ఐదు కంప్యూటర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌతమ్ రావు మాట్లాడుతూ కన్న ఊరును, పాఠశాలను మర్చిపోకుండా ప్రేమతో పేద విద్యార్థుల చదువు కోసం కంప్యూటర్లు వితరణ చేయడం చాలా సంతోషమని కొనియాడారు. అనంతరం ఆయన పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి కాపాడండి

నవతెలంగాణ-ముస్తాబాద్:





పంట నాశనం చేసిన కోతులు, రైతు

కోతుల బెడద నుండి కాపాడాలని కౌలు రైతులు అధికారులను వేడుకున్నారు. పంటలు వేసి కాతకు వచ్చిన తర్వాత కోతులు చేతికందకుండా చేస్తున్నాయని, తాము ఆర్థికంగా ఏటా నష్టపోవాల్సి వస్తోందని వాపోయారు. ఉదాహరణకు ముస్తాబాద్ చెందిన బట్టు శంకర్ అనే కౌలు రైతు రెండు ఎకరాలలో ప్రత్తి పంట వేయగా, చేతికంచే సమయంతో 200 కోతులు పంట మీద పడి తినేశాయని వాపోయాడు. రూ. లక్ష అప్పు చేసి పెట్టుబడి పెడితే చిల్లిగవ్వ చేతికి రాని పరిస్థితి దాపురించిందని ఆవేధన వ్యక్తం చేశాడు. ఇది ఏదో శంకర్ అనే కౌలు రైతు వ్యధ కాదు. రైతులందరూ ఎదుర్కొంటున్న సమస్యగా గుర్తించాలని ప్రాధేయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ల పై మండిపడ్డ మహిళలు

మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా

మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



బాధితులను అరెస్టు చేస్తున్న పోలీసులు, మాట్లాడుతున్న సిఐ ఉపేందర్

నవతెలంగాణ -సిరిసిల్ల రూరల్

లంచాలు తీసుకుంటూ అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేస్తున్నారని సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్ల పై మహిళలు మండిపడ్డారు. శుక్రవారం సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠయించి నిరసన తెలిపారు. సీపీఐ(ఎం) నాయకులను, ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నవ తెలంగాణ సిరిసిల్ల రూరల్

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆడేపు రవీందర్ అన్నారు అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు చందన, ఎదురుగట్ల మమత, కొప్పుల పద్మ, ఓరగంటి శ్యామల, జిల్లా ఏఐటియుసి, నాయకులు కడారి రాములు బీజేపీ నాయకులు అజ్జె వేణు, నాగుల శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

దేశంలో ఏ రాజకీయ పార్టీ కల్పించని విధంగా జనసేన సభ్యత్వంలో కార్యకర్త కుటుంబ భద్రతపై పవన్ కళ్యాణ్ దృష్టి సారించారని జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ బెక్కం జనార్దన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో పార్టీ సభ్యత్వ కిట్లను కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ కిట్టులో పవన్ కళ్యాణ్ మనోగతాన్ని ముద్రించిన పుస్తకం, పార్టీ నోట్ బుక్, సభ్యత్వ ఐడి, జనసేన పార్టీ ఎన్నికల గుర్తు గాజుగ్లాసు, 5 లక్షల బీమాతోపాటు గాయపడితే 50 వేల తక్షణ ఆర్థిక సహాయం అందించే భరోసా కల్పిస్తున్న బ్రోచరును అందించామన్నారు.



ఈ కార్యక్రమంలో జగిత్యాల మండల అధ్యక్షులు బొల్లి రాము, ఉపాధ్యక్షులు బొల్లి లక్ష్మణ్, సెక్రటరీ గొడుగు శ్రీనివాస్, గొడిసెల మనోజ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు చింత సుదీర్, ఉపాధ్యక్షుడు కిరణ్ సింగ్, రాయికల్ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, సెక్రటరీ బాబు శివ కుమార్ పాల్గొన్నారు.

విఘ్నేశ్వర మండపాలను సందర్శించిన డీసీసీ అధ్యక్షుడు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

గణేష్ నవరాత్రుత్సవాల్లో భాగంగా గోదావరిఖనిలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శుక్రవారం దర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు లింగస్వామి, ఓదెలు, బొంతుల రాజేష్, గట్ల రమేష్, మ౹ఉస్తాఫా, ఎండి.ఆసిఫ్ పాషా, దూళికట్ట సతీష్, విజయ్, ఉదయ్ తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేత

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

రామగుండం కార్పొరేషన్ 3వ డివిజన్‌లోని జంగాలపల్లికి చెందిన పెగడపల్లి శివకృష్ణ ప్రయివేట్ సెక్యూటి గార్డ్‌గా పని చేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అతని భార్య శారదా, ఇద్దరు చిన్న పిల్లలు రిత్విక్, ప్రాణవి, వృద్ధురాలైన తల్లి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. . విషయం తెలిసిన శ్రీసీతారామ సేవా సమితి సభ్యురాలు గోలివాడ చంద్రకళ స్పందించారు. బాధిత కుటుంబానికి రెండు నెలలకు సరిపడా 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యురాళ్లు కంది సుజాత, కొండు రమ, మేడగోని స్వప్న, శశి పాల్గొన్నారు.

గాయపడ్డ కార్మికులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ -మెట్‌పల్లి



ఆర్థిక సహాయం అందిస్తున్న సంఘ సభ్యులు

మెట్‌పల్లి డివిజన్ పెయింటర్స్, పిఓపి వర్కర్స్ యూనియన్ సభ్యులు మహమ్మద్ జుబేర్, అబ్దుల్ సమిలు పని చేస్తూ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. యూనియన్ తరుపున శుక్రవారం ఒక్కొక్కరికీ రూ.5వేల ఆర్థిక సాయం అం దించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జనగాం రమేష్ ,ప్రధాన కార్య దర్శి బిజనపల్లి మనోహర్, కోశాధికారి మాతంగి శ్రావణ్, సహాయ కార్యదర్శిలు ఎస్కే గౌస్, షేక్ సోను , అంకమల్ల మహేష్ మారంపల్లి రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వచ్ఛతా హి సేవాపై అవగాహన

నవతెలంగాణ-మెట్ పల్లి

మెట్‌పల్లి మున్సిపాల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో అధికారులు ఇండియాన్ స్వచ్ఛ లీగ్, స్వచ్ఛతాహి సేవాపై విద్యార్థులకు అవగాహన కల్పించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి మున్సిపాలిటీకి రూ.5కోట్లు మంజూరు

నవతెలంగాణ -మెట్ పల్లి

మెట్‌పల్లి మున్సిపాలిటీకి రూ.5 కోట్లు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 729ని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసినట్టు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తెలిపారు.నిధులు విడుదల చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌తో పాటు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఆయుష్మాన్ భవ: వైద్య శిబిరం ప్రారంభం

నవతెలంగాణ -మెట్ పల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి ప్రభుత్వాస్పత్రిలో ఆయుష్మాన్ భవః వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలందరికీ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. డీఎం హెచ్‌వో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భవః కార్యక్రమంలో వారం వారం ఆరోగ్య మేళాలు నిర్వహించి అర్హులకు ఆభ్కే కార్డులు అందించేతమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరిం టెండెంట్ సాధిక్, వైద్యులు, అమరేశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోతుగంటి రాజేందర్‌గౌడ్, ఎంపీటీసీ అంకం స్వప్న శంకర్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

అంగన్‌వాడీలకు బీజేపీ నాయకుల సంఘీబావం

నవతెలంగాణ - ఎండపల్లి



పాల్గొన్న బీజేపీ నాయకులు

ఎండపల్లి కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు, గాజుల మల్లేశం, కొత్తపేట గ్రామ సర్పంచ్ కొమ్ము రాంబాబు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రమోద్, గంగాచలం, భూసారపు వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు

మహిళ మెడలో గొలుసు చోరీ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసును చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని డబ్బా గ్రామంలో శుక్రవారం జరిగింది. డబ్బా గ్రామానికి చెందిన బొడ్డు మమత ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో పనులు ముగించుకొని సాయంత్రం ఎస్సారెస్పీ కాలువ వెంబడి నడుచుకుంటూ గ్రామానికి వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి మహిళలను అడ్డుకొని కత్తి చూపించి మెడలో ఉన్న బంగారు గొలుసు లాకెళ్లాడు. దాదాపు తులం నర పైననే బంగారం ఉంటుందని బాధితురాలు వాపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

బీజేపీని రాజకీయంగా బొందపెడుతాం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

బీజేపీని రాజకీయంగా బొందపెడుతామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసిల్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. దీంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. అనంతరం ఆర్డీవో కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్.పి. జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం మాదిగ, ఎంఎస్‌పి కో కన్వీనర్ సతీష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీనివాస్ మాదిగ, కో కన్వీనర్ బలవంతులు సురేష్ మాదిగ, అరికిళ్ళ సతీష్, దీకొండ మహేం దర్, మోతే సుధాకర్, బిరుదులు గంగారాం, బిరుదులు శ్రీను, కటుకురి రాజ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణం మానుకోవాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు**

నవతెలంగాణ -పెద్దపల్లి



మాట్లాడుతున్న ఎరవెల్లి ముత్యంరావు

గర్ల్స్ జూనియర్ కాలేజీ స్థానంలో గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణం మానుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముత్యంరావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక శాంతి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో పెద్దపల్లి డివిజన్ సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ కాలేజీ భవనాన్ని కూల్చి, దాని స్థానంలో గ్రంథాలయాన్ని నిర్మిస్తామని ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ఆనాలోచితమైన నిర్ణయాన్ని ఇప్పటికైనా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ కాలేజీ స్థానంలో గ్రంథాలయాన్ని నిర్మించకూడదని శంకుస్థాపనకు వచ్చిన మంత్రి కొప్పుల ఈశ్వర్‌కి వినతిపత్రం ఇవ్వడానికి శాంతియుతంగా ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థినులను,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జిల్లెల్ల ప్రశాంత్‌ను అరెస్టు చేసి ఆటోలో తీసుకెళ్తూ భౌతిక దాడికి దిగడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇలాంటి అరాచకపు పద్ధతులను పోలీసు అధికారులు మానుకోవాలన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా, శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ స్కూళ్లను, కాలేజీలను కూల్చి వేస్తూ, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను బలోపేతం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి లేకుండా శంకుస్థాపన ఎలా చేశారో మంత్రి , స్థానిక ఎమ్మెల్యే ఇక్కడి ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్ నిర్మాణానికి సంబంధించి కూడా ఒక వివాదాస్పద స్థలాన్ని కేటాయించి, నిర్మాణం కాకుండా కుట్ర చేశారని అన్నారు. విద్యార్థి సంఘాల అనేక పోరాటాల తర్వాత మంజూరైన ఎస్సీ ఎస్ఎంఎస్ హాస్టల్స్‌కు ఇప్పటికీ భవనాలు లేవని,అసలు గర్ల్స్ ఎస్సీ ఎస్ఎంఎస్ హాస్టల్‌ను ఇప్పటివరకు ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు అతీగతి లేదని అన్నారు. ఇలా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసుకుంటూ పోతే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గ్రంథాలయం నిర్మించుకోవడానికి అనేక ప్రభుత్వ స్థలాలు, కాళీ భవనాలు పెద్దపల్లిలో ఉన్నాయని, వాటన్నింటినీ పక్కనపెట్టి ఉన్న గర్ల్స్ జూనియర్ కాలేజీని కులగొట్టి, అక్కడ గ్రంథాల యాన్ని నిర్మిస్తామంటే ఒప్పుకునేది లేదని దీనికి వ్యతి రేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జిల్లా అధికార యంత్రాంగం తమ తప్పుడు పద్ధతిని మానుకొని గర్ల్స్ జూనియర్ కాలేజీని కొత్త భవనంగా నిర్మించాలని గ్రంథాల యాన్ని వేరే దగ్గర నిర్మించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ సమస్య మీద జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిపి ప్రజా ఉద్యమాన్ని లేవదీస్తామని హెచ్చరించారు.ఈ సమా వేశంలో జిల్లా కమిటీ సభ్యులు జి, జ్యోతి. కళ్ళేపల్లి అశోక్, నాయకులు సిపెల్లి దిలీప్, నవీన్, శ్రీనివాస్, సురేష్,లక్ష్మణ్, స్వామి పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికల షెడ్యూల్ వాయిదా

- **ఈనెల 27న మళ్లీ సమావేశం**
- **14 సంఘాల సంప్రదింపులు**

నవతెలంగాణ-సింగరేణి ప్రతినిధి

సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల నిర్వహణపై శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సి కార్యాలయంలో జరిగిన త్రైపాక్షిక చర్చలు ఈనెల 27 కు మళ్లీ వాయిదా పడ్డాయి. సింగరేణి గుర్తింపు యూనియన్ కాలపరిమితి ముగిసినందున నిర్వహించ తలపెట్టిన ఎన్నికల ప్రక్రియ నత్తనడక నడుస్తోంది. ఎన్నికల నిర్వహణపై జరుగుతున్న జాప్యాన్ని నివారించి తక్షణమే ఎన్నికలను నిర్వహించాలని యజమాన్యాన్ని ఆదేశించాలని కోర్టుకు వెళ్లింది. కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియను కార్మిక శాఖ అధికారులు ప్రారంభించారు.అయితే త్వరలో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నేపథ్యంలో యాజమాన్యం ఎన్నికల నిర్వహణపై తర్జనభజన పడుతోంది. ఇప్పటికే కోర్టు నుంచి ఎన్నికల వాయిదాకు గతంలో అనుమతి పొందింది. తిరిగి మళ్లీ వాయిదాని కోరుతూ ఇటీవల మళ్ళీ కోర్టుకు వెళ్ళింది. ఇరువర్గాలు వాదన విన్న కోర్టు తన తీర్పును రిజర్వులో పెట్టింది. కోర్టు నిర్ణయం మేరకు నడుచుకుంటామని సమావేశంలో యాజమాన్యం పేర్కొంది. కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు యూనియన్ ఎన్నికలు జరిగే వరకు అన్ని రిజిస్టర్ సంఘాలకు కార్మిక సమస్యలపై యాజమాన్యంతో సంప్రదింపులకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని చేసిన విజ్ఞప్తికి యాజమాన్యం ఒప్పుకుంది. తదనుగుణంగా తక్షణమే సింగరేణిలోని 11 డివిజన్లకు సర్క్యులర్‌ను జారీ చేసింది. గుర్తింపు యూనియన్ హోదాను టీబీజీకేఎస్ కోల్పోయినట్లేనని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. ఈనెల 27న జరిగే సమావేశంలో ఎన్నికల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఈ సమావేశంలో కార్మికశాఖ అధికారులు, సింగరేణి యాజమాన్యం, 14 రిజిస్టర్డ్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని ఏఐటియుసి, బిఎంఎస్ సంఘాలు వాదించాయి. మిగతా 12 కార్మిక సంఘాలు ఎన్నికల నిర్వహించే వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం హోదా కల్పించాలని చేసిన విజ్ఞప్తిని యాజమాన్యం అంగీకరించింది. శుక్రవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలన్న కార్మిక సంఘాల వాదనపై వెనక్కి తగ్గారు. దీంతో యాజమాన్యం పని సులువుగా మారింది. ఎన్నికల నిర్వహణ యాజ మాన్యం వెసులుబాటు, ప్రభుత్వ నిర్ణయాన్ని అను సరించి జరుగుతుంది.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కార్యాచరణ అమలు చేయాలి

- **పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

నవతెలంగాణ- పెద్దపల్లి



మాట్లాడుతున్న కలెక్టర్ , అదనపు కలెక్టర్లు

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు జే.అరుణశ్రీ , శ్యాం ప్రసాద్ లాల్‌లతో కలిసి ప్రజావాణి దరఖాస్తులు, ధరణి, గృహలక్ష్మి, ఓటరు జాబితా సవరణ, మీ సేవా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈనెల25 లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వసతులు ఏర్పాటు చేయాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, టాయిలెట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన ఏర్పాటు చేయాలని, ఈనెల చివరి నాటికి ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 58 సంబంధించి అర్హులందరికీ పట్టాల పంపిణీ పూర్తి కావాలన్నారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించి లబ్దిదారులను స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో త్వరితగతిన ఎంపిక చేసి, రెండు వారాల్లో ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు మధు మోహన్, హనుమానాయక్, కలెక్టరెట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ విభాగం సూపరింటెంట్ పుష్పలత, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆదాయం పన్ను 30 నుంచి 33 శాతం రికవరీ చేయడం సరికాదు

నవతెలంగాణ-ఫైటింక్లయిన్ కాలనీ:



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డుకు సంబంధించి 23 నెలల ఏరియర్స్ చెల్లింపులో ఆదాయం పన్ను 30 నుంచి 33 శాతం కార్మికుల వద్ద రికవరీ చేయడం సరికాదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ ఇన్‌చార్జి కె.రాజరత్నం, బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం 8వ కాలనీ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో కార్మికులకు ఏరియర్స్ ఒకేసారి చెల్లింపు సంతోషమైన విషయం అన్నారు. కానీ దాదాపు 23 నెలల బకాయిలు ఒకే ఆర్థిక సంవత్సరంగా పరిగణించడం, వేతనాలు పెరిగినా , ఇన్కమ్ టాక్స్ స్లాబ్ రేట్లు పెరగకపోవడం 20 శాతం ఉన్నవారికి కూడా అధికంగా కోత విధించడం తదితర విషయాలతో కార్మిక వర్గంలో సందేహాలు రేకెత్తినాయన్నారు. యాజమాన్యం నెలవారీగా వివరాలు అందించే వర్క్ షీట్ వెంటనే అందరికీ అందజేయాలని, కార్మికుల అనుమానాలు నివత్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్ ప్రకాష్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బి. అన్నారావు, కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బుర్ర తిరుపతి, ఆవుల రవికుమార్, బొంత రాజు, అనవేన నరసయ్య, ఎం.సంపత్‌రెడ్డి, వి. గట్టయ్య పోగుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బయటి లారీల ద్వారా బూడిదను రవాణా చేస్తే అడ్డుకొని తీరుతాం

- **శ్రీరామ లారీ యాష్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్**

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న శ్రీరామ లారీ యాష్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బయటి లారీల ద్వారా బూడిదను రవాణా చేస్తే అడ్డుకొని తీరుతామని శ్రీరామ లారీ యాష్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపంగి శ్రీనివాస్, కస్తూరి సుమన్ అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్టీపీసీ నుంచి వివిధ ప్రాంతాలకు బూడిద రవాణా చేస్తున్నామని, 15 రోజుల నుంచి ఇద్దరు కాంట్రాక్టర్లు తమకు టెండర్ వచ్చిందని బూడిదను రవాణా చేయనీయడం లేదని ఆరోపించారు. సొంత లారీల ద్వారా బూడిదలను రవాణా చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. నిత్యం 400 ట్రిప్పుల వరకు బూడిద రవాణా అవుతుందని ,స్థానిక లారీలు, టిప్పర్లను కాదని బయటి లారీల ద్వారా బూడిద రవాణా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై స్థానిక అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుండు రాజు, నాయకులు శివరాత్రి గంగాధర్, వడ్లకొండ సతీష్ ,జే. కొమురయ్య, ఆకుల సాయికుమార్, సంపంగి వెంకట్, బడికల శ్యామ్, గంగాధర్ శ్రావణ్ పాల్గొన్నారు.

మైనార్టీ బంధు జనరల్ స్టోర్ ప్రారంభం

నవతెలంగాణ- పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని ఐత్ పల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షబ్బీర్ ఇటీవల ప్రభుత్వం నుంచి మంజూరైన మైనారిటీబంధు సహాయం లక్ష రూపాయలతో జనరల్ స్టోర్ ఏర్పాటు చేశాడు. ఈ జనరల్ స్టోరీ ను శుక్రవారం టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సింగిల్ విండో చైర్మన్ ఓరుగంటి రమణ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, సర్పంచ్ జిట్టబోయిన కొండయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గోలి సురేందర్ రెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు లోక మల్లారెడ్డి, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రావు, కోఆప్షన్ సభ్యులు రహీం,ఉపసర్పంచ్ లచ్చయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కర్ర భాస్కర్ రెడ్డి, మాజి జడ్పీటీసీ సభ్యుడు తోట మోహన్ రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, నాయకులు సంజీవ్ రెడ్డి, విజయ్ యాదవ్, జేరిపోతుల శ్రీనివాస్, తడగొండ సాగర్, మడిగెల తిరుపతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హరిపురంలో మెగా హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-ముత్తారం

ముత్తారం మండలం హరిపురం గ్రామంలో సర్పంచ్ సంపత్‌రావు అధ్యక్షతన, మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్‌రావు, హోమియో వైద్యాధికారిని డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. 98 మందికి వైద్య పరీక్షలు చేసి, జలుబు, దగ్గు, జ్వరంతో బాధ పడుతున్న వారిని గుర్తించారు. కొందరి నుంచి రక్త నమూనాలను సేకరించి, పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అమరేందర్ రావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉంటే తొలగించాలని సూచించారు. సర్పంచ్ సంపత్ రావుతో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు దీప్తి, హెచ్ఇవో నర్సింహారెడ్డి, పిహెచ్ఎన్ లలిత, సూపర్‌వైజర్ వీరేష్, పశుల శ్రీనివాస్, ఎఎన్ఎంలు రమ, కళావతి, ఆశాలు రాజేశ్వరీ, రజిత, శశి పాల్గొన్నారు.

భోగ శ్రావణికి మున్సిపల్ చైర్ పర్సన్ హోదా బీఆర్ఎస్ పెట్టిన భిక్ష

- **బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆడువాలా జ్యోతి లక్ష్మణ్**

నవతెలంగాణ-జగిత్యాల



మాట్లాడుతున్న కౌన్సిలర్

భోగ శ్రావణిని మున్సిపల్ చైర్ పర్సన్ చేసింది బీఆర్ఎస్ పార్టీ అని, ఆమె తన స్థాయిని మరిచి ఎమ్మెల్సీ కవితను విమర్శిస్తే సహించేది లేదని కౌన్సిలర్ అడవుల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. భోగ శ్రావణికి రాజకీయ భవిష్యత్, రాజకీయ ఓనమాలు నేర్పింది బీఆర్ఎస్ అని గుర్తు పెట్టుకోవాలన్నారు. తండ్రి లాంటి వాడు అని ఎమ్మెల్యేను పొడిగిన శ్రావణి, ఇప్పుడు ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. శ్రావణి ముందు సంస్కారం నేర్చుకొని రాజకీయాలు చేయాలని హితవు పలికారు. తాను చేసిన అవినీతి, స్కామ్‌లు ఎక్కడ బయటకు వస్తాయనో ముందే గ్రహించి పదవికి రాజీనామా చేసి పార్టీ నుంచి బయటికి వెళ్లిపోయిందని ఆరోపించారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

నవతెలంగాణ -మెట్‌పల్లి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో వ్యవసాయ అధికారులు ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ పంట వల్ల అధిక ఆదాయంతో పాటు శ్రమ తక్కువగా ఉంటుందని, పంట సాగుచేస్తే ఎస్‌సి, ఎస్‌టి రైతులకు వందశాతం, ఇతర రైతులకు 90శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు ఎకరాకు 57 మొక్కలు నాటుకోవాలని, ఎకరాకు 10వేలు సబ్సిడీతో పాటు నాలుగు సంవత్సరాలు అంతరపంటలు వేసుకోవడానికి ప్రతి సంవత్సరం రూ.4200 ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో మండలం వ్యవసాయ అధికారి షాహిద్ అలీ, గ్రామ వ్యవసాయ అధికారి భూమేష్, సర్పంచ్ సుగుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో వీవోఏ మృతి

నవతెలంగాణ-ఓదెల



డెంగీతో వీవోఏ మృతి చెందింది. ఈ ఘటన ఓదెల మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రంలోని ఐకెపిలో పని చేస్తున్న గ్రామ సంఘం సహాయకురాలు ఈర్ల రాజకుమారి (38) డెంగీ బారిన పడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త కొన్నేండ్ల క్రితం మృతి చెందింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజకుమారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండలంలోని విఓఏ లు, ఏపిఎం లతమంగేశ్వరి, సిసిలు శ్రీనివాస్, మల్లయ్య, కొమురయ్య, విజయ, భవాని, పవన్ కుమార్ మృతురాలి కుటుంబానికి సంతాపం తెలిపారు.

వేస్ట్ టు వండర్ పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న మేయర్, కమిషనర్

నవతెలంగాణ-గోదావరిఖని:

చెత్త నుంచి అద్భుతాలు (వేస్ట్ టు వండర్) సృష్టించే పోటీలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని రామగుండం నగర పాలక సంస్థ మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వేస్ట్ టు వండర్ పోస్టర్ ను శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. ఈ నెల 29న రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రదర్శ నకు ఉంచాలని తెలిపారు. ప్రదర్శనలో ఉంచిన వస్తువులలో ఉత్తమ మైన వాటిని ఎంపిక చేసి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పేర్ల నమోదు కోసం ఫోన్ నెం . 94944 58748 , 9000 946 169 లలో సంప్రదించాలని తెలిపారు.

బాలికల జూనియర్ కాలేజీని తొలగించొద్దు

- **రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జెడి)కు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి**



వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కాలేజీని ఎట్టి పరిస్థితుల్లో అక్కడి నుంచి తొలగించొద్దని, ఆ స్థానంలో గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణం చేయొద్దని ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గ్రంథాలయ నిర్మాణానికి పర్మిషన్ ఇవొద్దని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆర్జెడి రీజినల్ జాయింట్ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాల జోలికి వస్తే సహించేది లేదని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఇస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు అశోక్ రెడ్డి, రమేష్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, జిల్లా అధ్యక్షుడు జిల్లాల ప్రశాంత్, ప్రవళిక, శ్రావ్య, పవిత్ర,తదితరులు పాల్గొన్నారు

12వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మె

నవతెలంగాణ -పెగడపల్లి:

అంగన్ వాడీ ఉద్యోగులను క్రమబద్ధకరించి సమస్యలు పరిష్కరించాలని. పెగడపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు 12వ రోజు కొనసాగుతున్న అంగన్ వాడీ టీచర్ల సమ్మెలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్ వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు జయప్రద, సత్యమ్మ, మనెమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల గోస ప్రభుత్వానికి వినిపించడం లేదా..

నవతెలంగాణ - కరీంనగర్



తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో భాగంగా 12వ రోజు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష కొనసాగింది. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ ఎల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు ఏ.రజిత, డి.రజిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 12 రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లు సమ్మె చేస్తుంటే అంగన్వాడీల గోస ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందని, మా బాధలు ప్రభుత్వానికి కనిపించడం లేదా వినిపించడం లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీలను చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగానే స్థానిక మంత్రి గంగుల కమలాకర్ కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశానికి వచ్చే క్రమంలో అంగన్వాడీలు, టీచర్లు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని నివారించడం మంత్రితో మాట్లాడారు. మంత్రి అంగన్వాడీ సమస్యలు చెప్పుతుంటే వినివిననట్లు వ్యవహరిస్తూ ముఖ్యమంత్రి అన్ని చూసుకుంటాడని వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేరు.

వినాయక మండపాలకు మంత్రి గంగుల సాయం

సొంతంగా విద్యుత్ బిల్లులు చెల్లింపు..

నవతెలంగాణ - కరీంనగర్



చెక్కు అందిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ నియోజకవర్గంలోని వినాయక మండపాలకు అవసరమైన కరెంట్ కోసం మంత్రి గంగుల కమలాకర్ తన సొంత నిధులు రూ.4లక్షల చెక్కును ఎలక్ట్రిసిటీ అధికారులకు అందజేసారు. శుక్రవారం మంత్రి కలెక్టర్ కార్యాలయంలో వినాయక మండపాలకు విద్యుత్ సౌకర్యం కల్పించే విషయంలో ఎలక్ట్రిసిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతియేటా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు విద్యుత్ బిల్లులు తానే చెల్లిస్తున్నానని మంత్రి గంగుల కమలాకర్ గుర్తు చేశారు. వినాయక మండప నిర్వాహకులను కరెంటు బిల్ పేరుతో ఇబ్బందులకు గురి చేయద్దని, వినాయక మంటప నిర్వాహకులు విద్యుత్ అధికారులకు సహకరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ బి.గోపి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ, కొత్తపల్లి మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఎస్ఈ గంగాధర్, డీఈ రాజం, టౌన్ ఏడీఈలు నరేందర్, సుధీర్, రూరల్ ఏడీఈ రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా

నవతెలంగాణ-కరీంనగర్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా మాదిగ జాతికి నమ్మకద్రోహం చేస్తున్న బీజేపీని రాజకీయంగా బొంద పెడతామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ మహాధర్నాను నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, దర్శనం శంకర్, తుంగ ఆంజనేయులు, కనకం అంజిబాబు, నెరేళ్ల సౌమ్యా, నాయకులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ - కరీంనగర్



వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల కేంద్ర కార్యాలయంలో శ్రీవిఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ మహాలక్ష్మీ హెూమం, కుంకుమ పూజలు చేశారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు. పూజానంతరం అన్నదానం చేశారు.

మన్నెంపెల్లి గ్రామంలో డ్రైడే

నవతెలంగాణ - తిమ్మాపూర్



కుండీలలో నీళ్లు పారబోస్తున్న ఉపసర్పంచ్

ఫ్రైడే డ్రైడే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మన్నెంపల్లి గ్రామంలోని శుక్రవారం ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్, పంచాయతీ సెక్రటరీ దేవరకొండ శ్రీనివాస్ వాడవాడలా తిరుగుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కుండలలో, టైర్లలో నీరు నిలువ చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నార్ల అశోక్, పారునంది సంపత్, నాయకులు గుర్రం జగదీశ్, అక్కపెల్లి కొమురయ్య, అశోధ అంజయ్య, కమెర సంపత్, సానగొండ అయిలయ్య, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

పీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ - రామడుగు

మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పీఎం నరేంద్రమోడీ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. పీఎం విశ్వబ్రాహ్మణ యోజన పథకాన్ని అమలు చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకుడు జిట్టవేణి అంజిబాబు, సంఘం నాయకుడు కనపర్తి కుమారస్వామి, భాస్కరాచారి, మునిగంటి శ్రీనివాసచారి, గాలిపల్లి రాజు, భరత్‌చారి, శేఖర్, అక్కపెల్లి తిరుపతాచారి, శ్రీరామోజు కిషన్, రవీంద్రచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్‌గా మనోహర్

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలానికి చెందిన ఆకుల మనోహర్‌ను బీజేపీ సోషల్ మీడియా కరీంనగర్ జిల్లా కో కన్వీనర్‌గా నియామకం చేస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నియామక పత్రం అందించారు. తన నియామకానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాది మృతదేహం లభ్యం

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

కరీంనగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ద్యావనపల్లి వేణుగోపాల్‌రావు బుధవారం సాయంత్రం అదృశ్యం కాగా శుక్రవారం సాయంత్రం మానకొండూర్ మండలం ముంజంపల్లి వద్ద కాకతీయ కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. వివరాలలోకి వెళితే.. బుధవారం సాయంత్రం కరీంనగర్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ద్యావనపల్లి వేణుగోపాల్‌రావు ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్ అల్గునూర్ సమీపంలోని కాకతీయ కెనాల్ పక్కన ఉన్నాయి. కెనాల్ పక్క నుంచి వెళ్తున్న ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం సెల్‌ఫోన్ మోగుతుండటంతో లిఫ్ట్ చేసి అవతలి వారికి విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు, న్యాయవాదులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించి ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. అదే రోజు రాత్రి న్యాయవాది భార్య కరీంనగర్ రెండో ఠాణాలో భర్త వేణుగోపాల్‌రావు కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం కెనాల్ నీటిని తగ్గించి రెస్క్యూ టీమ్ ద్వారా వెతికారు. శుక్రవారం ముంజంపల్లి వద్ద శవం లభ్యమైంది. వేణుగోపాల్ రావు కాల్ డేటాను సేకరిస్తున్నారు. కాగా వేణుగోపాల్‌రావు మృతిపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, అదనపు ప్రభుత్వ న్యాయవాది పూరెల్ల రాములు, న్యాయవాదులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

యువకుడి ఆత్మహత్య..

నవతెలంగాణ - శంకరపట్నం



మండలంలోని అంబాలపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శంకరపట్నం మండలం అంబాలపూర్ గ్రామానికి చెందిన రావనవేణి సమ్మయ్య మొదటి భార్య, సంతానం ఉండగా 18 సంవత్సరాల క్రితం మరో మహిళను వివాహం చేసుకుని వేరుగా కాపురం పెట్టారు. దీంతో మొదటి భార్య కొడుకు హరీష్‌తో నిత్యం ఇంట్లో గొడవలు జరిగేవి. మంగళవారం ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన హరీష్(28) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్యం కోసం ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతు పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శాంతియుతంగా పండుగలను నిర్వహించుకోవాలి

మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

జిల్లాలో గణేష్ నిమజ్జనం, మిలాదున్ నబి పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో గణేష్ నిమజ్జనం, మిలాదున్ నబి పండుగల ఏర్పాట్లపై పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న నిర్వహించనున్న గణేష్ నిమజ్జనాన్ని, 29న మిలాదున్ నబి పండుగలను విజయవంతం చేయడంలో సమిష్టిగా కృషిచేయాలని కోరారు. గతంలో జిల్లాలో డెంగ్యూ జ్వరాలతో అతలాకుతలమై, తాగునీటి కోసం కొట్లాడే స్థితులుండే కరీంనగర్ జిల్లా హైదరాబాద్ తర్వాత అభివృద్ధి చెందిన నగరంగా ప్రగతి స్థానంలో నిలిచిందన్నారు. వినాయక నిమజ్జనం రోజు అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని, మెడికల్ క్యాంపుల ఏర్పాటు, సానిటేషన్ పనుల నిర్వహణ తదితర పనులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ డాక్టర్ బి.గోపి మాట్లాడుతూ.. నిమజ్జనానికి వచ్చే విగ్రహల ప్రకారం పర్యవేక్షించడానికి నోడల్ అధికారులను కూడా నియమించినట్టు తెలిపారు. 29న మిలాదున్ నబీ పండుగకు ప్రభుత్వ పరంగా సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీ సుబ్బారాయుడు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ పొన్న అనీల్, ఎంపీపీలు శ్రీలత, లక్ష్మయ్య ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ స్కిల్ ఎక్స్‌పో-2023లో పారమిత పాఠశాల ప్రాజెక్ట్ ప్రదర్శన

నవతెలంగాణ - కరీంనగర్



విద్యార్థిని అభినందిస్తున్న పారమిత విద్యాసంస్థల చైర్మెన్

సీబీఎస్సీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) నేషనల్ సమ్మిట్ సందర్భంగా నిర్వహించిన నేషనల్ స్కిల్ ఎక్స్‌పోలో నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు శుభశ్రీ సాహు 10వ తరగతి, శ్రీయాస్ జె 9వ తరగతి ప్రాజెక్ట్ 'అగ్రికల్చరల్ ఎకో ఫ్రెండ్లీ అగ్రో మెషిన్'ను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ 19 నుంచి 20 సెప్టెంబర్ 2023 వరకు అగ్రికల్చరల్ సైన్స్ కాంప్లెక్స్, న్యూఢిల్లీలో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 51 అత్యుత్తమ ప్రదర్శనలు ఈ ప్రదర్శనకు ఆహ్వానించబడగా తెలంగాణ నుంచి ఈ ప్రదర్శనకు ఎంపికైన ఏకైక ప్రాజెక్ట్ పారమిత పాఠశాలకు చెందినది కావడం గమనార్హం. ఈ సందర్భంగా నేషనల్ స్కిల్ ఎక్స్‌పోలో ప్రాజెక్ట్‌ను ప్రదర్శించి అందరి మన్ననలను పొందిన శుభశ్రీ, శ్రీయాస్‌ను, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహును పారమిత విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, వీయూఎం ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాచనపల్లిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం

నవతెలంగాణ - జమ్మికుంట



మండలంలోని మాచనపల్లి గ్రామంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొజ్జం కల్పనాతిరుపతిరెడ్డి మాట్లాడారు. ఇంటిలో శుభ్రతపై అవార్డు ఇచ్చే క్రమంలో గ్రామానికి చెందిన గుర్రపు లక్ష్మిబుచ్చిరెడ్డి ఇంటిని సెలెక్ట్ చేసినట్టు చెప్పారు. గుర్రపు లక్ష్మిబుచ్చిరెడ్డిని గ్రామ సర్పంచ్ బొజ్జం కల్పనాతిరుపతిరెడ్డి, ఎంపీటీసీ పొలసాని రాజేశ్వరరావు, కార్యదర్శి శివరంజని, ఏఎన్ఎం సావిత్రి, ఆశ వర్కర్స్ రమ, కవిత, అంగన్వాడీ రమ, మహిళా సంఘం సీఏ లలిత ఆధ్వర్యంలో శాలువతో సన్మానించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ - గంగాధర : కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. గంగాధర మండలం న్యాలకొండపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన, పోషకారం వల్ల చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలో, ఐరన్ లోపం వల్ల కలిగే దుష్పరిణాలను వివరించారు. కార్యక్రమంలో కసూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ పూర్ణిమగౌతమి, ఆయుర్వేదిక్ డాక్టర్ శ్రీవిద్య, ఆయుర్వేదిక్ ఫార్మసిస్టు ప్రేమలత, నాచురోపతి డాక్టర్ రజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. గంగాధర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యురాలు ప్రియాంక గ్రామస్తులకు బీపీ, షుగర్‌తోపాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ జోగు సాగర్, సూపర్‌వైజర్ జాకీర్, ఏఎన్ఎం కరుణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కవ్వంపల్లి పరామర్శ

నవతెలంగాణ - శంకరపట్నం : మండలంలో ఇటీవల పలువురు మృతిచెందగా ఆయా కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పరామర్శించారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బస్వాగౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాజిరెడ్డి, మొలంగూరి సదానందం, జనగామ శ్రీనివాస్‌గౌడ్, బండారి తిరుపతి, మహేందర్, రాజు, గంగయ్య, సుభాష్ ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

రామడుగు ఎస్ఐ తోట తిరుపతి



నవతెలంగాణ - రామడుగు

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రామడుగు ఎస్ఐ తోట తిరుపతి సూచించారు. మండల పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీల నాయకులు, మండపాల నిర్వాహకులు, సభ్యులకు శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిమజ్జనోత్సవాలకు చిన్న పిల్లలను వెంట తీసుకుపోవద్దని సూచించారు. అనుమతి లేకుండా మండపాల్లో, నిమజ్జనం రోజున డీజేలు ఉపయోగించొద్దన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లకు, ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

నవతెలంగాణ - రామడుగు



మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో పోషణ మహోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, మహిళలకు పౌష్టికాహారం, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సంపూర్ణ ఆహారం, గవర్నమెంట్ హాస్పిటల్లో నార్మల్ ప్రసవాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్కశెట్టి నర్సయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, ఐసీపీయస్ సోషల్ వర్కర్ కవిత, అంగన్వాడీ టీచర్లు తస్లీమా, కమల పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఇంగ్లీష్ నోట్స్ ఆవిష్కరణ



నవతెలంగాణ - కరీంనగర్ : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ఐదో సెమిస్టర్ విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టుకు సంబంధించి కళాశాల ఆంగ్ల ఉపన్యాసకుడు ధనపురి సాగర్ తయారు చేసిన నోట్స్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. శాతవాహన విశ్వ విద్యాలయ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ నోట్స్‌ను ఉచితంగా పొందుటకు 8885549467 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కోరితే వారికి నోట్స్‌ను అందజేస్తామన్నారు. ఆంగ్లధ్యాపకుడిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, ఏసీఓ బి.సంపత్ కుమార్, ఏవో బి.శ్రవణ్ కుమార్, బి.రామేశ్వర్ రావు, డాక్టర్ ఎండీ అలీ ఖాన్, డాక్టర్ ఆర్.గోపికృష్ణ, సిహెచ్ మోహన్ ప్రసాద్, సౌజన్య అభినందించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల్లో నయా జోష్

- చొప్పదండి నియోజకవర్గంలో ముమ్మరమైన చేరికలు
- పల్లెలను చుడుతున్న నేతలు.. కొత్త పంథాలో ప్రచారం

నవతెలంగాణ-గంగాధర



చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు రోజుకో కొత్త కార్యక్రమాన్ని చేపడుతూ పార్టీ శ్రేణుల్లో జోష్‌ను పెంచుతున్నారు. అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడుతుందనే సంకేతాలను దృష్టిలో పెట్టుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కాంగ్రెస్ పార్టీ టికెట్టు తనకే ఖరారు అవుతుందన్న ధీమాలో ఉన్న మేడిపల్లి సత్యం రోజుకో కొత్త పంథాను అనుసరిస్తూ ఓ వైపు ప్రజలు, మరో వైపు పార్టీ శ్రేణులకు చేరువయ్యేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికే పల్లె పల్లెలోని ప్రజలను, పార్టీ శ్రేణులను కలువాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఈ నేతల తీరు చొప్పదండి నియోజక వర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో చొప్పదండి గడ్డపై రెండు సార్లు రెపరెపలాడుతున్న గులాబీ జెండాను మరోసారి ఎగిరేలా చేస్తూ అధికారాన్ని చేజిక్కించుకోవాలనే సంకల్పంతో ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొత్త ఒరవడిని అనుసరిస్తూ ముందుకు సాగుతున్నారు.





చొప్పదండి సెగ్మెంట్ నుండి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిని చవిచూసిన మేడిపల్లి సత్యం ప్రజా సమస్యలతో ముందుకు సాగుతూ ప్రజల మధ్యనుంటూ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. ఇరువురు నేతలు పోటా పోటీ ప్రచార పర్వానికి దిగారని జనం మధ్య చర్చ కొనసాగుతోంది.

ముమ్మరమైన చేరికలు.. వేగం పెంచిన నేతలు

చొప్పదండి నియోజక వర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరికల కార్యక్రమాలు ముమ్మరం అయ్యాయి. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ఆయా పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలను చేర్చుకోవడానికి ప్రత్యేక షెడ్యూల్‌ను ఖరారు చేస్తూ వేగం పెంచారు. ఇదే విధానాన్ని మేడిపల్లి సత్యం అనుసరిస్తూ తనదైన తీరులో ముందుకు సాగుతున్నారు. బుధవారం కొడిమ్యాల మండలంలోని వివిధ పార్టీలకు చెందిన జంపు జిలానీలు సై అని సైరన్ ఇవ్వగానే రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అక్కడికి చేరుకుని చాలా మందినే బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. చేరికలకే పరిమితం కాకుండా బైక్ ర్యాలీలు, సమావేశంలో హుశారెత్తించే ప్రసంగాలు చేసి బీఆర్ఎస్ శ్రేణుల్లో నయా జోష్ పెంచారు. అయితే మేడిపల్లి సత్యం తానేమి తక్కువ కాదనే సంకేతాలిస్తూ గంగాధర మండలం కొండన్నపల్లి, న్యాలకొండపల్లి గ్రామాల్లో గడపగడపకు మేడిపల్లి పేరిట గ్రామాల్లో తిరిగి వివిధ పార్టీలకు చెందిన చాలా మందినే కాంగ్రెస్ గూటిలో చేర్చుకున్నారు.

పల్లెబాటపై జనం నజర్

ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం చేపడుతున్న పల్లెబాటపై జనం నజర్ పడింది. అధికారంతో సుంకె, పోరు బాటతో మేడిపల్లి రోజుకో కొత్త ఎత్తుగడను అనుసరిస్తూ పల్లెలను తిరుగుతున్న తీరుపై గ్రామాల్లో చర్చ కొనసాగుతోంది. సుంకె, మేడిపల్లి చేస్తున్న హడావిడితో గ్రామాల్లో ఏ ఇద్దరు కలిసిన వచ్చే ఎన్నికల్లో ఎవరైతే బాగుంటుందనే చర్చ మొదలైంది. నువ్వా..నేనా..అనే తీరులో ముందుకు సాగుతున్న ఇద్దరు నేతల్లో జనం ఎవరి వైపు మొగ్గు చూపుతారో మనం వేచి చూడాల్సిందే.



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

జమ్మికుంటలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ



నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని జేఏసీ నాయకులు అన్నారు. గురువారం మున్సిపల్ కార్మికులు స్థానిక గాంధీ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు పది నుంచి 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పర్మినెంట్ చేయాలని అన్నారు. నల్ల బ్యాడ్జీలతో తమ విధులను నిర్వర్తిస్తూ, శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దొడ్డ రాజేందర్, దూడపాక స్వామి, కామెడీ సదాశివరెడ్డి, వడ్లూరి సరోజన, గుల్లి సరోజన, దొడ్డ రత్నాకర్, జక్కే కరుణాకర్, తోడి ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో సీపీ తనిఖీ



క్రీడా సామగ్రి అందిస్తున్న పోలీస్ కమిషనర్

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం/గన్నేరువరం

గన్నేరువరం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు తనిఖీ చేసారు. తొలుత గన్నేరువరం ఎస్‌హెచ్ఓ నర్సింహరావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి రికార్డుల నిర్వహణ, అమలవుతున్న ఫంక్షనల్ వర్టికల్ పనితీర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా పోలీస్ అధికారులు చాలా అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వహించాలని సూచించారు. స్థానిక యువతకు పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా క్రికెట్ కిట్‌లు, ఇతర క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు నర్సింహారావు, ప్రమోద్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

రాజమల్లు సేవలు మరువలేనివి

నవతెలంగాణ - వీణవంక



పీఏసీఎస్‌లో సిబ్బందిగా పనిచేసిన రాజమల్లు సేవలు మరువలేనివని చైర్మన్ మావరుపు విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. సొసైటీలో పనిచేస్తున్న మ్యాకల రాజమల్లు ఇటీవల రిటైర్డ్ అయ్యారు. ఆయనకు శుక్రవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ పాలకవర్గం, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు రాజమల్లుయాదమ్మ దంపతులను పూలమాలతో సన్మానించి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో చందుపట్ల ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, రెడ్డిపల్లి ఎంపీటీసీ ఒడ్డెపల్లి లక్ష్మీభూమయ్య, సర్పంచులు పోతుల నర్సయ్య, బండారి ముత్తయ్య, గంగాడి సౌజన్యతిరుపతిరెడ్డి, మర్రి లక్ష్మీస్వామియాదవ్, పాలక వర్గ సభ్యులు చెకబండి శ్రీనివాస్‌రెడ్డి, గూటం సమ్మిరెడ్డి, రాములు, గెల్లు మల్లయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, తిరుమల్ నాయకులు చింతల శ్యాంసుందర్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మహోత్సవం

నవతెలంగాణ - ఇల్లందకుంట



ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాజుల రమాదేవి మాట్లాడుతూ చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు కె.రాములు, దబ్బెడ రవీందర్, అంగన్వాడీ టీచర్లు జి.లీల, జీ.సుజాత పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

నవతెలంగాణ - చొప్పదండి



మహిళలకు చట్ట సభలలో 33శాతం రిజర్వేషన్‌కు పార్లమెంటులో ఆమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయం అని చొప్పదండి పట్టణ 8వ వార్డు కౌన్సిలర్ రాజన్నల ప్రణీతరాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ యావత్ భారతదేశ మహిళల తరఫున మోడీ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సొంత పార్టీలో ఏ ఒక్క కమిటీలో మహిళలకు స్థానం ఇవ్వని బీఆర్ఎస్ పార్టీ అసలు రంగు, ఎమ్మెల్సీ కవిత కథ ఇప్పుడు ఉభయ సభల్లో బిల్లుకు మద్దతు ఇచ్చేటపుడు బయటపడుతుందని అన్నారు.

ఇదేం పని బాసూ...?!

గోధుమల మార్కెట్ ధర ఎంఎస్‌పీ స్థాయికి తగ్గింపు

- వికటించిన కేంద్రం చర్యలు
- అన్నదాతకు 40 వేల కోట్ల నష్టం
- ఇతర పంటలకూ తప్పని ముప్పు



న్యూఢిల్లీ : ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేరుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు వికటించాయి. దీని ఫలితంగా దేశంలోని రైతన్నలు రూ.40 వేల కోట్ల మేర నష్టపోయారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలపై భారత పరిశోధనా మండలి ఈ నెల 14న విడుదల చేసిన నివేదిక ప్రకారం గోధుమలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం రైతులను నష్టాలపాలు చేసింది.

ఈ సంవత్సరం ఫిబ్రవరిలో గోధుమ ధరలలో ద్రవ్యోల్బణ రేటు 25.4%గా నమోదైంది. కనీస మద్దతు ధర కంటే మార్కెట్ ధర అధికంగా ఉండడంతో ప్రభుత్వంలో ఆందోళన వ్యక్తమైంది. ఎందుకంటే మార్కెట్ ధర ఇలాగే కొనసాగితే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసేందుకు అవసరమైన గోధుమలను ప్రభుత్వం సేకరించడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో మార్కెట్ ధరను కనీస మద్దతు ధర స్థాయికి తగ్గించేందుకు ప్రభుత్వం తన వద్ద ఉన్న 3.4 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలను పంట ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరకే తెగనమ్మింది. అంతేకాక ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు గోధుమ నిల్వలపై పరిమితులు విధించింది. గత పదిహేను సంవత్సరాలలో ప్రభుత్వం ఇలాంటి చర్యకు పూనుకోవడం ఇదే మొదటిసారి.

బహిరంగ మార్కెట్‌లో ధర తగ్గించి...

ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యల కారణంగా గోధుమ ధరల ద్రవ్యోల్బణం ఆగస్ట్ నాటికి 9.33%కి తగ్గినప్పటికీ రైతులపై పరోక్ష భారం పడింది. దీంతో అన్నదాతలు ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. రబీ పంటలకు సంబంధించిన 2023-24 మార్కెటింగ్ సీజన్‌లో క్వింటాలు గోధుమల కనీస మద్దతు ధరను రూ.2,125గా నిర్ణయించారు. అయితే జనవరిలో మార్కెట్ ధర క్వింటాలుకు రూ.2,673గా ఉంది. దేశీయ గోధుమ ధరలను స్థిరంగా ఉంచేందుకు ప్రభుత్వం ఫిబ్రవరిలో బహిరంగ మార్కెట్ అమ్మకపు పథకాన్ని (ఓఎంఎస్ఎస్) ప్రారంభించింది. ముందుగా క్వింటాలు ధరను రూ.2,350గా నిర్ణయించి, ఆ తర్వాత మరింత తగ్గించింది. ఎన్నడూ లేని విధంగా రూ.2,150కే అమ్మింది. ఈ ఓఎంఎస్ఎస్ ధర సాగు ఖర్చు కంటే చాలా తక్కువ. 2022-23లో క్వింటాలు గోధుమలను ఉత్పత్తి చేయడానికి సగటున రూ.2,654లు ఖర్చయ్యాయి. కేంద్రం జోక్యం చేసుకొని ఉండకపోతే రైతులు తమ గోధుమలను విక్రయించడం ద్వారా క్వింటాలుకు అదనంగా రూ.548 సంపాదించే వారు. అంటే మొత్తంమీద దేశంలోని గోధుమ రైతులు కేంద్ర ప్రభుత్వ అనాలోచిన నిర్ణయాల కారణంగా రూ.40 వేల కోట్లు నష్టపోయారు.

పట్టణ వినియోగదారుల కోసమే...

ఇక్కడ మరో విషయాన్ని కూడా గమనించాల్సి ఉంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ ధరలు పెరుగుతున్న సమయంలో అంటే 2021-22 ఆర్థిక సంవత్సరంలో మన దేశం 7.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గోధుమలను ఎగుమతి చేసింది. అంతర్జాతీయ ధరలతో పాటు దేశీయంగా కూడా గోధుమ ధరలు పెరిగినందున ప్రభుత్వం మరింత అధిక పరిమాణంలో గోధుమలను విక్రయించి ఉండాల్సిందని, తద్వారా రైతులు ప్రయోజనం పొంది ఉండేవారని నివేదిక తెలిపింది. దేశంలోని 80 కోట్ల మంది ప్రజలు పీఎం గరీబ్ కల్యాణ్ యోజన కింద ఉచితంగా గోధుమలు లేదా బియ్యం పొందుతుండగా మార్కెట్ విలువను తగ్గించడం ద్వారా ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలు కాపాడాలని చూస్తోందని ప్రశ్నించింది. రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి పట్టణాలలో నివసించే మధ్యతరగతి వినియోగదారులకు మేలు చేకూర్చడమే ప్రభుత్వ ఉద్దేశమని విమర్శించింది.

రైతులందరికీ పొంచివున్న ప్రమాదం

వరి వంటి ఇతర పంటలు పండించే రైతులు కూడా ఇలాంటి ప్రభుత్వ విధానాల కారణంగా నష్టాలు చవిచూస్తారని నివేదిక హెచ్చరించింది. గోధుమల మాదిరిగానే బియ్యం విషయంలో కూడా ప్రభుత్వం మార్కెట్ ధరను కనీస మద్దతు ధర స్థాయికి తగ్గించింది. దీనివల్ల రాబోయే ధాన్యం సేకరణ సీజన్‌లో వరి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. గోధుమ రైతులతో పోలిస్తే వరి పండించే అన్నదాతలకే మరింత ఎక్కువ నష్టం జరిగే ప్రమాదం ఉంది. పప్పు ధాన్యాలు, ఉల్లిగడ్డలు పండించే రైతులకు సైతం ఇలాంటి చేదు అనుభవాలే ఎదురవుతాయి.

అనాలోచిత నిర్ణయాలు

2022 సెప్టెంబర్‌లోనూ, తిరిగి ఈ సంవత్సరం జూలైలోనూ బియ్యం ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. దీంతో భారత వాణిజ్య భాగస్వామ్య దేశాలు ఇబ్బంది పడ్డాయి. ఎందుకంటే ఆయా దేశాలు మన ఎగుమతుల పైనే అధికంగా ఆధారపడ్డాయి. బియ్యంపై ఎగుమతి సుంకాన్ని విధించి, దానిని క్రమేపీ పెంచడానికి బదులు ప్రభుత్వం జూలైలో బాసుమతి యేతర బియ్యం ఎగుమతులను నిషేధించింది.

దీంతో ఆఫ్రికా దేశాలే కాకుండా అమెరికాలో నివసిస్తున్న భారతీయులు కూడా ఇబ్బంది పడ్డారు. నిషేధం విధించినప్పటికీ బియ్యానికి సంబంధించి ఆగస్టులో ద్రవ్యోల్బణ రేటు 12.54%గా కొనసాగింది.

జీవో 142 అభ్యంతరాలపై ఉన్నతస్థాయి కమిటి

- టీపీహెచ్ డీఏ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజారోగ్య విభాగంలో రీఆర్గనైజేషన్ జీవో 142పై ఉన్న అభ్యంతరాలపైన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు ఆదేశించినట్టు తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టీపీహెచ్‌డీఏ) తెలిపింది. మంత్రి హరీశ్ రావుకు వినతిపత్రం సమర్పించిన అనంతరం టీపీహెచ్‌డీఏ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్థన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచందర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర డిమాండ్ల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించండి



- కేంద్ర మంత్రులు, రైల్వే బోర్డు ఛైర్మన్ కు జర్నలిస్ట్ సంఘాల వినతి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నిలిపివేసిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధులు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ ప్రధాన కార్యదర్శి విపిన్ దులియా, కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఐఎఫ్‌డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య తదితరులు శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రైల్వే బోర్డు ఛైర్మెన్ జయవర్మ సిన్హాలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. జర్నలిస్టులకు రైలు ప్రయాణంలో చాలా ఏండ్లుగా ఇస్తున్న రాయితీని కరోనా నేపథ్యంలో గత మూడేండ్లుగా కేంద్రం నిలిపివేసిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల దేశవ్యాప్తంగా జర్నలిస్టులు వృత్తిపరమైన విధి నిర్వహణలో రైలు ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై గతంలో పలు మార్లు రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. ఇప్పటికైనా రైల్వే పాస్‌లను పునరుద్ధరించి జర్నలిస్టులకు రైలు ప్రయాణం భారం కాకుండా చూడాలని కోరారు. అలాగే ఎంపీలు బండి సంజయ్, కె. లక్ష్మణ్ లను కలిపి జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ అంశాన్ని పార్లమెంటు దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు. జర్నలిస్టుల పెన్షన్ స్కీమ్, జర్నలిస్టుల రక్షణ చట్టం తదితర అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషిచేయాలనికషి చేయాలని ఎంపీలను విజ్ఞప్తి చేశారు.

జెమినీ వైరస్‌తో.. మిర్చి రైతుల ఆందోళన



నవతెలంగాణ-చిన్నగూడూరు

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల వ్యాప్తంగా మిర్చి రైతులు జెమినీ వైరస్ (బొబ్బర తెగుళ్ళ)తో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పగిడిపల్లి శివారు బాబోజీ తండాకు చెందిన బానోత్ రాముడు తన రెండు ఎకరాల మిర్చి పంటకు జెమినీ వైరస్ సోకింది. దాంతో ఎన్ని రకాల క్రిమిసంహారక మందులు వాడినా.. మిర్చి మొక్కలు ఎండిపోతున్నాయని తన ఆవేదనను విలేకరులతో వెల్లబుచ్చుకున్నారు. వైరస్ ప్రభావంతో ఆకు వంకరగా చుట్టుకుపోవడం, ముడతలు పడటం, మొక్కలు ఎండి పోతున్నాయని తెలిపారు.

బాబోజీ తండాలోనే సుమారుగా 150 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారని, ఇప్పటివరకు ఒక ఎకరానికి రూ.50వేలు చొప్పున పెట్టుబడులు పెట్టామన్నారు. వైరస్ సోకి పూర్తిగా ఎండిపోయిన మిర్చి పంటను రైతులు ట్రాక్టర్లతో దున్నీ తొలగిస్తున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అవగాహన కల్పించాలని యువ రైతులు నరేష్, లక్‌పతి తదితరులు కోరుతున్నారు.

గోడకూలి ముగ్గురు మృతి

పదిమందికి తప్పిన ప్రాణాపాయం

- శాయంపేటలో విషాద ఛాయలు



నవతెలంగాణ - శాయంపేట

హన్మకొండ జిల్లా శాయంపేట గ్రామంలోని పోచమ్మ వీధికి వెళ్లే సీసీ రోడ్డు పక్కన శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ కూలి ముగ్గురు కూలీలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట గ్రామానికి చెందిన ముష్కే భాగ్యలక్ష్మి భర్త సురేష్.. కొంతకాలం కిందట గుండెపోటుతో మరణించాడు. ఆమె ఇల్లు శిథిలావస్థకు చేరుకొని పైకొప్పు మొత్తం కూలిపోయింది. దాని పక్కనే చిన్న రేకుల షెడ్డు వేసుకొని కిరాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు గోడ పూర్తిగా నానిపోయింది. దాంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఒక్కసారిగా కూలి.. పక్కనే సీసీ రోడ్డుపై వెళ్తున్న వారిపై పడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న పొట్టకారి సుభద్ర గమనించి కొంతమందిని గుంజి దూరంగా నెట్టివేసింది. ఈ క్రమంలో లోకలబోయిన సారలక్ష్మి(55), మోరే సాంబయ్య (65)పై గోడ పూర్తిగా కూలిపోయింది. దాంతో అక్కడే ఉన్న చింతల రవిపాల్, మోరే మల్లక్క, గాజె మల్లేశం, అతని కుమారుడు సదానందం హుటాహుటిన మట్టి పెల్లలు తొలగించగా సాంబయ్య, సారలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే, గోడ పక్కనే ఆటోలో బియ్యం వేస్తున్న భోగి జోగమ్మపై గోడ మట్టిపెల్లలు పడటంతో నడుం, కాళ్లు విరిగిపోయాయి. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో మార్గమధ్యలోనే జోగమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ దేవేందర్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. తహసీల్దార్ సుభాషిణి, ఆర్ఐ శరత్‌కుమార్ సంఘటన వివరాలు సేకరించారు.

అంబులెన్స్ ఆలస్యంతో... జోగమ్మ మృతి

దామెర మండలం కోగిలవాయి నుండి జోగమ్మ మనుమడు వినయ్ అమ్మమ్మను తీసుకెళ్లడానికి శుక్రవారం ఆటోలో శాయంపేటకు వచ్చాడు. జోగమ్మ తన బిడ్డకు బియ్యం బత్తా పంపించేందుకు ఆటోలో వేస్తున్న క్రమంలోనే గోడ కూలింది. మట్టిపెల్లలు జోగమ్మ పై పడి నడుము, కాళ్లు విరిగిపోగా ఆస్పత్రికి తరలించడానికి చింతల రవిపాల్ అంబులెన్స్‌కు సమాచారమిచ్చాడు. ఆలస్యం అవుతుండటంతో మరల ఫోన్ చేయగా ఒకసారి పరకాల, మరొకసారి ఆత్మకూరు, మరొకసారి దామెర నుంచి అంబులెన్స్ వస్తుందని సమాచారమిచ్చారు. కానీ, గంటా 15 నిమిషాల తర్వాత అంబులెన్స్ వచ్చింది. ఆమెను పరీక్షించి సీపీఆర్ చేసి తీసుకెళ్లగా మార్గమధ్యలోనే జోగమ్మ మృతిచెందింది.

వినాయక చవితికి వచ్చి కానరాని లోకాలకు..

శాయంపేటకు చెందిన మోరే సాంబయ్య స్థానికంగా పని లేక సిరిసిల్లలో చేనేత పనిచేస్తూ జీవిస్తున్నాడు. పింఛను డబ్బులు, వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శాయంపేటకు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం బీడీలు కొనుక్కోవడానికి సీసీ రోడ్డుపై వస్తుండగా గోడకూలి దుర్మరణం చెందాడు. సాంబయ్యకు భార్య మల్లక్క, ఇద్దరు కుమారులు రమేష్, సదాశివుడు ఉన్నారు.

కూలి పని ఉంటే చెప్పండని వెళ్తుండగా గోడ కూలి మృతి

తహరాపూర్ గ్రామానికి చెందిన లోకలబోయిన సారలక్ష్మి భర్త 15 ఏండ్ల క్రితం మరణించడం, ఉన్న ఒక్క ఇంటిలో రెండు గదులు ఉండగా ఇద్దరు కుమారులు సంతోష్, నాగరాజు ఉంటుండటంతో, ఆమె శాయంపేటలో కిరాయికి ఉంటుంది. ప్రతిరోజూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది.

కూలి పని దొరకనప్పడల్లా పండ్లు, ఎండిన చాపలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. శుక్రవారం కూలి పని ఉంటే చెప్పండని తోటి కాలనీ వాసులకు చెబుతూ సీసీ రోడ్డుపై వస్తుండగా గోడ ఒక్కసారిగా కూలి ఆమెమీద పడటంతో మృతిచెందింది. ఈ ఘటనతో శాయంపేట గ్రామంలో విషాద ఛాయలు అమ్ముకున్నాయి.

'గిరిజన' టీచర్ల బదిలీ ఎప్పుడో..?

15వేల ఎస్టీ సంక్షేమశాఖ ఉపాధ్యాయుల నిరీక్షణ

- ఇంకా విడుదల కాని పదోన్నతుల షెడ్యూల్
- అక్టోబర్ 10 వరకే ఛాన్స్.. లేదంటే ఐదేండ్లు ఎదురుచూపే..!
- స్థానచలనం కోసం కమిషనరేట్ ముట్టడికి సన్నద్ధం



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వశాఖల్లోని అన్ని విభాగాల ఉపాధ్యాయుల బదిలీల కోలాహలం సాగుతుండగా గిరిజన సంక్షేమశాఖలో మాత్రం ఇంతవరకు ఆ ఊసే లేకపోవడంతో సంబంధిత టీచర్లు ఆందోళనకు గురవుతున్నారు. అన్ని మేనేజ్‌మెంట్‌లలో పదోన్నతుల షెడ్యూల్ విడుదలై నెలరోజులు అవుతున్నా గిరిజన కమిషనరేట్ నుంచి ఉలుకూపలుకూ లేకపోవడంపై టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సహా వివిధ ఉపాధ్యాయ సంఘాలు కమిషనరేట్‌లో వినతిపత్రాలు సమర్పించినా ఇంత వరకు ఎలాంటి చలనమూ లేదు. ఒకటి, రెండు రోజుల్లో పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించకపోతే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15వేల మందికి పైగా ఉన్న గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయులు.. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ కమిషనరేట్‌ను ముట్టడించేందుకు సమాయత్తం అవుతున్నారు.

గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యంపై విమర్శలు

రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 97వేలకు పైగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వేగంగా సాగుతోంది. అయితే గిరిజన సంక్షేమశాఖలో మాత్రం జరగడం లేదు. జీవో నెం 3ను సుప్రీంకోర్టు రద్దు చేసినా గిరిజన సంక్షేమశాఖ కమిషనరేట్ నుంచి ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవో 5, 9 మార్గదర్శకాల ద్వారా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ) ఆన్‌లైన్‌లో బదిలీల ప్రక్రియను వేగవంతం చేసింది. రెండు మల్టీ జోన్‌లలో 1798 మంది హెడ్మాస్టర్లు కూడా బదిలీ అయ్యారు. పీజీహెచ్ఎం పదోన్నతులపై డీఎస్ఈ మార్గదర్శకాలు ఇవ్వబోతుంది. వివిధ విభాగాల బదిలీ ప్రక్రియ ఆగమేఘాల మీద కొనసాగుతుంటే గిరిజన సంక్షేమశాఖ నుంచి స్పందన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..?

గిరిజన సంక్షేమశాఖలో ఎనిమిదేండ్లు పూర్తి చేసుకున్న వివిధ క్యాడర్ల టీచర్లు, ఐదేండ్ల సర్వీస్ పూర్తి చేసిన పీజీ హెడ్మాస్టర్లు అనేక ఏండ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకే పాఠశాలలో 12 ఏండ్లకు పైగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనేక మంది ఉన్నారు. అక్టోబర్ 10లోపు అన్ని విభాగాల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్ సమయం కూడా ఆసన్నమవుతోంది. ఈలోపు బదిలీలు చేపట్టకపోతే మరో ఐదేండ్ల పాటు ఎదురుచూపులు తప్పవని గిరిజన సంక్షేమశాఖ టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..?

ఏజెన్సీలోని జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో బదిలీలు కొనసాగుతున్నా ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో చేపట్టకపోవడానికి ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. జీవో 3 మనుగడలో లేదు కాబట్టి అన్ని విభాగాల స్కూల్స్‌లో మూకుమ్మడి బదిలీలు చేపట్టవచ్చు. ఇప్పటికే పరిషత్ స్కూల్స్‌లో కంబైన్డ్ బదిలీలు కొనసాగుతున్నా... గిరిజన సంక్షేమ స్కూల్స్‌కు వచ్చేసరికి ఓట్ల రాజకీయం నడుస్తున్నట్టుగా ఉపాధ్యాయ సంఘాలు అనుమానిస్తున్నాయి.

ఆటంకం లేకున్నా అలసత్వం..

ఆటంకం లేకున్నా బదిలీలపై కమిషనరేట్ వైపు నుంచి అలసత్వం కొనసాగుతోంది. పరిషత్ స్కూల్స్‌కు ఉన్నట్లుగా ఆర్జేడీ స్థాయి అధికారి గిరిజన సంక్షేమ శాఖలో లేరు కాబట్టి.. ఆ స్థాయి అధికారిని కమిషనరేట్ నియమించాలి. కానీ అలాంటిదేమీ లేకపోవడంతో ఏ పనైనా కమిషనరేట్ నుంచి చేయాల్సి వస్తుంది. కారణం స్పష్టంగా తెలియదు గానీ కంబైన్డ్ ట్రాన్స్‌ఫర్స్‌కు కమిషనర్ ఆసక్తిగా లేనట్టు తెలుస్తోంది. అందుకే జాప్యమవుతుందని భావిస్తున్నాం.



\- బానోత్ రాందాస్, యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి

మెడికల్ కాలేజీల ఫీజు దోపిడీని అరికట్టాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేట్ మెడికల్ కాలేజీల్లో వసూలు చేస్తున్న అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచి విద్యార్థులపై భారం మోపడం సరైంది కాదని విమర్శించారు. బి కేటగిరిలో సీట్లు పొందిన విద్యార్థులను ప్రయివేట్ మెడికల్ కళాశాలల యాజమాన్యాలు రకరకాల కారణాల పేరుతో ఫీజులు కట్టాల్సిందేనంటూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం తగదని హెచ్చరించారు. ఆ కాలేజీల్లో ప్రవేశం పొందిన యాజమాన్య కోటా విద్యార్థులను ప్రవేశాల సమయంలోనే రూ.12 లక్షల బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలనీ, లేకుంటే చేర్చుకోమని చెప్పడం ద్వారా వందలాదిమంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవోనెంబర్ 126, 127 ప్రకారం ప్రయివేట్ మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన నెల రోజుల తర్వాత బ్యాంకు హామీని సమర్పించవచ్చని తెలిపారు. ఈలోపు విద్యార్థుల ప్రవేశాలను ఆపకూడదంటూ జీవోలో స్పష్టంగా ఉందని వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఆ కళాశాలలు తప్పకుండా అమలు చేయాలంటూ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదేశాలున్నప్పటికీ ప్రయివేటు కాలేజీలు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా బి కేటగిరీ సీట్లు పొందిన విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తున్నన్నాయని పేర్కొన్నారు. ఆ కాలేజీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఈఎన్టీ డాక్టర్ల రాష్ట్ర 8వ సదస్సు

- పాల్గొననున్న 33 జిల్లాల నుంచి 500 డాక్టర్లు
- సౌత్ జోన్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్‌రెడ్డి వెల్లడి



నవతెలంగాణ-మిర్యాలగూడ

చెవి, ముక్కు, గొంతు విభాగం డాక్టర్ల రాష్ట్ర స్థాయి సదస్సు తొలిసారి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఏఓఐటీఎస్ సౌత్ జోన్ ప్రెసిడెంట్, సదస్సు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలోని శేఖర్ రెడ్డి ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ కన్వెన్షన్ ఏసీ హాల్లో 23న ఉదయం 10 గంటలకు సదస్సును తెలంగాణ శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ తిరునగర్ భార్గవ్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర సదస్సు రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని, మిర్యాలగూడ పట్టణంలో తొలిసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 33 జిల్లాల నుంచి సుమారు 500 మంది డాక్టర్లు హాజరవుతున్నట్టు తెలిపారు. డాక్టర్లతోపాటు ఈఎన్‌టిపిజి మెడిసిన్ చదివే విద్యార్థులు విధిగా ఈ సదస్సుకు హాజరై ఏదైనా ఒక సబ్జెక్టు గురించి సమగ్ర వివరాలతో వైద్య నిపుణుల సమక్షంలో ప్రజెంటేషన్ ఇస్తారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో రాష్ట్ర సదస్సులు జరిగాయని చెప్పారు. వైద్య విభాగానికి చెందిన ప్రముఖ ప్రొఫెసర్లు, హెచ్ఓడిలు సైతం హాజరు కానున్నారని తెలిపారు. వైద్య రంగంలో నూతనంగా వచ్చే పరికరాలు, ఆపరేషన్లు, టెక్నాలజీ గురించి చర్చిస్తారన్నారు. జూనియర్ డాక్టర్లు కొత్త అంశాలు తెలుసుకోవడానికి వేదికగా ఇలాంటి కాన్ఫరెన్స్‌లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అత్యాధునిక పరికరాలతో నూతన టెక్నాలజీతో కూడిన అంశాలను పరీక్షించేందుకు మిర్యాలగూడ ఈఎన్టీ హాస్పిటల్ నుంచి లైవ్‌లో ఈఎన్టీ వైద్య నిపుణుల సమక్షంలో ఆపరేషన్ చేస్తారని చెప్పారు. సదస్సులో పాల్గొనే డాక్టర్లు, పీజీ విద్యార్థులు ఆపరేషన్ చేసే విధానాన్ని పరిశీలించనున్నట్టు తెలిపారు. వివిధ అంశాలపై ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చిన 15 మంది డాక్టర్లకు గోల్డ్ మెడల్స్ అందజేయనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్లు రాకేష్, నాగవర్ధన్ రెడ్డి, వంశీ తదితరులు ఉన్నారు

రూ.10 లక్షలు విలువ చేసే నకిలీ మద్యం పట్టివేత

- ఇంట్లోనే తయారు చేస్తూ.. వైన్స్‌లకు విక్రయిస్తున్న ఘనుడు
- వైన్స్‌ల్లో తనిఖీలు చేయగా.. అసలు విషయం వెలుగులోకి
- నిందితుల అరెస్టు


నవతెలంగాణ-నర్సాపూర్, ములుగు

రూ.10 లక్షలు విలువచేసే నకిలీ మద్యాన్ని, ఆ మద్యాన్ని తయారు చేసే పరికరాలను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. తొలుత పలు వైన్స్‌ల్లో తనిఖీలు చేయగా నకిలీ మద్యం పట్టుబడింది. అది ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీయగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇంట్లోనే పరికరాలు అమర్చుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్న నిందితుడు పట్టుబడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలను మెదక్ జిల్లా నర్సాపూర్ ఎక్సైజ్ కార్యాలయంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ విలేకరులకు వెల్లడించారు.

సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పురుషోత్తం కొన్నేండ్లుగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని కాళ్లకల్‌లోని ఓ వైన్స్‌లో పని చేస్తున్నాడు. పని చేస్తే డబ్బులు తక్కువగా వస్తున్నాయని.. అదే నకిలీ మద్యం తయారు చేసి అమ్మితే అధిక డబ్బులు సంపాదించుకోవచ్చనుకున్న అతను.. అనుకున్నదే తడువుగా కుటుంబ సభ్యులతో కలిసి ఓ ప్రణాళిక వేశాడు. ఇంట్లోనే మద్యాన్ని తయారు చేసే మిషన్లను, మద్యం సీసాలను, వాటి తయారీకి మనుషులను ఏర్పాటు చేసుకున్నాడు. ఇంట్లోకి ఎవరు వెళ్లకుండా బయట నుంచి తాళం వేసి లోపలే మద్యం తయారు చేసి.. అర్ధరాత్రి తర్వాత కొన్ని వైన్స్‌లకు సప్లయ్ చేస్తుండేవాడు. అయితే నర్సాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వైన్సుల్లో నకిలీ మద్యం విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో.. డీటీఎఫ్ సీఐ నరేందర్, నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ పద్మ ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి, కాళ్లకల్ వైన్స్‌లను తనిఖీ చేశారు. . ఈ దాడిలో 590 ఐబీ బాటిళ్లు, 981 ఆఫీసర్ ఛాయిస్ బాటిళ్లు, 1172 లేబుల్స్, ఐబీకి సంబంధించిన ఖాళీ లేబుల్స్ 1172, డక్కన్ బ్లూ 3972, ఆఫీసర్ ఛాయిస్ 806, ఐబీ క్యాప్స్ 97, డూప్లికేట్ హిల్స్ షీట్స్ 2950తో పాటు సుమారు 9000 ఖాళీ మద్యం సీసాలు దొరికాయి. పట్టుబడిన మద్యం బాటిళ్లు, పరికరాలను సీజ్ చేసినట్టు హరికిషన్ తెలిపారు. గోవా నుంచి తక్కువ ధరకు మద్యం తీసుకువచ్చి రాష్ట్రానికి సంబంధించిన లేబుల్స్ అంటించి ఐబీ, ఆఫీసర్ ఛాయిస్ బాటిల్‌లలో కల్తీ చేస్తూ విక్రయిస్తున్నారన్నారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌తో పాటు డీటీఎఫ్ సీఐ నరేందర్, నర్సాపూర్ సీఐ పద్మ, అసిస్టెంట్ కమిషనర్ కె.రఘురాం, అసిస్టెంట్ సూపరిండెంటెండ్ కె.శ్రీనివాసరావు, డీటీఎఫ్ ఎ.నరేందర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కాజా అజీజ్ హైమద్, సిబ్బంది చంద్ర, ఎల్లయ్య, తిరుమల, పీఅండ్ హెచ్‌సీ సిబ్బంది రాజు, హరీష్, నరేష్, సత్య, చామంతి, అనిల్, ప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భర్త మోసం చేసి ఆమెను పెండ్లి చేసుకున్నాడు. నిజం తెలిసినా భర్తే సర్వస్వం అనుకుంది. భర్తను బాగు చేసుకునేందుకు అన్ని విధాల ప్రయత్నించింది. అతను బాగుపడకపోగా ఆమెనే అనుమానించడం మొదలుపెట్టాడు. అతనిలోని లోపాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం తాగే వాడు, కొట్టేవాడు. అయినా కొన్నేండ్లు భరించింది. చివరకు ఇక అతనితో ఉండలేక పుట్టింటికి వెళ్ళిపోయింది. దాంతో భర్త ఆమెకు నోటీసు పంపించాడు. ఈ సమస్య నుండి ఆమె ఎలా బయటపడిందో ఈ వారం ఐద్వా అదాలత్‌లో తెలుసుకుందాం...

లోపం దాచేసి.. ఆమెనే అనుమానించి...



లక్ష్మికి 20 ఏండ్లు. ఆమె ఉండేది చిన్న పల్లెటూరు. అమ్మా, నాన్నాతో పాటు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు వారు గ్రామంలోనే కూలిపని చేసుకుని బతికేవారు. పెద్దగా చదువు లేదు. లక్ష్మికి 18 ఏండ్లకే పెండ్లి చేశారు. అతనికి ఇది రెండో పెండ్లి. మొదటి భార్య వాళ్ళ బంధువుల అమ్మాయి. అయినా పెండ్లయిన ఏడాదికే విడాకులు తీసుకుంది. ఆ విషయం చెప్పకుండానే అతను లక్ష్మిని పెండ్లి చేసుకున్నాడు. అయితే పెండ్లి తర్వాత జరగాల్సిన ఏ ముచ్చటా ఆమెకు జరగలేదు. భర్త ఆమెతో కనీసం మాట్లాడేవాడు కాదు. పనికి వెళ్లొచ్చి అన్నం పెడితే తిని, పడుకునే వాడు.

ఏడాది తర్వాత లక్ష్మి తండ్రి చనిపోయాడు. దాంతో లక్ష్మి వాళ్ళ అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళి 15 రోజులు ఉండి వచ్చింది. అప్పటి నుండి భర్త అంజయ్య ఆమెను అనుమానించడం మొదలుపెట్టాడు. 'నీకు అక్కడ ఎవరితోనే సంబంధం వుంది. నువ్వు నాకు వద్దు' అనేవాడు. ఊరి పెద్దలు పంచాయితీ పెట్టి అంజయ్యకు నాలుగు మంచి మాటలు చెప్పి పంపించారు.

అప్పుడే అంజయ్య సంసార జీవితానికి పనికి రాడనే మొదటి భార్య విడాకులు ఇచ్చిందనే విషయం లక్ష్మికి తెలిసింది. కానీ ఆమె భర్తను ఒక్క మాట కూడా అనలేదు. పైగా 'మనం హైదరాబాద్ పోయి అక్కడే ఏదో ఒక పని చేస్తూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుందాం' అని ధైర్యం చెప్పింది. కుటుంబ సభ్యులను కూడా ఒప్పించింది.


ఇద్దరూ కలిసి హైదరాబాద్‌లో రెండేండ్లు గడిచిపోయింది. ఇంకా పిల్లలు ఎందుకు కాలేదు అంటూ ఇంట్లో వాళ్లు అనడం మొదలుపెట్టారు. 'నీలో ఏదో లోపం ఉంది, అందుకే నీకు పిల్లలు పుట్టడం లేదు' అని అందరూ లక్ష్మినే అనేవారు. ఒకపక్క 'డాక్టర్లు ఆయనకు పిల్లలు పుట్టే అవకాశమే లేదు, ఎన్ని మందులు వాడినా ఉపయోగం లేదు' అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో లక్ష్మి అతనికి విడాకులు ఇచ్చి ఇంకో వివాహం చేసుకోవచ్చు. కానీ ఆమె అలా చేయలేదు. 'మంచో చెడో పెండ్లి చేసుకున్నాను. ఇప్పుడు కేవలం సంసార సుఖం కోసం అంజయ్యను వదిలి వెళ్ళడం సరి కాదు' అనుకుంది. పైగా ఆమెకు తండ్రి లేడు. తల్లి కూలి చేసుకుని బతుకుతుంది. ఇంకా పెండ్లి కావల్సిన ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. తను తిరిగి వెళితే తల్లికి భారం అవుతాను అనుకుంది. అందుకే ఎలాగైనా అంజయ్యతోనే ఉండాలని నిర్ణయించుకుంది.

భర్తను ఒప్పించి ఒక బాబును దత్తత తీసుకుంది. కానీ అంజయ్య తనలోని లోపాన్ని భరించలేక తాగుడుకు బానిస అయ్యాడు. తాగి లక్ష్మిని కొట్టేవాడు. ఏ పని చేసేవాడు కాదు. లక్ష్మి చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఇంటిని నడిపించేది. అయినా 'నేను సంసారానికి పనికిరానని వేరే వాళ్ళతో సంబంధాలు పెట్టుకున్నావు' అంటూ లక్ష్మిని అనుమానించేవాడు. ఇలాంటి పరిస్థితుల్లో అంజయ్యకు యాక్సిడెంట్ జరిగి మంచానికే పరిమితమయ్యాడు. అయినా భర్తకు చిన్న పిల్లాడికి చేసినట్టు ఆరు నెలలు సేవ చేసింది. తర్వాత అత్తమామలు వచ్చి 'ఇంత ఇబ్బంది పడుతూ ఇక్కడ ఉండటం ఎందుకు, ఊరికి వెళ్దాం' అని తీసుకువెళ్లారు. అంజయ్య ఆరోగ్య పరిస్థితి మెరుగు పడింది. కానీ లక్ష్మిని మానసికంగా బాధ పెట్టడం మొదలు పెట్టాడు. ఊరిలో కూడా ప్రతి ఒక్కరితో సంబంధం అంటగట్టేవాడు. పని చేసేవాడు కాదు. కూర్చున్న దగ్గర అమ్ముకోవచ్చు అని పండ్ల వ్యాపారం చేయమని చెప్పినా వినలేదు. వాళ్ళ అమ్మ షాపులో కూర్చుంటే వచ్చిన డబ్బులు తీసుకుని తాగేవాడు. లక్ష్మి సంపాదన కూడా అతని తాగుడికి, మందులకే అయిపోయేవి. బాబును వేరే వాళ్ళకు ఇచ్చేయమని గొడవ చేసేవాడు.

'నా బాబు కాదు, వీడు నీ కొడుకే. ఎవరితోనే సంబంధం పెట్టుకోవడం వల్ల పుట్టాడు. అందుకే వాడిని పెంచుతున్నావు' అంటూ రకరకాలుగా ఆమెను ఇబ్బంది పెట్టేవాడు. దాంతో అతన్ని వదిలేసి తల్లి దగ్గరకు వెళ్ళి పోయింది. లక్ష్మి తన తల్లితో పాటు హైదరాబాద్ వచ్చేసింది. చెల్లెళ్లను హాస్టల్లో చేర్పించింది. తల్లీ కూతుళ్లు ఉద్యోగం చేసే దగ్గర ఒక రూమ్ ఇచ్చారు. ఇప్పుడు అక్కడే ఉంటున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో 'నా భార్య నాతో కాపురం చేయడం లేదు. నాకు ఆరోగ్యం బాగోలేదు. అయినా నన్ను చూడటం లేదు' అంటూ ఆమెకు నోటీసులు పంపించాడు. తెలిసిన వారు చెబితే ఆ నోటీసు తీసుకుని లక్ష్మి 'ఐద్వా' దగ్గరకు వచ్చింది.

మేము అంజయ్యను పిలిచి మాట్లాడాము. అతను ముందు 'నా తప్పు ఏమీ లేదు. తప్పంతా ఆమెదే' అని చెప్పాడు. అతనికి ఆస్పత్రిలో చికిత్స చేయించిన పేపర్లు, బాబును దత్తత తీసుకున్న పేపర్లు అన్నీ మాకు చూపించింది. వాటిని చూసి అతన్ని ప్రశ్నిస్తే 'మేడం నాలో లోపం వుంది. అందుకే నా మొదటి భార్య వదిలేసి వెళ్ళింది. చికిత్స తీసుకుంటే నయం అవుతుంది అని లక్ష్మిని పెండ్లి చేసుకున్నాను. కానీ నా సమస్యకు ఎలాంటి చికిత్సా లేదని డాక్టర్లు చెప్పారు. అయినా ఇప్పుడు నా ఆరోగ్య పరిస్థితి అస్సలు బాగోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో భార్యగా నన్ను చూసుకోవాల్సిన బాధ్యత ఆమెదే కదా! అందుకే నోటీసులు పంపించాను' అన్నాడు.



నువు ఏ రోజైనా ఆమెకు భర్తగా ఉన్నారా? మోసం చేసి పెండ్లి చేసుకున్నావు. నీలో లోపం వుందని తెలిసి కూడా ఆమె నీతోనే ఉండాలని నిర్ణయించుకుంది. ఆస్పత్రికి కూడా తీసుకెళ్ళింది. ఎలాంటి ప్రయోజనం లేదన్నా నీకు అండగా నిలబడింది. అయినా నువ్వేం చేశావు. ఆమెను అనుమానిస్తూనే ఉన్నావు. నీకు ఎన్ని సేవలు చేసినా నీ బుద్ధి మారలేదు. చివరకు బాబును దత్తత తీసుకుంటే ఆ విషయంలో కూడా అనుమానించావు. ఇక నీతో ఆమె ఎలా ఉంటుంది? ఇప్పడు నీకు ఆరోగ్యం బాగోలేదు కాబట్టి చూసుకోనే బాధ్యత తనదే అంటున్నావు. నోటీసు పంపించి మంచి పనే చేశావు. కోర్టులో నీలో లోపం వుందని తెలిస్తే నువ్వే ఆమెకు నష్టపరిహారం ఇవ్వాల్సి వస్తుంది. ఆ డబ్బుతో లక్ష్మి, బాబు హాయిగా బతకొచ్చు.

'నువ్వు ఏ రోజైనా ఆమెకు భర్తగా ఉన్నావా? మోసం చేసి పెండ్లి చేసుకున్నావు. నీలో లోపం వుందని తెలిసి కూడా ఆమె నీతోనే ఉండాలని నిర్ణయించుకుంది. ఆస్పత్రికి కూడా తీసుకెళ్ళింది. ఎలాంటి ప్రయోజనం లేదన్నా నీకు అండగా నిలబడింది. అయినా నువ్వేం చేశావు. ఆమెను అనుమానిస్తూనే ఉన్నావు. నీకు ఎన్ని సేవలు చేసినా నీ బుద్ధి మారలేదు. చివరకు బాబును దత్తత తీసుకుంటే ఆ విషయంలో కూడా అనుమానించావు. ఇక నీతో ఆమె ఎలా ఉంటుంది? ఇప్పుడు నీకు ఆరోగ్యం బాగోలేదు కాబట్టి చూసుకోనే బాధ్యత తనదే అంటున్నావు. నోటీసు పంపించి మంచి పనే చేశావు. కోర్టులో నీలో లోపం వుందని తెలిస్తే నువ్వే ఆమెకు నష్టపరిహారం ఇవ్వాల్సి వస్తుంది. ఆ డబ్బుతో లక్ష్మి, బాబు హాయిగా బతకొచ్చు. ఇక నీకు నచ్చినా, నచ్చకపోయినా ఆమె నీ నుండి విడాకులు తీసుకుని ప్రశాతంగా ఉండొచ్చు' అని చెప్పాము. దాంతో అతను మరో మాట మాట్లాడలేదు.

అంజయ్య తల్లిదండ్రులతో మాట్లాడి లక్ష్మికి అర్ధ ఎకరం పొలం రాయించాము. 'నీకు జీవితం చాలా ఉంది. వేరే వ్యక్తిని పెండ్లి చేసుకుని హాయిగా ఉండు. నిన్నూ, బాబును కూడా చూసుకునే వ్యక్తిని చూసి పెండ్లి చేసుకో. మీ చెల్లెళ్ల కోసం ఆలోచించే పని లేదు. వాళ్లిద్దరూ హాస్టల్లో వుండి బాగా చదువుకుంటున్నారు. నువ్వు నీ జీవితం, బాబు గురించే ఆలోచించు. మనిషికి బతకడానికి తిండి ఎంత అవసరమో, జీవితంలో ఒక తోడు కూడా అంతే అవసరం. నీ తర్వాత బాబును చూసుకోవడానికి అయినా నీ జీవితంలోకి మరో వ్యక్తిని ఆహ్వానించు' అని చెప్పి పంపించాము.

- వై. వరలక్ష్మి, 9948794051

ఆటపాటలతో..

పసిపిల్లలు ఉన్న ఇంట్లో ఒకటే సందడి. పిల్లలు చేసే అల్లరితో పాటు వారితో సమానంగా పెద్దలు పిల్లలతో అడే అటలు, పాటలతో ఇల్లంతా సందడిగా ఉంటుంది. ఈ సందడి పిల్లలని ఉత్సాహ పరచటమే కాదు వారి శారీరక, మానసిక అరోగ్యానికి ఎంతో అవసరం. జోల పాటలు పాడుతూ పసిబిడ్డను కొద్దిగా అటూ, ఇటూ ఊపి చూడండి. వెంటనే అ పసి ముఖం మీద బోసినవ్వు మెరుస్తుంది. ఒకోసారి మన ఆటలకి నోరారా నవ్వుతారు. పకపకమని నవ్వేవారి నవ్వు చక్కటి ఆరోగ్యాన్ని అందిస్తుంది. అందుకే వీలయినంత ఎక్కువగా పిల్లల్ని ఆటపాటలతో మురిపించటం ఎంతో మంచిదని అంటున్నారు పరిశోధకులు.

పసి పిల్లల్ని ఎత్తుకుని పైకి ఎగరేస్తూ ఆడటం, అలాగే ఒళ్లో కూర్చో పెట్టుకుని పాటలు పాడుతూ ముందుకీ వెనక్కి ఊపుతూ ఆడించటం వంటివన్నీ పిల్లలకి కేవలం ఆటలాగా సరదాగా అని పిస్తాయి. కానీ, నిజానికి బిడ్డల్ని అలా అటూ, ఇటూ ఊపుతుండటం వల్ల ఎంతో లాభం ఉందని గుర్తించారు పరిశోధకులు. వీటి వల్ల వారి మెదడులో గణనీయమైన పెరుగుదల ఉంటుందని తేలింది. బిడ్డలకు సంగీతాన్ని వినిపిస్తూ ఇలా లయబద్ధంగా ఊపటం వల్ల వారి మెదడులో 'సెన్సరీ వ్యవస్థ' చక్కగా బలపడుతోందని, దీని వల్ల నాడీ కణాల మధ్య అనుసంధాయక సంబంధాలు అంటే నాడీ వ్యవస్థ మెరుగై, మెదడు చురుగ్గా అభివృద్ధి చెందుతోందని పరిశోధకులు గుర్తించారు.

పసిపిల్లల్ని అడించేటప్పుడు అల్లిబిల్లి పాటలు పాడటం, అందుకు తగ్గట్టు లయాత్మకంగా ఊపటం అన్ని సమాజాలల్లోనూ, అన్ని సంస్కృతుల్లోనూ ఉంది. అలాగే లాలి పాటలు పాడుతూ ఒళ్లో వేసి ఊపుతూ జో కొట్టటం కూడా. వీటి ప్రభావం పిల్లల ఎదుగుదలపై ఎలా ఉంటుందన్న దాని మీద పరిశోధకులు విస్తృతంగా చేసిన పరిశోధనల్లో తెలిసీ, తెలియక మనం ఆడించే ఈ ఆటల వల్ల పిల్లల మెదడుకి ఎంతో మేలు కలుగుతుందని వెల్లడైందట..

చిట్టిపొట్టి గీతాలు, పాటలు పిల్లలకి చిన్నితనం నుంచే వినిపిస్తుండటం వల్ల వారిలో రకరకాల సామర్థ్యాలు చురుకుగా అభివృద్ధి చెందటం గమనించారు. భాషా పరిజ్ఞానం, జ్ఞాపక శక్తీ వంటివే కాదు పంచేంద్రియాలు అంటే సెన్సస్ చురుకుగా తయారై మెదడు మరింత చురుకుగా వృద్ధి చెందుతుందని వీరు చెబుతున్నారు. మనం ఏదైనా అనుభూతి పొందుతున్నామంటే, దాని వెనుక ఏకకాలంలో రకరకాల జ్ఞానేంద్రియాలు పనిచేస్తున్నాయని అర్థం. ఎదుగుదలలో భాగంగా పిల్లలకు ఈ భిన్నత్వం అలవాటు అయ్యేందుకు మన అటా - పాటా బాగా ఉపకరిస్తాయంటున్నారు.

పిల్లల్ని ఒకచోట ఉంచి, రకరకాల బొమ్మల్ని చూపిస్తూ అడించిన దాని కన్నా, పిల్లల్ని ఒక బొమ్మగా ఆడించి, ఊపుతూ కదపటం, వారు కిలకిలా నవ్వేలా చేయటం వంటివి తప్పకుండా వారి మెదడులోని నాడీకణాల మధ్య అనుసంధాన సంబంధాలు మెరుగు పడటానికి ఉపయోగపడుతుందట. కాబట్టి అటపాటలతో, లాలి పాటలతో లయబద్ధంగా పిల్లల్ని ఊపుతూ అడించటం ఎంతో మంచిది అంటున్నారు పరిశోధకులు.



ప్రజల ఐక్యతను దెబ్బతీసేలా కేంద్రం కుట్ర



(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా అరుణపతాకాన్ని ఎగురవేశారు. అనంతరం కన్వెన్షన్‌ను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ..కేంద్రంలోని పాలకులు దేశంలో వస్త్రమిల్లుల యజమానులకు లాభాలు గడించి పెట్టేందుకు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్న తీరును వివరించారు. మోడీ సర్కారు వచ్చాక శాశ్వత పనివిధానం పోయి డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పని పద్ధతుల అమలు వేగవంతం అయిందన్నారు. దీంతో యాజమాన్యాలు కార్మికులను అణచి ఉంచి పనిచేయించుకుంటున్నాయన్నారు. రాజ్యాంగం కార్మికులకు ఇచ్చిన హక్కులను కూడా మోడీ సర్కారు కాలరాస్తున్నదన్నారు. మరోవైపు వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. పేదలపై ధరల భారాలు మోపుతున్న సర్కారు అదే సమయంలో కార్పొరేట్లకు మాత్రం లాభాలు మరింత పెరిగేలా చేస్తున్నదని విమర్శించారు. దేశంలో ధరలు పెరగటం, తగ్గడం అనే అంశం కేవలం ఐదుగురు పెట్టుబడిదారుల చేతుల్లోనే ఉందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓవైపు స్వదేశీ జపం చేస్తూనే మరోవైపు దేశ సంపదను విదేశీ గుత్తపెట్టుబడిదారులకు దోచిపెడుతున్నదని విమర్శించారు. అమెరికా నుంచి ఆపిల్స్‌ను దిగుమతి చేసుకోవడమంటే కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ రైతుల ఉపాధిని దెబ్బతీయడమేనన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి చేపలు పట్టడాన్ని అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వం అదే పెద్దపెద్ద కంపెనీలకు మాత్రం వేట చేసే అవకాశం కల్పించడం దుర్మార్గమన్నారు.

తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ..తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చేనేత కార్మికులు పోషించిన పాత్రను వివరించారు. నేతన్నల హక్కుల కోసం చేనేత కార్మిక సంఘం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తుచేశారు. నేడు రాష్ట్రంలో అమలవుతున్న పింఛన్ స్కీమ్ చేనేత కార్మిక సంఘం పోరాట ఫలితమేనన్నారు. రాష్ట్రంలో ఒకనాడు 1.50 లక్షల మగ్గాలుండగా పాలకుల తీరు వల్ల నేడు 40 వేల లోపునకు పడిపోయాయని చెప్పారు. ప్రభుత్వం జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించినవి 30 వేల మగ్గాలే ఉన్నాయన్నారు. ఉన్న మగ్గాలను కాపాడుకునేందుకు చేనేత కార్మికులందరూ ఒక్కతాటిపైకి వచ్చి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్ రంగాలకు వేర్వేరుగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో చేనేత సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. చేనేత వస్త్రాలపైనా, బట్ట తయారీకి అవసరమయ్యే ముడిసరుకులపైనా 34 శాతం జీఎస్టీ విధించడం దారుణమన్నారు. ఇది చేనేత రంగాన్ని దివాళా తీయించడంలో భాగమేనన్నారు. చేనేతపై జీఎస్టీని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. వస్త్ర తయారీ ముడిసరుకులను ప్రభుత్వమే సబ్సిడీ మీద అందించాలని కోరారు. రాష్ట్రంలో మగ్గమున్న ప్రతి కార్మికునికీ రూ.10 లక్షల చేనేత బంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోచంపల్లి ఇక్కత్, టై అండ్ డైకి పేటెంట్ హక్కులున్న నేపథ్యంలో మిల్లుల్లో తెల్లబట్టపై ఆ ప్రింటింగ్ వేయడాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆ డిజైన్లను కాపీ కొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ప్రతి కార్మికునికీ రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో చేనేత వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 73 షెడ్యూల్ పరిశ్రమల్లో చేనేత రంగమూ ఉందనీ, కనీస వేతనాల జీవోలను వెంటనే విడుదల చేసి నేతన్నలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరిమలయన్, జాతీయ నాయకులు ఆర్.సింగారవేలు, ఎ.బాలన్, బాలకృష్ణ, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాంతికుమార్, సలహాదారులు కూరపాటి రమేశ్, సంఘం మాజీ నాయకులు శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు రోజులు రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

ఎదుట వర్చువల్‌గా హాజరుపరిచారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వర్చువల్‌గా చంద్రబాబుతో మాట్లాడారు. సిఐడి కస్టడీకి అడుగుతోందని, దీనిపై అభిప్రాయం చెప్పాలని న్యాయమూర్తి బాబును అడిగారు. తాను 45 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, తన గురించి దేశంలో అందరికీ తెలుసని న్యాయమూర్తికి తెలిపారు. అన్యాయంగా అరెస్టు చేశారన్నదే నా బాధ.. నా ఆవేదన.. అని అన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని, తన హక్కులు రక్షించాలని కోరారు. తనపై ఉన్నవి ఆరోపణలేనని, తనను విచారణ చేసిన తరువాత జైలుకు పంపితే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైలులో చంద్రబాబుకు కల్పిస్తున్న సౌకర్యాలపై న్యాయమూర్తి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు చంద్రబాబుకు సౌకర్యాలు కల్పించామని జైలు అధికారులు కోర్టుకు విన్నవించారు. అనంతరం చంద్రబాబుతో న్యాయమూర్తి మాట్లాడుతూ 'మీరు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. దీనిని శిక్షగా భావించొద్దు. మీపై వచ్చినవి ఆరోపణలు మాత్రమే. నిరూపణ కాలేదు. నిబంధనల ప్రకారమే రిమాండ్ విధించాం' అని పేర్కొన్నారు.

కారులో ఆ స్పీడేదీ..?

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలకే ఆయన హైదరాబాద్ దాటి బయటకు వెళ్లారు. మరోవైపు క్షేత్రస్థాయిలోని ఎమ్మెల్యేలు కూడా డబుల్ బెడ్ రూం ఇండ్లు, పింఛన్ల పంపిణీ, ఎక్స్‌గ్రేషియోలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ తదితర ప్రభుత్వ అధికారిక వేదికల మీది నుంచే రాజకీయ విమర్శలు చేయగలుగుతున్నారు తప్పితే స్పష్టంగా పొలిటికల్ యాక్టివిటీలో పాల్గొనకపోవటం గమనార్హం. మూణ్నెల్ల ముందే జాబితాను ప్రకటించటంతో అన్ని నెలలపాటు కార్యక్రమాల నిర్వహణ తలకు మించిన భారమవటం ఎమ్మెల్యేలు, అభ్యర్థుల్లో నైరాశ్యానికి ఒక కారణమైతే... అంతకు మించిన ప్రధాన కారణం మరొకటి ఉందనే ప్రచారం బీఆర్‌ఎస్‌లో జోరుగా కొనసాగుతోంది. టిక్కెట్ దక్కిందని మురిసిపోతున్న వారెవ్వరికీ బీ-ఫామ్ వస్తుందన్న గ్యారెంటీ లేకపోవటమే అసలు సిసలు కారణమని తెలిసింది. అందుకే ఇప్పటి నుంచే తొందరపడకుండా, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత, బీ-ఫామ్ చేతికందిన తర్వాతే ప్రచారాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు.

'పథకాలతో' పరేషాన్...

ఈ విషయాన్ని పసిగట్టిన కేసీఆర్... 'జనంలో ఉండండి..' అంటూ తాజాగా వారందరికీ వార్నింగ్ ఇచ్చినట్టు వినికిడి. అలా ఆయన ఆదేశాలు జారీ చేసినా అభ్యర్థులు క్షేత్రస్థాయిలోకి వెళ్లలేని పరిస్థితి. సర్కారు ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన దళిత బంధు పథకం, ఎన్నికల కోసం ముందుకు తెచ్చిన బీసీ, మైనారిటీ బంధు పథకాలు వారికి మెడకు చుట్టుకుంటున్నాయి. దళిత బంధు మొదటి దశ పూర్తయిందని చెబుతోన్న ప్రభుత్వం.. ఆ పథకం రెండో దశను ప్రారంభించింది. ఎమ్మెల్యేలు లబ్దిదారుల ఎంపికను పూర్తి చేసి, పైకి పంపినా ఇంకా గ్రౌండింగ్ పూర్తి కాకపోవటంతో దానిపై లబ్దిదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. బీసీ, మైనారిటీ బంధు పథకాలకు సంబంధించి కూడా ప్రజలు ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులను నిలేస్తున్నారు. వీటికి లబ్దిదారుల సంఖ్య ఎక్కువగా ఉండటం, కేటాయింపులు తక్కువగా ఉండటంతో బడ్జెట్ ఏ మూలకూ సరిపోవటం లేదు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి తీవ్రంగా విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. దీంతోపాటు ప్రతిష్టాత్మకమైన డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ నత్త నడక నడుస్తోంది. ఒక్క జీహెచ్‌ఎమ్‌సీ పరిధిలోనే లక్షల్లో దరఖాస్తులొస్తే... వేలల్లో మాత్రమే ఇండ్ల పంపిణీ కొనసాగుతోంది. దీంతో ఇండ్లు దక్కని పేదలు ఎమ్మెల్యేలను నిలేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు సర్దిచెప్పుకోలేక వారు తలలు పట్టుకుంటున్నారు. అందుకే జనం వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు.

అప్పుడలా.. ఇప్పు 'డీలా...'

ఈ పరిణామాలన్నింటి రీత్యా గులాబీ పార్టీ అభ్యర్థుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. 2018లో ఒక ఏడాది ముందుగానే ముందస్తు ఎన్నికలకు వెళ్లిన బీఆర్‌ఎస్ బాస్...ఆ క్రమంలో పార్టీలో, క్యాడర్‌లో జోష్‌ను పెంచి, రెండోసారి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ముందస్తుకు వెళ్లకుండా నిర్ణీత సమయంలోనే ఎన్నికలకు వెళుతూ... మూణ్నెల్ల ముందుగానే అభ్యర్థులను ప్రకటించినా అప్పటి హుషారు ఇప్పుడు ఆ పార్టీలో, కార్యకర్తల్లో కానరాకపోవటం గమనార్హం.



అక్టోబర్ మొదటివారంలో తొలి జాబితా

(మొదటిపేజీ తరువాయి)

అసలుకే మోసం వస్తుందని భావిస్తున్నారు. అభ్యర్థుల విషయంలో సునీల్ కనుగోలు నిర్ణయమే కీలకంగా మారనుందనే సంకేతాలు ఇచ్చారు. ఒక్కసారి అభ్యర్థిని ప్రకటించిన తర్వాత వెనక్కి తీసుకోలేమంటూనే, అనివార్యమైతే అభ్యర్థులను మార్చాల్సి రావచ్చు అని సునీల్ కనుగోలు సూచించినట్టు తెలిసింది. ఖమ్మంలో బలమైన అభ్యర్థులు పార్టీలో చేరినప్పటికీ వారికి టికెట్లు కేటాయింపు అంత సులువుగా తేలేట్టు లేదని తెలుస్తోంది. ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన నేతలు కమ్యూనిస్టులతో పొత్తు ఉంటుందో, ఉండదో కూడా తేల్చాలని కోరినట్టు ఆ పార్టీ వర్గాలు చెప్పాయి. మీలో మీరు పంచాయతీ పెట్టుకోకుండా ముందు మీరు ఐక్యంగా ఉండాలంటూ స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధర్ హెచ్చరించినట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో టికెట్టు ఆశించి భంగపడిన వారు బీజేపీలో చేరే అవకాశం ఉందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అభ్యర్థులను ప్రకటించే ముందుకు వారి మధ్య సర్దుబాటు కుదుర్చాలని సూచించారు. ఎవరికి టికెటు ఇచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఉండాలనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని అందరూ అభిప్రాయపడ్డారు. స్క్రీనింగ్ కమిటీ తర్జనభర్జనల మధ్య దాదాపు 40 నుంచి 45 నియోజకవర్గాలకు ఒకే పేరు పంపించినట్టు తెలుస్తోంది. తదుపరి పరిశీలన తర్వాత సెప్టెంబర్‌లో ప్రకటించే అవకాశం ఉన్నది.

అభ్యర్థుల జాబితా విడుదల బాధ్యత అధిష్టానానిదే : ఠాక్రే

అభ్యర్థుల జాబితా దశలవారీగా విడుదల చేయాలా? లేదా ఒకేసారి విడుదల చేయాలా? అనే విషయాన్ని అధిష్టానం నిర్ణయిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే వెల్లడించారు. స్క్రీనింగ్ కమిటీ అన్ని విషయాలను చర్చించిందన్నారు. టికెటు రాలేదని ఎవరూ బాధపడొద్దనీ, అధికారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తామని ఆయన చెప్పారు.

గ్రీస్‌లో కార్మికుల నిరసన గళం



ఏథెన్స్ : వేలాదిమంది కార్మికుల జీవితాలపై, జీవనోపాధులపై దాడి చేసేందుకు ఉద్దేశించిన కార్మిక వ్యతిరేక బిల్లును నిరసిస్తూ, వేలాదిమంది గ్రీస్ కార్మికులు గురువారం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. కన్జర్వేటివ్ న్యూ డెమొక్రసీ (ఎన్‌డీ) ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక బిల్లును నిరసిస్తూ ఇచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా ఈ ప్రదర్శనలను జయప్రదంగా నిర్వహించారు. పని ప్రదేశాల్లో ఇతర అనేక రకాల మార్పులతో పాటూ పనిగంటలు పెంచాలని ఈ బిల్లు కోరుతోంది. ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పిఎఎంఇ), వివిధ రంగాలకు చెందిన ఇతర యూనియన్లు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. బిల్లును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఏథెన్స్‌లో వేలాదిమంది కార్మికులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. థెస్సాలోనికి, లారిస్సా, పత్రాస్, ఐయోనినా, కార్ఫు, కతేరిని వంటి నగరాల్లో కూడా పెద్ద ప్రదర్శనలు జరిగాయి. నిరసన తెలియచేస్తున్న కార్మిక లోకానికి గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ), కమ్యూనిస్టు యూత్ ఆఫ్ గ్రీస్ (కెఎన్‌ఈ)లు మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించాయి. కాగా, ఈ సమ్మెలో పాల్గొనేందుకు అధికారికంగా పిలుపు ఇవ్వనందుకు జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ గ్రీక్ వర్కర్స్ (జీఎస్‌ఈఈ) నాయకత్వానికి తీవ్రంగా విమర్శలు ఎదురయ్యాయి.

ప్రస్తుతమున్న పని గంటలను 8 నుంచి 13కి పెంచాలని, అలాగే అవసరమైతే ఆరు రోజుల పని వారాన్ని అమలు చేసేందుకు యజమానులకు అవకాశం కల్పించాలని కార్మిక మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన కొత్త బిల్లు కోరుతోంది. ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేదా వేతనం లేకుండానే మొదటి ఏడాదిలోనే ఉద్యోగినిన తొలగించవచ్చు, పని ఆపేసినా, సమ్మెలు చేసినా జరిమానాలు విధించడంతో పాటూ ఆరు మాసాల పాటు జైలు శిక్ష కూడా విధిస్తారని బిల్లు నిబంధనలు పేర్కొంటున్నాయి. కాగా, కార్మిక లోకం యావత్తూ ఈ బిల్లును తీవ్రంగా నిరసిస్తోంది. గ్రీస్‌లో ఆధునిక బానిసత్వాన్ని అమలు చేసే సాధనంగా విమర్శించింది. గత రెండు మాసాలుగా పెద్ద ఎత్తున సంభవించిన వరదలు, ప్రాణాంతకంగా పరిణమించిన దావానలాలతో జనాభాలో ప్రధానమైన భాగం ఇబ్బందులు పడుతున్న వేళ ఇలాంటి బిల్లు తీసుకురావడాన్ని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఏథెన్స్‌లో ప్రదర్శనలో పాల్గొన్న కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కొత్సూమ్‌పాస్ మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వానికి, బడా యజమానులు, రాజీపడిన జీఎస్ఈఈ నాయకత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, కార్మిక సంఘాలు ఉద్యమాల ద్వారా దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన ప్రతిస్పందన ఇచ్చారని పేర్కొన్నారు.

గ్రీస్ కార్మిక లోకానికి సీఐటీయూ అభినందనలు !

న్యూఢిల్లీ : గ్రీస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, తమ హక్కుల పరిరక్షణ కోసం పోరు బాటలో సాగుతున్న గ్రీక్ కార్మిక లోకానికి అంతర్జాతీయ సంఘీభావాన్ని, అభినందనలను సీఐటీయూ తెలియచేసింది. కార్మికుల ఉపాధి భద్రతను గాల్లోకి నెట్టేలా, వారి పనిగంటలను, పని వారాన్ని పెంచేలా కొత్తగా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక బిల్లును తీవ్రంగా నిరసించింది.

కార్మికుల వేతనాలు, పెన్షన్లను స్తంభింపచేయడంతోపాటూ పొదుపు చర్యల డ్రైవ్‌ను చేపడుతున్నట్లు ప్రకటించిన పాలక ఎన్‌డి ప్రభుత్వం పార్లమెంట్‌లో కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. రోజుకు 13గంటలు చొప్పున ఆరు రోజుల పాటు పనిచేయాలని ఆ బిల్లు ప్రతిపాదిస్తోంది. వర్క్ బ్రేక్‌ను రద్దు చేయాలని కూడా భావిస్తున్నారు. ఇప్పటివరకు పలు రంగాల్లో ఐదు రోజుల పనిదినాలు మాత్రమే అమలవుతున్నాయి. పైగా సమ్మె చేసే హక్కును నేరంగా బిల్లు ప్రతిపాదించింది.

ఈ విధానపరమైన దాడులకు నిరసనగా, పిఎఎంఈ గురువారం దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపిచ్చింది. ఈ సమ్మెకు ప్రజా మద్దతు బ్రహ్మాండంగా లభించింది. ఏథెన్స్, లావ్‌రియో, లెస్‌వోస్ సహా పలు నగరాల్లో కార్మికుల కార్యాచరణకు సిఐటియు పూర్తి మద్దతును తెలియచేసింది. మొత్తంగా గ్రీస్ కార్మిక లోకాన్ని, ముఖ్యంగా పీఏఎంఈని అభినందించింది. గ్రీస్ కార్మిక లోకం చేపట్టే చర్యలకు సంఘీభావం తెలియచేయాల్సిందిగా దేశ విదేశాల్లోని సోదర కార్మిక సంఘాలను, తను అనుబంధ సంఘాలను, సభ్యులను కోరింది.

మెగాస్టార్ @ 45 ఇయర్స్



చిరంజీవి



అలుపెరగని సినీ ప్రయాణానికి సినలైన ప్రతిబింబం. సామాన్య నటుడి నుంచి అభిమానులు, ప్రేక్షకులు మెగాస్టార్ అని ముద్దుగా పిలుచుకునే స్థాయి వరకు చిరంజీవి తనని తాను మల్చుకున్న తీరు అన్ని తరాలకు స్ఫూర్తి దాయకం. 1978 సెప్టెంబర్ 22న విడుదలైన 'ప్రాణం ఖరీదు' సినిమాతో చిరు సినీ ప్రయాణం మొదలైంది.

ఈ రంగుల పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు నటుడిగా తానేమిటో నిరూపించు కోవాలన్న తపనే ఆయన్ని ఇన్నేండ్లగా పరిశ్రమలో సుస్థిరంగా నిలబెట్టింది. ఏ పని చేసినా అందులో ఎంతో శక్తి, ఉత్సాహం చూపే తత్త్వం నేటి తరం నటీనటులకు దీటుగా రాణించేలా చేస్తోంది. కథానాయకుడిగా, ప్రజానాయకుడిగా, సంఘ సేవకుడిగా అన్నింటికి మించి మనసున్న మనిషిగా అటు అభిమానులు, ఇటు సినీ ప్రేమికులు సైతం చిరుని అమితంగా అభిమానిస్తారు. ఇక ఫైట్లు, డాన్స్‌ల విషయంలో ఆ తరం.. ఈ తరం అనే భేదం లేకుండా అందరూ ఎంతో ఇష్టపడతారు. జయాపజయాలకు అతీతంగా ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని పడి లేచిన కెరటానికి ప్రతీకగా నిలిచిన చిరు ఈ సినీ ప్రయాణంలో ప్రేక్షకులు, అభిమానుల గుండెల్లో సుస్థిర స్థానంతోపాటు ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకున్నారు. చిరంజీవి సినీ రంగ ప్రవేశం చేసి శుక్రవారంతో సరిగ్గా 45 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా చిరంజీవికి ఆయన తనయుడు, హీరో, నిర్మాత రామ్ చరణ్ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు.

సినీ పరిశ్రమలో 45 సంవత్సరాల మెగా జర్నీని పూర్తి చేసుకున్న మన ప్రియమైన మెగాస్టార్‌కి హృదయ పూర్వక అభినందనలు. ఆయన ప్రయాణం ఎంతో గొప్పది. 'ప్రాణం ఖరీదు'తో ప్రారంభమైన ఈ జర్నీలో ఆయన మనల్ని ఇప్పటికీ అబ్బుర పరుస్తూనే ఉన్నారు. వెండితెరపై అద్భుతమైన నటనతో, బయట మీ మానవత్వంతో కూడిన మీ కార్య కలాపాలను కొనసాగిస్తూ కొన్ని కోట్ల మందిని ఇన్‌స్పైర్ చేస్తూనే ఉన్నారు. క్రమశిక్షణ, కష్టించే తత్వం, అంకిత భావం వంటి విలువలతో పాటు వాటన్నింటినీ మించి మాలో కరుణను పెంపొందించిన నాన్నకి ధన్యవాదాలు.

- రామ్‌చరణ్

చిరంజీవి ప్రస్తుతం 'బింబిసార' దర్శకుడు వశిష్ట దర్శకత్వంలో ఓ ఫాంటసీ ఎడ్వెంచర్ చిత్రంలో నటిస్తున్నారు. ఇది చిరు నటిస్తున్న 157వ సినిమా కావడం విశేషం. ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరిస్తున్నారు. అలాగే చిరు 156వ చిత్రాన్ని ఆయన తనయ సుస్మిత కొణిదెల నిర్మించనున్నారు. ఇటీవల చిరంజీవి బర్త్‌డే సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ని సైతం అధికారికంగా ప్రకటించారు.

కుమారి శ్రీమతి ఆశయం ఏంటి?



నిత్యామీనన్

నిత్యామీనన్ లీడ్ రోల్‌లో నటించిన వెబ్ సిరీస్ 'కుమారి శ్రీమతి'. దర్శకుడు శ్రీనివాస్ అవసరాల ఈ వెబ్ సిరీస్‌కి స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించగా, గోమటేష్ ఉపాధ్యాయే దర్శకత్వం వహించారు. 7 ఎపిసోడ్స్ ఉన్న ఈ సిరీస్‌ను స్వప్న సినిమా సంస్థ నిర్మించింది. శుక్రవారం హీరో నాని ఈ సిరీస్ ట్రైలర్‌ను లాంచ్ చేసారు. 'తన జీవితంలో ఒక బలమైన ఆశయం కోసం ప్రయత్నించే ధైర్య సాహసాలు కలిగిన మహిళ ప్రయాణం ఇది. తన కుటుంబం, గ్రామంలోని పడికట్టు ఆలోచనలని బ్రేక్ చేసే ఆధునిక మహిళ కథ కూడా. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో ఈనెల 28న ప్రైమ్ వీడియో ఓటీటీలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.

నవచిత్రం

దసరా కానుకగా విడుదల



శివరాజ్ కుమార్

శివరాజ్ కుమార్ హీరోగా పాన్ ఇండియా లెవెల్‌లో రూపొందుతున్న చిత్రం 'ఘోస్ట్'. శ్రీని దర్శకత్వంలో రాజకీయనాయకులు, నిర్మాత సందేశ్ నాగరాజ్ తన సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. అక్టోబర్ 19న దసరా కానుకగా కన్నడ, తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా విడుదలకి సిద్ధమవుతుంది. తాజాగా ఈ చిత్రం నుండి 'ఒరిజినల్ గ్యాంగ్ స్టర్ మ్యూజిక్' లిరిక్ వీడియోను విడుదల చేశారు. అర్జున్ జన్య కంపోజ్ చేసిన ఈ హై ఓల్టేజ్ సాంగ్‌లో కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఉన్న లిరిక్స్ ఆకట్టుకుంటున్నాయి. చెన్నై లయోలా కాలేజ్‌లో అభిమానుల సమక్షంలో ఈ పాటను రిలీజ్ చేశారు. శివరాజ్ కుమార్ పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో పాటు, మేకింగ్ గ్లింప్సెస్‌తో ఉన్న లిరికల్ వీడియో సినిమా మీద అంచనాలు మరింత పెంచేలా ఉంది' అని చిత్ర బృందం తెలిపింది.

వైభవంగా అక్కినేని పాన్ ఇండియా అవార్డ్స్ వేడుక



మురళీమోహన్, కాదంబరి కిరణ్

నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతిని పురస్కరించుకుని ఎఫ్ టీ పి సి ఇండియా, తెలుగు సినిమా వేదిక సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఏఎన్ఆర్ సెంటినరీ పాన్ ఇండియా అవార్డ్స్ వేడుక ప్రసాద్ ల్యాబ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. మురళీ మోహన్, నిర్మాతలు రమేష్ ప్రసాద్, దామోదర్ ప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ, వైవిఎస్ చౌదరి, ప్రసన్న కుమార్, సామాజికవేత్త వరలక్ష్మి, ఫిట్నెస్ ట్రైనర్ అను ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఈ వేడుకలో సినీ, సామాజిక రంగాలకు చెందిన వారిని ఘనంగా సత్కరించారు.

ఎఫ్ టి పీ సి అధ్యక్షులు చైతన్య జంగా మాట్లాడుతూ, 'దేశవ్యాప్తంగా మరోసారి ఏఎన్నార్‌ని స్మరించుకొనేలా చెయ్యాలన్న ఉద్దేశ్యంతోనే 10 రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను సత్కరించుకొనే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం' అని అన్నారు. 'ఏఎన్నార్ అభిమానులతోపాటు వివిధ రంగాల ప్రముఖులను సత్కరించుకొనే అవకాశం కలగడం తమ సంస్థలకు గర్వకారణం' అని తెలుగు సినిమా వేదిక అధ్యక్షులు విజయ్ వర్మ పాకలపాటి చెప్పారు.

ప్రీ వెడ్డింగ్ ప్రసాద్



అవినాష్, కోదండ రామిరెడ్డి

డెక్కన్ డ్రీమ్ వర్క్స్ బ్యానర్ పై నబీషేక్ నిర్మాణంలో ప్రొడక్షన్ నెం3గా రూపొం దనున్న చిత్రం 'ప్రీవెడ్డింగ్ ప్రసాద్'. ఈ సినిమా శుక్రవారం పూజతో ప్రారంభమైంది. 'జబర్దస్త్', 'బిగ్ బాస్' షోలతో తన కంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అవి నాష్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. రాకేష్ దుబాసి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సాయి కుమార్ మరో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ముహూర్త సన్నివేశానికి దర్శకుడు కోదండ రామిరెడ్డి క్లాప్ నివ్వగా, కోన వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు సాయి రాజేష్ సినిమా టైటిల్ లోగోని లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత నబి షేక్ మాట్లాడుతూ,'ఈ కథ అద్భుతంగా ఉంటుంది. స్క్రీన్ ప్లే, సన్నివేశాలు చాలా వైవిధ్యంగా, ఊహాతీతంగా ఉంటాయి. ఇందులో అవినాష్‌నే ఎందుకు హీరోగా తీసుకున్నామో సినిమా చూస్తున్నప్పుడు అర్థమవుతుంది. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.

ఆటలు

మెరిసిన షమి, సూర్య

మహ్మద్ షమి (5/51), సూర్యకుమార్ యాదవ్ (50) ఫామ్ అందుకున్నారు. ప్రపంచకప్ ముంగిట బంతితో ఒకరు, బ్యాట్‌తో ఒకరు జోరందుకోవటంతో మొహాలిలో ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో టీమ్ ఇండియా సంపూర్ణ విజయం సాధించింది. కీలక ఆటగాళ్లు ఫామ్‌లోకి రావటంతో పాటు బలమైన ఆసీస్‌పై ఆతిథ్య భారత్ అలవోక విజయం సాధించింది. తొలుత ఆస్ట్రేలియా 276 పరుగులు చేయగా, 48.4 ఓవర్లలో భారత్ లక్ష్యాన్ని ఛేదించింది.

- రాణించిన శుభ్‌మన్, రాహుల్
- తొలి వన్డేలో ఆసీస్‌పై భారత్ గెలుపు



నవతెలంగాణ-మొహాలి

ఆస్ట్రేలియాపై టీమ్ ఇండియా సత్తా చాటింది. భారత బౌలర్లు సమిష్టి చెలరేగటంతో తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై ఘన విజయం సాధించింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (74, 63 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (71, 77 బంతుల్లో 10 ఫోర్లు)లకు తోడు కెప్టెన్ కెఎల్ రాహుల్ (58 నాటౌట్, 63 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (50, 49 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీల మోత మోగించారు. దీంతో 277 పరుగుల లక్ష్యాన్ని భారత్ 48.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 276 పరుగులకు కుప్పకూలింది. పేసర్ మహ్మద్ షమి (5/51) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. ఓపెనర్ డెవిడ్ వార్నర్ (52, 53 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోశ్ ఇంగ్లిశ్ (45, 45 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టీవ్ స్మిత్ (41, 60 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భారత్, ఆస్ట్రేలియా రెండో వన్డే ఆదివారం ఇండోర్‌లో జరుగనుంది.

సూర్య మెరిసి : ఆసీస్‌తో గత సిరీస్‌లో మూడు సార్లు తొలి బంతికే డకౌట్‌గా నిష్క్రమించిన సూర్యకుమార్ యాదవ్.. ఆ తర్వాత మ్యాచుల్లోనూ మెప్పించలేదు. ప్రపంచకప్ ముంగిట సూర్యకుమార్ యాదవ్ ఫామ్ భారత్‌కు ఆందోళనగా మారింది. ఆసీస్‌తో తొలి వన్డేలో సూర్య (50) అదిరే అర్ధ సెంచరీ సాధించాడు. నాణ్యమైన కంగారూ బౌలింగ్ దాడిని ఎదుర్కొని కెఎల్ రాహుల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన సూర్య.. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో కదం తొక్కాడు. తొలుత ఓపెనర్లు గిల్ (74), రుతురాజ్ (71) తొలి వికెట్‌కు 142 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసి గెలుపు బాట వేశారు. ఆసీస్ స్పిన్నర్ జంపా వరుస వికెట్లతో బ్రేక్ సాధించినా.. కెఎల్ రాహుల్, సూర్యకుమార్‌లు అర్ధ సెంచరీ ఇన్నింగ్స్‌లతో ఆసీస్ ఆశలపై నీళ్లు చల్లారు. శ్రేయస్ అయ్యర్ (3), ఇషాన్ కిషన్ (18) నిరాశపరిచారు.

షమి విజృంభణ : టాస్ నెగ్గిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఇన్నింగ్స్ నాల్గో బంతికే మిచెల్ మార్ష్ (4) వికెట్‌తో మహ్మద్ షమి బ్రేక్ సాధించాడు. డెవిడ్ వార్నర్ (52), స్టీవ్ స్మిత్ (41) రెండో వికెట్‌కు 94 పరుగులు జోడించి ఆసీస్ నిలబెట్టారు. మార్నస్ లబుషేన్ (39), కామెరూన్ గ్రీన్ (31), జోశ్ ఇంగ్లిశ్ (45) సహా మార్కస్ స్టోయినిస్ (29), పాట్ కమిన్స్ (21) పరుగుల వేటలో మెప్పించినా.. నాణ్యమైన భారత బౌలర్లపై వేగంగా పరుగులు సాధించటంలో విఫలమయ్యారు. దీంతో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 10 వికెట్లకు 276 పరుగులే చేసింది. మహ్మద్ షమి ఐదు వికెట్లు పడగొట్టగా.. బుమ్రా, అశ్విన్, జడేజాలు తలా ఓ వికెట్ తీసుకున్నారు.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : 2776/10 (వార్నర్ 52, జోశ్ 45, స్మిత్ 41, షమి 5/51, అశ్విన్ 1/47)

భారత్ ఇన్నింగ్స్ : 281/5 (గిల్ 74, గైక్వాడ్ 71, రాహుల్ 58, సూర్య 50, కమిన్స్ 1/44)

ఆడుదాం..ఆసియా


నేటి నుంచి 19వ ఆసియా క్రీడలు



హౌంగ్జౌ ఆసియా క్రీడల ప్రధాన స్టేడియం. ఇక్కడ 80,000 మంది అభిమానుల సమక్షంలో నేడు ఆరంభ వేడుకలు జరుగనున్నాయి.

నవతెలంగాణ-హౌంగ్జౌ

45 దేశాలు, 40 క్రీడాంశాలు, 12500కి పైగా క్రీడాకారులు.. ఆసియా క్రీడల మహా సంగ్రామానికి రంగం సిద్ధం. చైనాలోని హౌంగ్జౌ నగరం వేదికగా 19వ ఆసియా క్రీడలు నేటి నుంచి అధికారికంగా ఆరంభం కానున్నాయి. ఆసియా ఖండంలోని 45 దేశాలు పాల్గొంటున్న ప్రతిష్టాత్మక కాంటినెంటల్ ఈవెంట్.. ఒలింపిక్స్ తర్వాత అతిపెద్ద మల్టీస్పోర్ట్స్ ఈవెంట్. హౌంగ్జౌ గేమ్స్‌లో పతకాల సెంచరీపై గురి పెట్టిన భారత్.. 655 మందితో కూడిన జంబో జట్టు 39 క్రీడాంశాల్లో పతక వేటకు బరిలోకి దిగుతోంది. నేడు సాయంత్రం 5.30 గంటలకు ఆరంభ వేడుకలు షురూ కానుండగా.. హాకీ ఇండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ లవ్లీనా బొర్గొహైన్‌లు భారత పతాకధారులుగా వ్యవహరించనున్నారు. ఆరంభ వేడుకలకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, కంబోడియా రాజు సింహమోని, సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్, హాంగ్ కాంగ్ నేత జాన్ లీ, దక్షిణ కొరియా ప్రధానమంత్రి హన్ డక్ సూ సహా పలువురు అంతర్జాతీయ ప్రముఖులు హాజరు కానున్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ సైతం ఆరంభ వేడుకలకు రానున్నారు.



క్రీడాశాఖ మంత్రి చైనా పర్యటన రద్దు : ఆసియా క్రీడల్లో పోటీపడే భారత వుషూ జట్టులోని అరుణాచల్ ప్రదేశ్ అథ్లెట్లను చైనా నిరాకరించింది. భారత అథ్లెట్లుగా అరుణాచల్ ప్రదేశ్ క్రీడాకారులు ఆసియా క్రీడల్లో పోటీపడటాన్ని చైనా అనుమతించలేదు. ఆసియా క్రీడల స్ఫూర్తికి విఘాతం కలిగించేలా డ్రాగన్ దేశం వ్యవహరించటంతో భారత క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చైనా పర్యటన రద్దు చేసుకున్నారు. ఆసియా క్రీడల ఆరంభ వేడుకలకు హాజరు కావాల్సిన ఠాకూర్.. నిరసనగా హౌంగ్జౌకు వెళ్లటం లేదని అధికారులు తెలిపారు. 19వ ఆసియా క్రీడలు అక్టోబర్ 8న ముగింపు వేడుకలతో ముగియనున్నాయి.

హౌంగ్జౌలో తెలంగాణ ముద్ర!

- ఆసియా క్రీడల పతక రేసులో మనోళ్లు
- శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్

2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట.. మన అథ్లెట్ల ఉత్తమ ప్రదర్శనకు 2022 హౌంగ్జౌ ఆసియా క్రీడలు చక్కటి వేదిక. ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది పాలనలో అద్వితీయ ప్రోత్సాహం అందించగా, ఇప్పుడు కాంటినెంటల్ పోటీల్లో తెలంగాణ ముద్ర వేసేందుకు మన అథ్లెట్లు సిద్ధంగా ఉన్నారని శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. నేటి నుంచి ఆసియా క్రీడలు ఆరంభం కానుండగా.. హౌంగ్జౌ గేమ్స్‌కు తెలంగాణ అథ్లెట్ల సన్నద్ధత, పతక అవకాశాలపై ఆయన మాట్లాడారు.

నవతెలంగాణ-హైదరాబాద్



» ఆసియా క్రీడల్లో తెలంగాణ అథ్లెట్ల అవకాశాలు ఎలా ఉన్నాయి?

19వ ఆసియా క్రీడల్లో తెలంగాణ ముద్ర స్పష్టంగా కనిపించనుంది. తెలంగాణ నుంచి 16 మందితో కూడిన బృందం హౌంగ్జౌ క్రీడా గ్రామానికి వెళ్లనుంది. పతక వేటలో నిలిచేది 13 మంది అథ్లెట్లే అయినా.. మనోళ్లు అందరూ పసిడి పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. నిఖత్ జరీన్, ఇషా సింగ్, ఆకుల శ్రీజ, వృతి అగర్వాల్, అగసార నందినిలు తెలంగాణ గర్వపడే ప్రదర్శన చేస్తారనే విశ్వాసం ఉంది. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాల పంట పండించిన జోరు, ఉత్సాహం ఆసియా క్రీడల్లోనూ మన అథ్లెట్లు కొనసాగిస్తారని అనుకుంటున్నాం.

» అథ్లెట్లను హౌంగ్జౌ క్రీడలకు ఏ విధంగా సన్నద్ధం చేశారు?

రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అసమాన ప్రోత్సాహం అందిస్తుంది. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే అథ్లెట్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు, సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. సహజంగా ఆసియా క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు సంబంధిత జాతీయ క్రీడా సమాఖ్య శిక్షణ శిబిరాలు, ప్రత్యేక ట్రైనింగ్ అందజేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం, శాట్స్ నుంచి సైతం క్రీడాకారులకు సహకారం అందించాం.

» కీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటీ?

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించటంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అగ్రస్థానంలో ఉంది. మునుపెన్నడూ ఎరుగని రీతిలో అథ్లెట్లకు రూ. కోట్ల నగదు ప్రోత్సాహకాలు, విలువైన ఇంటి స్థలాలు, అకాడమీలకు అవసరమైన భూమి అందించాం. సింధు, అరుణా రెడ్డి, నిఖత్ జరీన్, ఇషా సింగ్, సానియా మీర్జా, పుల్లెల గోపీచంద్, సాక్షి మాలిక్, మిథాలీ రాజ్, ప్రవీణ్ ఉప్పల, నందిత వీర్లపల్లిలు రాష్ట్ర ప్రభుత్వం, శాట్స్ నుంచి నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన విజేతలకు సైతం ఆకర్షణీయ నగదు బహుమతులు అందజేస్తాం.

» తెలంగాణ నుంచి ఎక్కువగా మహిళా అథ్లెట్లే ఉన్నారు?

ఆసియా క్రీడల్లో పోటీపడుతున్న 14 మంది తెలంగాణ అథ్లెట్లలో 11 మంది అమ్మాయిలే. తెలంగాణ నారీ శక్తికి ఇది తిరుగులేని నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రోత్సాహం కల్పిస్తుంది. ఆ విధానాల ప్రతిఫలాలు ఇప్పుడు క్రీడా రంగంలోనూ చూస్తున్నాం. తెలంగాణ అథ్లెట్లు మన రాష్ట్రానికి మాత్రమే కాదు యావత్ దేశానికి సైతం గర్వ కారణం. తాజా ఆసియా క్రీడల్లోనూ మన అమ్మాయిలే పసిడి వేటలో ముందంజలో ఉన్నారు.

» ప్రపంచ శ్రేణి అథ్లెట్ల తయారీలో శాట్స్ పాత్ర?

గత ఆరు నెలల సమయంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) బృహత్తర కార్యక్రమాలు చేపట్టింది. సీఎం కప్, ట్రైక్రీడా ఉత్సవాలు, క్రీడా యువ సమ్మేళనాలు సహా చలో మైదాన్ కార్యక్రమాలు చేపట్టాం. ఈ క్రీడా పోటీల్లో పోటీపడిన క్రీడాకారులు భవిష్యత్‌లో అంతర్జాతీయ ఈవెంట్లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించగలరు. ఓ వైపు ప్రపంచ శ్రేణి అథ్లెట్ల పురోగతికి సహకారం అందిస్తూనే, మరోవైపు వరల్డ్ క్లాస్ అథ్లెట్లను తయారు చేయటంపై దృష్టి సారించాం. తెలంగాణ గ్రామీణ క్రీడాకారుల సత్తా రానున్న జాతీయ క్రీడల్లో ప్రస్ఫుటం కానుంది.

క్వార్టర్‌ఫైనల్లో భారత్

చైనీస్‌తైపీపై మెరుపు విజయం

హౌంగ్జౌ : 19వ ఆసియా క్రీడల్లో భారత వాలీబాల్ జట్టు సంచలన ప్రదర్శన కొనసాగుతోంది. ఆసియా గేమ్స్‌లో చివరగా 1986లో పతకం సాధించిన వాలీబాల్ జట్టు.. హౌంగ్జౌ వేదికగా గత వైభవం దిశగా అడుగులు వేస్తోంది. మెన్స్ వాలీబాల్ గ్రూప్ దశలో తొలుత దక్షిణ కొరియాపై విజయం సాధించిన భారత్.. తాజాగా చైనీస్ తైపీపై గెలుపొందింది. 2018 జకర్తా గేమ్స్ కాంస్య పతక విజేత చైనీస్ తైపీపై టీమ్ ఇండియా మెరుపు విజయం నమోదు చేసింది. శుక్రవారం జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో వరుస సెట్లలో టీమ్ ఇండియా గెలుపు ఢంకా మోగించింది. 25-22, 25-22, 25-21తో చైనీస్ తైపీని భారత్ చిత్తు చేసింది. చైనీస్ తైపిపై విజయం అంత సులువుగా దక్కలేదు. ఓ దశలో తొలి సెట్‌లోనే 15-20తో వెనుకంజ వేసిన టీమ్ ఇండియా వేగంగా పుంజుకుంది. టీమ్ ఇండియా స్పైకర్లు సమిష్టిగా మెరవటంతో మెరుగైన జట్టుపై విజయం సాధ్యమైంది. గ్రూప్ దశలో దక్షిణ కొరియా, చైనీస్ తైపీలను ఓడించిన భారత్.. క్వార్టర్‌ఫైనల్లో కఠిన సవాల్ ఎదుర్కోనుంది. ఆసియా నం.2 జట్టు జపాన్‌తో క్వార్టర్‌ఫైనల్లో భారత్ తలపడనుంది. జపాన్‌తో పోరుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని భారత కెప్టెన్ వినిత్ రాయ్ అన్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.